PRAJASAKTI Regd.No. 15795/68
సిటీ◆
ప్రజాశక్తి
ప్రతి అక్షరం ప్రజల పక్షం
Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu
సంపుటి : 45 సంచిక : 81 | విజయవాడ, బుధవారం 22 అక్టోబర్ 2025 | 8 + 8 పేజీలు వెల : 5.50
Vol No | Vijayawada, Wednesday 22 October 2025 | Rs

టారిఫ్‌లతో గ్లోబల్ కంపెనీలకు దెబ్బ
- రెండేళ్లలో రూ.3 లక్షల కోట్ల నష్టం

3

డోలీలోనే గిరిజన యువతి మృతి

2



డోలీ మోతతో సుమిత్రను ఆస్పత్రికి తీసుకెళ్తున్న కుటుంబీకులు

విశాఖ ఉక్కులో
మరో 500 మందిపై వేటు
దీపావళి ముందు రోజు కార్మికుల బతుకుల్లో చీకట్లు

- కేంద్ర ప్రభుత్వ షరతుల్లో భాగంగానే
- నోరు మెదపని కూటమి పార్టీలు



ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో

వెలుగుల పండగ దీపావళికి దేశ వ్యాప్తంగా ప్రజానీకం సిద్ధమౌతున్న వేళ విశాఖ స్టీలు ప్లాంటులో భిన్నమైన పరిస్థితులు నెలకొన్నాయి. పండగకు కొన్ని గంటలముందు ఉక్కు యాజమాన్యం తీసుకున్న నిర్ణయం కార్మికుల బతుకుల్లో చీకట్లు నింపింది. ఒకరు, ఇద్దరు కాదు. ఏకంగా 500 మంది కాంట్రాక్టు కార్మికులను విధుల నుండి తొలగిస్తున్నట్లు యాజమాన్యం జారీ చేసిన ఉత్తర్వులు ఒక్కసారిగా కలకలం రేపాయి. కేంద్ర ప్రభుత్వ ప్రైవేటీకరణ నిర్ణయం నేపథ్యంలో మెడమీద కత్తి వేలాడుతున్న విషయం తెలిసినప్పటికీ, పండుగ ముందు రోజు ఇంత నిర్లాక్షణ్యంగా వ్యవహరించడం చర్చనీయాంశంగా మారింది. ఉక్కు నగరంలో ఈ విషయం కలకలం రేపింది. యాజమాన్యపు ఈ తీరు పట్ల తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది. వైజాగ్ స్టీల్‌ప్లాంట్ కోసం కేంద్ర ప్రభుత్వం 11.440 కోట్ల రూపాయల ప్యాకేజిని ప్రకటించిన సంగతి తెలిసిందే. ఆ ప్యాకేజి నిధుల కోసం కేంద్రం పెట్టిన షరతుల్లో భాగంగానే కాంట్రాక్టు కార్మికుల పొట్టగొడుతున్నారన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. కేంద్రం విడతల వారీగా నిధులు విదిలిస్తుండగా దానికి తగ్గట్టుగానే కాంట్రాక్టు కార్మికులను ఉక్కు యాజమాన్యం విధుల నుండి తొలగిస్తోంది. తమ కృషి వల్లే విశాఖ ఉక్కుకు ప్యాకేజి వచ్చిందని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి లోకేష్‌లు పదే పదే చెబుతున్న విషయం తెలిసిందే. అదే సమయంలో కార్మికుల తొలగింపు గురించి మాత్రం ఆ కూటమి పార్టీల నేతలు పెదవి విప్పడం లేదు. తాజాగా 500 మంది తొలగింపుతో ఇంకా ఇవ్వాల్సిన రూ.1,400 కోట్ల పైచిలుకు ప్యాకేజీలో కొంత ఉక్కు యాజమాన్యానికి దక్కే అవకాశాలున్నాయని తెలుస్తోంది.

స్థానికేతరులకు అవకాశం?

తొలగించిన కాంట్రాక్టు కార్మికుల స్థానంలో తాత్కాలిక పాస్‌లతో కొత్తవారిని చేర్చుకోవాలని కేంద్ర ప్రభుత్వం నుండి సూచనలు వచ్చినట్లు చెబుతున్నారు. దీంతో ఇప్పటికే తొలగించిన వేలాదిమంది స్థానంలో కొత్త వారిని తీసుకోవడానికి ప్రయత్నాలు ప్రారంభమైనాయి. అయితే, స్థానికులకు కాకుండా ఇతర రాష్ట్రాల్లో తక్కువ కూలికి పనిచేయడానికి ముందుకు వచ్చేవారిని పిలిపిస్తున్నట్లు సమాచారం. మరోవైపు కార్మికుల కొరతతో రా మెటీరియల్ హేండ్లింగ్ ప్లాంట్ (ఆర్‌ఎంహెచ్‌పి) నాలుగు నెలలుగా నడవలేని పరిస్థితికి వచ్చింది.

ఉసురుపోసుకుంటున్న కేంద్రం

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం విశాఖ ఉక్కు కార్మికుల ఉసురుపోసుకుంటోంది. తాజాగా 500 మంది కార్మికులను ప్రైవేటీకరణ కోసం తొలగించింది. గతంలో తొలగించబడిన కార్మికుల్లో ముగ్గురు ఆందోళనతో ఈ నెలలో చనిపోయారు. ప్యాకేజీని చూపించి నెలకు వెయ్యి మందిని తొలగించాలనే కుట్రలకు ప్రభుత్వం పాల్పడుతోంది. ఇది చాలా దారుణమైన విషయం. స్థానికులను తొలగించడమే లక్ష్యంగా చేసుకుని బయట రాష్ట్రాల నుంచి కార్మికులు (బ్లాక్‌లెగ్స్)ను దొడ్డిదారిన కేంద్రం ప్రవేశపెడుతోంది.

-సిహెచ్.నర్సింగరావు,
సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి



సిపిఐ రాష్ట్ర కార్యదర్శిగా ఈశ్వరయ్య

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సిపిఐ రాష్ట్ర కార్యదర్శిగా గుజ్జల ఈశ్వరయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. విజయవాడలోని ఆంధ్రప్రదేశ్ సిపిఐ రాష్ట్ర సమితి సమావేశం మంగళవారం జరిగింది. ఈ సమావేశంలో పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డి రాజా, కార్యదర్శి రామకృష్ణ పాండా, కార్యవర్గ సభ్యులు రావుల వెంకయ్య, అక్కినేని వనజ పాల్గొన్నారు. పార్టీ నాయకులు పి దుర్గాభవానీ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా జి ఈశ్వరయ్య పేరును జాతీయ కార్యదర్శి కె రామకృష్ణ ప్రతిపాదించగా, ముప్పాళ్ళ నాగేశ్వరరావు బలపర్చారు. కడప జిల్లాకు చెందిన ఈశ్వరయ్య విద్యార్థి దశ నుంచి ఎఐఎస్ఎఫ్, ఎఐవైఎఫ్‌లో క్రియాశీలకమైన పాత్ర పోషించారు. ప్రజా సమస్యల పరిష్కారంపై నిరంతర పోరాటాలు నిర్వహించారు. ఇప్పటి వరకూ సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా, ఎపి రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులుగా బాధ్యతలు నిర్వహించారు.

2027 ఫిబ్రవరి లోగా...

- డిఎ బకాయిలపై సర్కారు తాజా ఉత్తర్వులు
- ఉద్యోగుల ఆగ్రహంతో 'రిటైర్మెంటు' జిఓ నుండి వెనకడుగు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉద్యోగుల్లో వ్యక్తమైన తీవ్ర ఆగ్రహంతో డిఎ బకాయిలకు రిటైర్మెంట్‌కు ముడిపెడుతూ జారీ చేసిన ఉత్తర్వుల నుండి రాష్ట్ర ప్రభుత్వం వెనకడుగు వేసింది. ఏకపక్షంగా జారీ చేసిన ఆ ఉత్తర్వుల స్థానంలో 2027 ఫిబ్రవరిలోగా డిఎ బకాయిలను చెల్లిస్తామంటూ తాజాగా జిఓ జారీ చేసిది. ఈ మేరకు మంగళవారం రాత్రి 62వ నెంబర్ జిఓను ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్ కుమార్ విడుదల చేశారు. 2024 జనవరి 1 నుంచి ఈ ఏడాది సెప్టెంబరు 30వ తేదీ వరకూ డిఎ బకాయిలను 2027 ఫిబ్రవరిలోపు 4 వాయిదాల్లో చెల్లించనున్నట్లు తాజా జిఓలో పేర్కొన్నారు. 2026 ఏప్రిల్‌లో బకాయిల్లో 10 శాతం మొత్తాన్ని, మిగిలిన 90 శాతం మొత్తాన్ని ఆగస్టు, నవంబరు, 2027 ఫిబ్రవరిలో 3 సమాన వాయిదాల్లో చెల్లించనున్నట్లు ఉత్తర్వుల్లో వివరించారు. వచ్చే ఏడాది ఏప్రిల్‌లో చెల్లించే 10 శాతం మొత్తాన్ని ఒపిఎస్, పిటిడి ఉద్యోగులకు, జిపిఎఫ్ ఖాతాకు జమ చేయనున్నట్లు, సిపిఎస్ ఉద్యోగులకు ప్రాన్ (పిఆర్ఎఎన్) ఖాతాలో చెల్లించనున్నట్లు పేర్కొన్నారు. ఇపిఎఫ్ (95) ఉద్యోగులకు డిఎ బకాయిలను ఇపిఎస్-95 నియమాల ప్రకారం లెక్కించి తదననుగుణంగా చెల్లించనున్నట్లు వెల్లడించారు. పిటిడి ఉద్యోగులతో సహా సిపిఎస్ ఉద్యోగులకు ఆ మొత్తాన్ని నగదు రూపంలో చెల్లిస్తామని, ఇపిఎఫ్ 95 ఉద్యోగులకు డిఎ బకాయిలను ఇపిఎస్-95 నియమాల ప్రకారం చెల్లించనున్నట్లు ఉత్తర్వులో పేర్కొన్నారు. అంతకుముందు బకాయిలను రిటైర్‌మెంట్‌తో ముడిపెడుతూ జారీ చేసిన 60,61 జిఓలపై ఉద్యోగుల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. కొన్ని ఉద్యోగ సంఘాలతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చర్చలు జరిపిన అనంతరం ఈ జిఓలు జారీ అయిన విషయం తెలిసిందే. అయితే, చర్చల సందర్భంగా ప్రస్తావనకు రాని అంశాలను ఉత్తర్వుల్లో పేర్కొనడం పట్ల ఉద్యోగుల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమైంది. 2024 జనవరి 1వ తేదీ నుంచి డిఎను మంజూరు చేస్తున్నట్లు ప్రకటించిన ప్రభుత్వం ఈ ఏడాది సెప్టెంబరు వరకూ 21 నెలల డిఎ బకాయిలను ఉద్యోగ విరమణ అనంతరం వారి ఖాతాలకు జమ చేయనున్నట్లు, మరణించిన ఉద్యోగుల విషయంలో వారసులకు అందించనున్నట్లు పేర్కొనడం కలకం రేపింది. రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా డిఎ బకాయిలను ఉద్యోగ విరమణ అనంతరం జమ చేస్తామని పేర్కొన్నారంటూ ఆగ్రహం వ్యక్తమైంది. గత ఏడాదే ప్రకటించాల్సిన పిఆర్‌సి విషయంలో స్పష్టత ఇవ్వకపోవడం, 16 నెలలుగా ఐఆర్ మంజూరుపైన నిర్ణయం ప్రకటించకపోవడం కూడా చర్చనీయాంశంగా మారింది. ఈ నేపథ్యంలో డిఎ ప్రకటిస్తూ జారీ చేసిన ఉత్తర్వులను తక్షణమే సవరించాలని యూటిఎఫ్ డిమాండ్ చేసింది.

ఈ మేరకు ఆ సంఘ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎన్.వెంకటేశ్వర్లు, కెఎస్ఎస్ ప్రసాద్‌లు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఎస్సి, ఎస్టి ఉపాధ్యాయుల సంఘం, ఎపి ఎస్‌టిఎఫ్‌లు కూడా ఈ మేరకు డిమాండ్ చేశాయి.

డ్వాక్రా, మెప్మా ఉత్పత్తులకు మార్కెటింగ్

సమీక్షలో సిఎం చంద్రబాబునాయుడు



అవని వార్షిక సంచికను ఆవిష్కరిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తదితరులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు ఎన్ని రంగాల్లో అవకాశాలు ఉంటే అన్ని రంగాలనూ ఉపయోగించుకోవాలని అధికారులకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సూచించారు. సెర్ప్, మెప్మా విభాగాలపై మంగళవారం నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ డ్వాక్రా సంఘాల ఏర్పాటు తరువాత వాళ్లలో చైతన్యం వచ్చిందన్నారు. ప్రస్తుతం మహిళా సంఘాలు రూ.20,739 కోట్లను పొదుపు చేస్తున్నాయన్నారు. డ్వాక్రా, మెప్మా ఉత్పత్తులకు అంతర్జాతీయ స్థాయిలో బ్రాండింగ్ రావాలని, వారి టాలెంట్‌ను గుర్తించడం, స్థానికంగా ఉండే వనరులను సద్వినియోగం చేసుకోవడం, టెక్నాలజీని ఉపయోగించుకోవడం వంటి అంశాల ద్వారా వారి అభివృద్ధికి తోడ్పాటు అందించాలని చెప్పారు. అరకు కాఫీ, మిల్లెట్లు ఈ రెండిటి కాంబినేషన్లో అవుట్‌లెట్లు ఏర్పాటుచేసే ఆలోచన చేయాలన్నారు. మహారాష్ట్ర బ్యాంబూ మిషన్ పాలసీ తెచ్చిందని, దానిపై అధ్యయనం చేయాలని సూచించారు. సీడ్‌కల్చర్, గుర్రపుడెక్కతో ఉత్పత్తులు చేయొచ్చని పేర్కొన్నారు. ఎగ్‌కార్ట్, ఆక్వా కార్ట్, మిల్లెట్‌కార్ట్ వంటి వి ప్రయోగాత్మకంగా చేపట్టాలని కోరారు. డ్వాక్రా సంఘాల్లోనూ పిహెచ్‌డి చేసిన మహిళలు ఉన్నారని వారిని గుర్తించి ఉపయోగించుకోవచ్చని తెలిపారు.

నేడు యుఎఇకి చంద్రబాబు : దుబాయ్‌లో రోడ్‌షో

రాష్ట్రానికి పెట్టుబడుల సమీకరణలో భాగంగా సిఎం చంద్రబాబు బుధవారం దుబాయ్ వెళ్లనున్నారు. వచ్చే నెల 14, 15 తేదీల్లో విశాఖలో జరిగే పెట్టుబడుల సమ్మిట్లో పాల్గొనేందుకు వివిధ సంస్థల ప్రతినిధులను ఆహ్వానించేందుకు అక్కడ మూడు రోజులపాటు పర్యటించనున్నారు. వివిధ అంతర్జాతీయ సంస్థల యాజమాన్యం, ప్రతినిధులతో చర్చిస్తారు. బుధవారం ఉదయం హైదరాబాద్ నుండి బయలుదేరనున్న చంద్రబాబు దుబాయ్ చేరుకుని అక్కడ సిఐఐ ఆధ్వర్యాన నిర్వహించే రోడ్‌షోలో పాల్గొంటారు. తొలిరోజు ఎపిఎన్ఆర్‌టి ఆధ్వర్యాన నిర్వహిస్తున్న తెలుగు డయాస్పోరా సమావేశంలో పాల్గొంటారు. ఐదు కంపెనీలకు చెందిన పారిశ్రామిక ప్రతినిధులతో చర్చిస్తారు. శోభాగ్రూప్, షరాఫ్‌డిజి, ట్రాన్స్‌వరల్డ్ గ్రూప్, లూథా గ్రూప్, దుబాయ్ ఫ్యూచర్ ఫౌండేషన్ సంస్థల ప్రతినిధులతో సిఎం సమావేశమవుతారు. ఇండస్ట్రియల్, ఐటి పార్కులు, లాజిస్టిక్స్, వేర్ హౌసింగ్ సదుపాయాలు, పోర్టులు, షిప్ మేనేజ్‌మెంట్ వంటి రంగాల్లో పెట్టుబడులపై ఆయా సంస్థల ప్రతినిధులతో చర్చిస్తారు. ఈ పర్యటనలో మంత్రులు టిజి భరత్, బిసి జనార్ధన్‌రెడ్డి, సిఎం సెక్రటరీ కార్తికేయమిశ్రా, ఇండస్ట్రీస్ సెక్రటరీ యువరాజ్, ఎపి ఇడిబి సిఇఒ సాయికాంత్ వర్మ, రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్ సిఇఒ ధాత్రిరెడ్డి పాల్గొంటారు. విశాఖలో పార్టనర్‌షిప్ సమ్మిట్‌ను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ప్రభుత్వం ప్రధానిని ఆహ్వానించింది. సింగపూర్, ఆస్ట్రేలియా వంటి దేశాల్లో సిఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ రోడ్‌షోలు కూడా నిర్వహించారు.

తిరుమలలో కుండపోత

- తీవ్ర ఇబ్బందుల ఎదుర్కొన్న యాత్రికులు
- నెల్లూరు, కృష్ణా జిల్లాల్లో నీట మునిగిన వరి చేలు
- నేడు, రేపు కోస్తాంధ్ర, రాయలసీమలో భారీ వర్షాలు : విపత్తుల నిర్వహణ సంస్థ
- పిడుగుపాటుకు ఇద్దరు మృతి



నెల్లూరు జిల్లా అనంతసాగరం మండలం పాతాలపల్లెలో భారీ వర్షానికి పడిపోయిన వరి చేలు

ప్రజాశక్తి- యంత్రాంగం

నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో తిరుపతి, నెల్లూరు జిల్లాల్లో మంగళవారం భారీ వర్షాలు కురిశాయి. కృష్ణా జిల్లాలో ఈదురు గాలులతో కూడిన వర్షం పడింది. తిరుమలలో కుండపోత వర్షం పడడంతో శ్రీవారి యాత్రికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. తిరుమల శ్రీవారి దర్శనం చేసుకుని అనంతరం వెలుపలకు వచ్చిన యాత్రికులు తలదాచుకునేందుకు షెడ్ల వైపునకు పరుగులు తీస్తున్నారు. ఎడతెరిపిలేని వర్షానికి చలి తీవ్రత పెరగడంతో వణికిపోయారు. తిరుపతి జిల్లా చిలమానూరులో 79 మిల్లీమీటర్లు, మన్నారు పోలూరులో 69.7, గొల్లగుంటలో 68.5, పాపమాంబపురంలో 64.5, కొండూరులో 63, వెంకటగిరిలో 57, నెల్లూరు జిల్లా ఆత్మకూరులో 77.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు విపత్తుల నిర్వహణ సంస్థ ఎండి ప్రఖర్‌జైన్ తెలిపారు. తిరుపతి జిల్లా వడమాటపేట మండలం లక్ష్మమ్మ కండ్రిగలోని కొత్త చెరువుకు గండి పడింది. రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు శ్రీకాళహస్తి పట్టణంలోని ప్రధాన మురుగు నీటి కాలువ ఓటేరు పోటెత్తి ప్రవహించడంతో పరీవాహక లోతట్టు వీధులు ముంపునకు గురయ్యాయి. ఇళ్లల్లోకి మురుగు, వరద నీరు చేరడంతో మిగతా 7లో

చందన మోహనరావు ఇకలేరు

ప్రజాశక్తి- కలెక్టరేట్ (విశాఖపట్నం)



చందన బ్రదర్స్, సిఎంఆర్ వ్యవస్థాపకులు చందన మోహనరావు (82) సోమవారం విశాఖలో మృతి చెందారు. కొంతకాలంగా అస్వస్థతతో బాధపడుతున్న ఆయన కన్నుమూయడంతో విశాఖలోని వస్త్ర వ్యాపార దుకాణాలన్నీ మూసివేసి సంతాపం ప్రకటించారు. మోహనరావుకు ముగ్గురు కుమార్తెలు. 1943లో తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రిలో జన్మించిన ఆయన 1972లో హోల్‌సేల్ వ్యాపారం ప్రారంభించారు. రామచంద్ర క్లాత్ షోరూమ్, ఆ తర్వాత 1982లో చందన కంచి శారీస్ రాజమండ్రిలో ప్రారంభించారు. 1984లో విశాఖ జగదాంబ జంక్షన్లో చందన బ్రదర్స్ పేరుతో వస్త్ర వ్యాపారాన్ని ప్రారంభించి ఉమ్మడి రాష్ట్రంలో విస్తరించారు. జ్యూయలరీ రంగంలోనూ ప్రసిద్ధిగాంచారు. తన అల్లుడు మావూరి వెంకటరమణ ప్రోద్బలం తో సిఎంఆర్ షాపింగ్‌మాల్‌ను 2002లో విశాఖలో ప్రారంభించారు. మోహనరావు అంత్యక్రియలు సోమవారం ఆనందపురం శ్మశానవాటికలో జరిగాయి. ఆయన మృతికి పలువురు ప్రముఖులు, వ్యాపారవేత్తలు సంతాపం తెలిపారు.

విదేశీ దరఖాస్తులకే కొత్త ఫీజు

- ఎఫ్-1, ఎల్-1 వీసాదారులకు వర్తించదు
- హెచ్1బి వీసా జారీలో మినహాయింపులు



వాషింగ్టన్ : భారతీయులు సహా ప్రస్తుతం అమెరికా వీసాలు ఉన్న వారందరికీ అమెరికా ప్రభుత్వం కొన్ని మినహాయింపులు ఇచ్చింది. ప్రస్తుతం ఇతర వీసాలు ఉండి, హెచ్-1బి వీసా కోసం దరఖాస్తు చేసుకోవాలని అనుకునేవారు ఇటీవల ప్రకటించిన విధంగా లక్ష డాలర్ల ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదంటూ అమెరికా సిటిజన్‌షిప్ అండ్ ఇమ్మిగ్రేషన్ సర్వీసెస్ (యుఎస్‌సిఐఎస్) నిర్ణయం తీసుకుంది. ఆ దేశంలో ఇప్పటికే చదువుతున్న విదేశీ విద్యార్థులకు భారీ ఊరట కల్పించింది. హెచ్1బి వీసా కోసం పెంచిన లక్ష డాలర్ల ఫీజు దేశం బయట నుంచి వచ్చే దరఖాస్తులకు మాత్రమే వర్తిస్తుందని తెలిపింది. దీంతో అమెరికాలో చదువుకొని, ఉద్యోగాల కోసం హెచ్1బి వీసాకు దరఖాస్తు చేసుకొనే విదేశీ విద్యార్థులు లక్ష డాలర్లు చెల్లించాల్సిన అవసరం లేదని వెల్లడించింది. బయట దేశాల నుంచి వచ్చే దరఖాస్తుదారులు ఈ మొత్తం చెల్లించాల్సి ఉంటుందని పేర్కొంది. దీంతో యుఎస్‌లో ఉద్యోగం చేయాలనుకునే విదేశీయులు ముందుగా కొన్నాళ్లు అక్కడ చదివేలా షరతు విధించినట్లయ్యింది. ఇది సెప్టెంబర్ 21న హెచ్1బి వీసాపై యుఎస్ ప్రకటన వెలువడిన దరఖాస్తులకు మాత్రమే వర్తిస్తుందని పేర్కొంది. ఇంతకు ముందు దాఖలైన, ఆమోదం పొందిన వాటికి అంతకుముందున్న నిబంధనలు మాత్రమే అమలవుతాయి. పెంచిన లక్ష డాలర్ల ఫీజు కూడా చెల్లించాల్సిన అవసరం లేదు.

ఎఫ్1 విద్యార్థి వీసాదారులు, హెచ్1బికి మారాలనుకునే వారితో పాటు, ఇప్పటికే చెల్లుబాటు అయ్యే హోదాతో యుఎస్‌లో ఉన్నవారికి ఈ లక్ష డాలర్ల ఫీజు నుంచి మినహాయింపు ఉంటుంది. ఇప్పటికే అక్కడ ఉద్యోగం చేస్తూ హెచ్1బి వీసా కలిగి ఉన్నవారికి.. దాని రెన్యువల్, సవరణలు వంటి వాటి కోసం దరఖాస్తు చేసుకునే వారికి కూడా ఈ మినహాయింపు ఉంటుంది. అదే విధంగా విదేశాల్లోని ఉద్యోగుల కోసం హెచ్1బి వీసా దరఖాస్తు చేసుకొనే కంపెనీలు కూడా ఈ మినహాయింపులను కోరవచ్చని యుఎస్‌సిఐఎస్ పేర్కొంది. అమెరికా జాతీయ ప్రయోజనాలకు ఆ విదేశీయుడి పాత్ర ఎలా ఉందో వివరించే అధికారిక లేఖ ఆ సంస్థలు సమర్పించాల్సి ఉంటుందని తెలిపింది.

ఉగ్రదాడి ప్రణాళిక భగ్నం

- పంజాబ్‌లో ఇద్దరు అరెస్టు, గ్రెనేడ్ లాంచర్ స్వాధీనం

ఛండీగఢ్ : ఉగ్రదాడి ప్రణాళికను పంజాబ్ పోలీసులు మంగళవారం భగ్నం చేశారు. ఉగ్రవాదులతో సంబంధం ఉన్న ఇద్దరిని అరెస్టు చేశారు. గ్రెనేడ్, లాంచర్‌ను స్వాధీనం చేసుకున్నారు. కేంద్ర సంస్థల భాగస్వామ్యంతో అమృత్‌సర్ గ్రామీణ పోలీసులు ఈ ఆపరేషన్ పూర్తి చేశారు. ఈ వివరాలను పంజాబ్ డిజిపి గౌరవ్ యాదవ్ ఎక్స్‌లో పోస్టు చేశారు. ప్రాథమిక దర్యాప్తులో పాకిస్తాన్ ఐఎస్ఐ నుంచి నిందితులకు ఆయుధాలు అందినట్లు వెల్లడయింద ని తెలిపారు. అమృత్‌సర్‌లోని వాడాలికి చెందిన మోహక్‌దీప్ సింగ్ అలియాస్ మోహక్, భాగ ఛినా గ్రామ నివాసి ఆదిత్య అలియాస్ అధిని అరెస్టు చేసినట్లు చెప్పారు. మరిన్ని వివరాల కోసం నిందితులను విచారిస్తున్నట్లు తెలిపారు. అమృత్‌సర్ గ్రామీణంలోని ఘరిండా పోలీస్‌స్టేషన్‌లో పేలుడు పదార్థాల చట్టం, బిఎన్ఎస్ సెక్షన్ల కింద ఎఫ్ఐఆర్ నమోదైంది.

రాజుకుంటున్న ఎన్నికల వేడి

- 143మంది అభ్యర్థులను ప్రకటించిన ఆర్‌జెడి
- పోటీ నుండి తప్పుకున్న జెఎంఎం
- బీహారీలు మోసపోయారన్న తేజస్వి యాదవ్
- బిజెపి ఒత్తిళ్లతోనే ముగ్గురు వైదొలిగారన్న ప్రశాంత్ కిషోర్



బీహార్‌లోని పిప్రా అసెంబ్లీ స్థానం నుంచి సిపిఎం అభ్యర్థిగా పోటీ చేస్తున్న రాజ్‌మంగళ్ ప్రసాద్ ప్రచార దృశ్యం

పాట్నా, న్యూఢిల్లీ : బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో అధికార, ప్రతిపక్షాలు హోరాహోరీ తలపడుతున్నాయి. ప్రధాన ప్రతిపక్ష పార్టీ అయిన ఆర్‌జెడి 143 మంది అభ్యర్థులను ప్రకటించింది. ఓటమి భయంతో బిజెపి, జెడియు కూటమి పలు కుతంత్రాలకు పాల్పడుతోందని ఇండియా బ్లాక్ నేతలు విమర్శిస్తున్నారు. నామినేషన్ దాఖలు చేసిన తర్వాత ససారామ్ సీటు నుండి పోటీ చేస్తున్న ఆర్‌జెడి అభ్యర్థిని పోలీసులు అరెస్టు చేశారు. ఇలా నామినేషన్లు వేసిన తర్వాత ఇప్పటివరకు ముగ్గురు అభ్యర్థులు పోలీసుల కస్టడీలో వున్నారు.

143మందితో ఆర్‌జెడి అభ్యర్థుల జాబితా

రెండో దశ ఎన్నికల ప్రక్రియకు అక్టోబర్ 20తో నామినేషన్ల దాఖలుకు గడువు ముగిసింది. దీంతో సోమవారం ఆర్‌జెడి 143 మందితో అభ్యర్థుల జాబితాను విడుదల చేసింది. వీరిలో 24 మంది మహిళలు, 16 మంది ముస్లింలు ఉన్నారు. కాంగ్రెస్ కూడా ఆరుగురు అభ్యర్థులతో జాబితాను విడుదల చేసింది. మొత్తం ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ 60 స్థానాల్లో బరిలోకి దిగనుంది.

బీహారీలు ఇక మోసపోకండి : తేజస్వి యాదవ్

కేంద్ర హోంమంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలపై ఆర్‌జెడి నేత తేజస్వి యాదవ్ విరుచుకుపడ్డారు. ఇటీవల ఒక ఇంటర్వ్యూలో హోం మంత్రి అమిత్ షా మాట్లాడుతూ, బీహార్‌లో పారిశ్రామికాభివృద్ధికి భూమి కొరతే ప్రధాన అడ్డంకిగా వుందని వ్యాఖ్యానించారు. ఆ వ్యాఖ్యలపై తేజస్వి స్పందించారు. 20 సంవత్సరాలు బీహార్‌లో ప్రభుత్వాన్ని నడిపిన తర్వాత కూడా హోం మంత్రి సాకులు చెబుతున్నారు. గుజరాత్‌లో మాత్రమే కంపెనీలు ఏర్పాటు చేస్తున్నారు. కానీ ఆ కంపెనీల్లో పనిచేసే కార్మికులు మాత్రం బీహార్‌కు చెందినవారు. బీహారీలు ఇకపై మోసపోకండి అని తేజస్వి యాదవ్ రాష్ట్ర మిగతా 7లో

పార్కు స్థలానికి ఖాళీ స్థల పన్ను

- తప్పుపట్టిన హైకోర్టు

ప్రజాశక్తి-అమరావతి

మాస్టర్ ప్లాన్‌లో రిక్రియేషన్ కోసం కేటాయించిన పార్కు స్థలానికి ఖాళీ స్థల పన్ను (వేకెంట్ ల్యాండ్ ట్యాక్స్) విధించడాన్ని హైకోర్టు తప్పుపట్టింది. జాగాను వాణిజ్య అవసరాలకు మార్పు చేస్తేనే వేకెంట్ ల్యాండ్ ట్యాక్స్ విధించాలంది. విజయవాడలో ఒక స్థలానికి 2013–16 ఏడాదులకు వేకెంట్ ల్యాండ్ ట్యాక్స్ చెల్లించాలంటూ విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ 2017లో ఇచ్చిన నోటీసును రద్దు చేస్తూ జస్టిస్ నూనెపల్లి హరినాథ్ తీర్పు చెప్పారు. మొఘల్రాజ్‌పురంలో వివి రామకృష్ణకు చెందిన 14,990 చదరపు గజాల స్థలం ఉంది. మాస్టర్ ప్లాన్‌లో 0.35 సెంట్ల స్థలాన్ని నివాస అవసరాలకు, మిగిలిన 3.26 ఎకరాల స్థలాన్ని వినోద కార్యకలాపాలకు కేటాయింపు ఉంది. 0.35 సెంట్ల భూమిలో షెడ్డులు నిర్మిస్తే దానికి ఆస్తి పన్ను యజమాని కడుతున్నారు. అయితే, 2013–16 సంవత్సరాలకు 3.26 ఎకరాల భూమికి రూ.1.16 కోట్లు వేకెంట్ ల్యాండ్ ట్యాక్స్ చెల్లించాలని కమిషనర్ ఇచ్చిన నోటీసును యజమాని హైకోర్టులో సవాల్ చేశారు. మున్సిపల్ యాక్ట్‌లోని సెక్షన్ 212 (2) ప్రకారం వేకెంట్ ల్యాండ్ ట్యాక్స్ చెల్లించాల్సిన అవసరం లేదని న్యాయమూర్తి తేల్చారు. పార్కు కోసం వదిలిన స్థలాన్ని వాణిజ్య అవసరాల కోసం వాడుకునేందుకు వీలుగా భూ మార్పిడికి 2018లో అధికారులు అనుమతినిచ్చారని గుర్తు చేశారు. కమిషనర్ జారీ చేసిన నోటీసును రద్దు చేస్తూ తీర్పు చెప్పారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం–అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా – 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

అసాంఘిక కార్యకలాపాలకు అండగా భీమవరం డిఎస్‌పి

- పశ్చిమ గోదావరి ఎస్‌పిని నివేదిక కోరిన పవన్‌కల్యాణ్

ప్రజాశక్తి – అమరావతి బ్యూరో

అసాంఘిక వ్యవహారాలకు భీమవరం డిఎస్‌పి అండగా ఉండటాన్ని తీవ్రంగా పరిగణించాలని, సివిల్ వివాదాల్లో పోలీసులు తలదూర్చకుండా చూడాలని పశ్చిమ గోదావరి జిల్లా ఎస్‌పిని డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ ఆదేశించారు. అంతేకాకుండా ఆ డిఎస్‌పి వ్యవహారశైలిపై తక్షణమే నివేదిక పంపాలన్నారు. భీమవరం డిఎస్‌పి జయసూర్య వ్యవహారాలపై తరచూ పెద్దయెత్తున ఫిర్యాదులు అందుతున్న నేపథ్యంలో పవన్‌కల్యాణ్ మంగళవారం ఎస్‌పికి ఫోన్ చేసి మాట్లాడారు. భీమవరం డిఎస్‌పి పరిధిలో పేకాట శిబిరాలు పెరిగాయని, సివిల్ తగాదాల్లో పోలీసులు, ఆయన జోక్యం చేసుకుంటున్నారని, కూటమి నేతల పేర్లు వాడుకుంటున్నారనే ఫిర్యాదులు తమ కార్యాలయానికి అందుతున్నట్లు తెలిపారు. డిఎస్‌పిపై వచ్చిన ఆరోపణలను హోంమంత్రి, డిజిపికి తెలపాలని తన కార్యాలయ అధికారులను పవన్‌కల్యాణ్ ఆదేశించారు.

జిఓ 11ను రద్దు చేయాలి

- గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంక్షేమ సమాఖ్య

ప్రజాశక్తి – అమరావతి బ్యూరో

గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు సాధారణ విధుల పేరిట వాలంటరీ విధులను అప్పజెబుతూ ప్రభుత్వం విడుదల చేసిన జిఓ నెంబరు 11ను వెంటనే రద్దు చేయాలని ఎపి గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంక్షేమ సమాఖ్య డిమాండ్ చేసింది. ఈ మేరకు సమాఖ్య గౌరవాధ్యక్షులు ఎవి నాగేశ్వరరావు, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె అనూరాధ, ఎం గురుస్వామి మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉద్యోగంలో చేరిన రోజు గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు జాబ్‌చార్ట్ నిర్ణయించారని, ప్రస్తుతం ప్రత్యేకంగా జిఓ జారీ చేయడం కక్ష పూరితంగా ఉందన్నారు. నెల రోజుల నుంచి వాలంటీర్లు నిర్వహించిన ఇంటింటి సర్వే, సేవలు తమకు అప్పజెప్పొద్దని గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని రోడ్లపైకి వచ్చి నిరసనలు తెలుపుతున్నారన్నారు.

సర్వేలు రద్దు చేయకపోగా, వాటిని తప్పనిసరి చేస్తూ జిఓలు జారీ చేయడాన్ని నేతలు తప్పుపట్టారు.

శాంతిభద్రతలు ఉంటేనే రాష్ట్రానికి పెట్టుబడులు

- పోలీసులకు సవాల్‌గా మారిన సోషల్ మీడియా నేరాలు
- పోలీస్ అమరవీరుల దినోత్సవంలో సిఎం చంద్రబాబు



పోలీస్ అమరవీరుల దినోత్సవ కార్యక్రమంలో మాట్లాడుతున్న సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి – అమరావతి బ్యూరో

శాంతి భద్రతలుంటేనే పెట్టుబడులు సాధ్యమని, రాష్ట్రంలో నెలకొన్న శాంతిభద్రతలపై విశ్వాసంతోనే గూగుల్ వంటి పెద్ద ఐటి కంపెనీ రాష్ట్రానికి వచ్చిందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. శాంతి భద్రతలను రక్షించడంలో పోలీస్‌శాఖ కీలకపాత్ర పోషించాలన్నారు. పోలీస్ అమరవీరుల దినోత్సవం సందర్భంగా మంగళగిరి ఎపిఎస్‌పి 6వ బెటాలియన్ గ్రౌండ్‌లో మంగళవారం నిర్వహించిన కార్యక్రమానికి సిఎం చంద్రబాబు హాజరయ్యారు. తొలుత పోలీస్ అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించారు. పోలీస్ సంస్మరణ దినోత్సవం ఫ్లాగ్ ధరించి ఫ్లాగ్ ఫండ్‌కు విరాళం ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర పోలీస్ అంటే ఓ బ్రాండ్ అని, దానికి మరింత వన్నె తెచ్చేలా పనిచేయాలని పిలుపునిచ్చారు. దేశంలో శాంతి భద్రతల కోసం విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసు అమరవీరులకు నివాళులర్పిస్తున్నానన్నారు. ప్రతియేటా అక్టోబరు 21న పోలీసు అమరవీరుల దినోత్సవం జరుపుకుంటున్నామని, వారి త్యాగాలను, బలిదానాన్ని గుర్తు చేసుకుంటూ స్ఫూర్తి పొందుతున్నామన్నారు. విధి నిర్వహణలో 192 మంది పోలీసులు అమరులయ్యారని, వీరందరికీ నివాళులర్పిస్తున్నట్లు తెలిపారు. ప్రజల రక్షణ కోసం ప్రాణాలను సైతం ఫణంగా పెడుతున్న పోలీసులంటే తనకు గౌరవమని, పోలీసులు చేసేది నిస్వార్థ సేవ అని కొనియాడారు. తమ పెట్టుబడులు సురక్షితంగా ఉంటాయనే నమ్మకంతోనే పరిశ్రమలు, కంపెనీలు వస్తాయన్నారు. రాష్ట్ర పోలీసులు ఫ్యాక్షనిజం, నక్సలిజం, రౌడీయిజాన్ని అణచివేయడంలో ఎంతో పేరు తెచ్చుకున్నారని సిఎం అన్నారు. క్రిమినల్స్ అప్‌డేట్ అవుతున్నారని, వారి ఆట కట్టించాలంటే పోలీసుశాఖ కూడా అప్‌డేట్ కావాలన్నారు. సాంకేతికంగా పోలీస్ శాఖను బలోపేతం చేస్తున్నామని, సిసి టివి కెమెరాలు, డ్రోన్లు, ఫోన్ సిగ్నల్స్, గూగుల్ టేకవుట్ వంటి టెక్నాలజీని విస్తృతంగా ఉపయోగించాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఈగల్, శక్తి బృందాల ఏర్పాటుతో రాష్ట్ర పోలీస్ ఆదర్శంగా నిలిచిందన్నారు. సమాజంలో అశాంతి సృష్టించి లబ్ధి పొందడం కోసం కొందరు రాజకీయ ముసుగులో కొత్త నేరగాళ్లుగా తయారయ్యారన్నారు. వీళ్ల క్రిమినల్స్ కంటే అత్యంత ప్రమాదకరమని, మతాలు, కులాల మధ్య చిచ్చు పెడుతున్నారని అన్నారు. ఫేక్ ప్రచారాలు చేసి ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారని, ఇలాంటి వారి విషయంలో పోలీసులు మరింత కఠినంగా వ్యవహరించాలన్నారు. సోషల్ మీడియా ద్వారా జరుగుతున్న దుష్ప్రచారం, నేరాలు పోలీసులకు అతి పెద్ద ఛాలెంజ్ అని తెలిపారు. పోలీస్ వ్యవస్థ బలోపేతానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో సిఎస్ విజయానంద్, హోంమంత్రి వంగలపూడి అనిత, డిజిపి హరీష్‌కుమార్ గుప్తా, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

డోలీలోనే గిరిజన యువతి మృతి

ప్రజాశక్తి – జికె.వీధి, కురుపాం

గాయపడ్డ గిరిజన యువతికి సకాలంలో వైద్యం అందక, సరైన రోడ్డు మార్గం లేక డోలీలోని మృతి చెందిన ఘటన అల్లూరి జిల్లా జికె.వీధి మండలంలో మంగళవారం చోటుచేసుకుంది. రింతాడ పంచాయతీ నేలపాడు గ్రామానికి చెందిన పాంగి సుమిత్ర (22) కాఫీ తోటలో పనికి వెళ్లారు. ప్రమాదవశాత్తు ఎత్తైన మార్గం నుంచి జారిపడిపోయారు. సరైన రోడ్డు సదుపాయం లేకపోవడంతో డోలీలో ఆమెను ఆస్పత్రికి తరలిస్తుండగా పరిస్థితి విషమించి మార్గమధ్యలోనే మృతి చెందారు.

రోడ్డు సదుపాయం ఉంటే తమ కుమార్తె ప్రాణాలను కాపాడుకునే వారిమని ఆమె తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు. ఇప్పటికైనా తమ గ్రామానికి రోడ్డు సదుపాయం కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

డోలీపై గెడ్డ దాటించి ఆస్పత్రికి తరలింపు

ఇటీవల కురుస్తున్న వర్షాలకు పార్వతీపురం మన్యం జిల్లా నీలకంఠాపురం, మహేంద్రపురానికి మధ్య ఉన్న గెడ్డవాగు పొంగి అధికంగా వరద వచ్చింది. దీంతో, అనారోగ్యంతో బాధపడుతున్న కురుపాం మండలం నీలకంఠాపురం పంచాయతీ మహేంద్రపురం గ్రామానికి చెందిన కొండగొర్రి తుని అనే గిరిజన మహిళను డోలీపై గెడ్డ దాటించాల్సి వచ్చింది. అనంతరం అక్కడి నుంచి నీలకంఠాపురం పిహెచ్‌సికి తరలించాల్సి తరలించారు.

బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్‌లతో దేశానికి ముప్పు

- బీహార్ ఎన్నికలు కీలకం
- సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి రాజా



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మతోన్మాద బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ విధానాలతో దేశానికి పెను ప్రమాదం పొంచి ఉందని సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి రాజా తెలిపారు. దేశ ప్రయోజనాలను విస్మరించి, అమెరికా అధ్యక్షులు ట్రంప్ కనుసన్నల్లో ప్రధాని మోడీ నడుస్తున్నారని విమర్శించారు. విజయవాడలోని దాసరి భవన్‌లో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీహార్ ఎన్నికల ఫలితాలు కీలకంగా మారనున్నాయని, అవి దేశంపై తీవ్ర ప్రభావం చూపుతాయని, అక్కడి బిజెపి కూటమి ఓటమే లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. గత సార్వత్రిక ఎన్నికల్లో బిజెపికి ప్రజలు పూర్తి స్థాయి మెజార్టీ ఇవ్వలేదన్నారు. అది ఆ పార్టీకి ఒక రాజకీయ పరాజయమని పునరుద్ఘాటించారు. చంద్రబాబు, నితీశ్‌కుమార్ మద్దతుతోనే కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కొనసాగుతుందని తెలిపారు. సిఎం చంద్రబాబు.. మోడీ, అమిత్ షాకు ఎందుకు తలవంచుతున్నారని ప్రశ్నించారు. రాష్ట్రానికి ఇచ్చిన ఒక్క హామీనీ కేంద్రం అమలు చేయలేదన్నారు. ప్రత్యేక హోదా, సరైన ఆర్థిక మద్దతు ఇవ్వలేదన్నారు. అన్ని సెక్యులర్, డెమొక్రటిక్ పార్టీలతో కలిసి బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్‌కు వ్యతిరేకంగా బలమైన ఐక్య పోరాటానికి సిపిఐ సన్నద్ధమవుతుందన్నారు. దీనికి దేశ వ్యాప్తంగా ఉన్న వామపక్ష పార్టీలు, ప్రజాతంత్ర, లౌకిక పార్టీలు కలిసి రావాలని, ఇది దేశానికి చారిత్రాత్మక అవసరమని నొక్కి చెప్పారు. రాజకీయ అంశాలపై, పార్టీ రాష్ట్ర స్థాయి, దేశ వ్యాప్తంగా ప్రచారాలు నిర్వహించనుందన్నారు. ఈ నెల 25న ఢిల్లీలో జరగనున్న సిపిఐ జాతీయ కార్యవర్గ సమావేశాల్లో జాతీయ స్థాయి ఉద్యమ కార్యాచరణపై చర్చిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో సిపిఐ జాతీయ కార్యదర్శులు రామకృష్ణ పాండా, కె రామకృష్ణ, రాష్ట్ర నూతన కార్యదర్శి జి ఈశ్వరయ్య, రాష్ట్ర నాయకులు ముప్పాళ్ల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కొండపల్లి రిజర్వ్ ఫారెస్ట్ బ్లాక్‌లో అక్రమ మైనింగ్ కార్యకలాపాలపై చర్యలు చేపట్టండి

- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఇఎఎస్ శర్మ లేఖ



ఇఎఎస్ శర్మ

ప్రజాశక్తి- ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

రాష్ట్రంలోని కృష్ణా జిల్లాలోగల కొండపల్లి రిజర్వ్ ఫారెస్ట్ బ్లాక్‌లో అక్రమ మైనింగ్ కార్యకలాపాల పెరుగుదల వల్ల అటవీ ప్రాంతం వేగంగా తగ్గిపోతోందని, దీనిపై తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి కేంద్ర ప్రభుత్వ మాజీ కార్యదర్శి ఇఎఎస్.శర్మ లేఖ రాశారు. ఆ వివరాలను మంగళవారం ఆయన మీడియాకు వెల్లడించారు. 'పట్టణీకరణ, అక్రమ మైనింగ్, క్వారీయింగ్ ఇతర అటవీయేతర కార్యకలాపాల కారణంగా రాష్ట్రంలో అటవీ ప్రాంతం గణనీయంగా తగ్గిపోయింది. అటవీ వనరులు, జీవవైవిధ్యం ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకుని అటవీ విస్తీర్ణాన్ని తగ్గించే ఏ కార్యకలాపాలనూ అనుమతించవద్దని రాష్ట్రాలను సుప్రీంకోర్టు పలుమార్లు హెచ్చరించింది. రాష్ట్ర అటవీ శాఖ దీనిని పట్టించుకోకుండా రాష్ట్ర గనుల శాఖ మైనింగ్ కార్యకలాపాలకు అనుమతులు ఇస్తోంది. అక్రమ మైనింగ్‌కు పరోక్షంగా సహకరిస్తోంది. కొండపల్లి రిజర్వ్ ఫారెస్ట్ బ్లాక్ 120 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో విస్తరించి ఉంది. అరుదైన వృక్షజాలం, జంతుజాలంతో కూడిన ఏకైక అటవీ ప్రాంతం. ఇది విజయవాడ నగరానికి 'గ్రీన్ లంగ్'గా ఉపయోగపడుతోంది. ఈ అడవి తగ్గిపోతే విజయవాడ పర్యావరణ నాణ్యత, కొత్త రాజధాని అమరావతి నాణ్యతపై తీవ్ర ప్రభావం చూపుతుంది. ఒక పరిశోధనా అధ్యయనం ప్రకారం గత దశాబ్దంలో కొండపల్లి రిజర్వ్ ఫారెస్ట్‌లో మైనింగ్ క్వారీయింగ్ కార్యకలాపాలు అనూహ్యంగా పెరిగాయి. వీటిని నియంత్రించకపోతే రిజర్వ్ ఫారెస్ట్ బ్లాక్ విస్తీర్ణం, దాని వనరులు, పర్యావరణ విలువలు దెబ్బతింటాయి. విజయవాడ, అమరావతి పట్టణ సమూహాలలో జీవన నాణ్యతపై ప్రభావం పడుతుంది. అమరావతి నిర్మాణ పనులు కూడా కొండపల్లి రిజర్వ్ ఫారెస్ట్ నాశనాన్ని వేగవంతం చేస్తాయని ఆ అధ్యయనం అధికారులను హెచ్చరించింది. మైనింగ్ ప్రభావాన్ని తెలియజేసే ఆధారాలు, వాదనలను కోర్టుల ముందు సరిగా సమర్పించకపోవడం వల్ల, కోర్టుల మధ్యంతర ఆదేశాలను అడ్డం పెట్టుకుని మైనింగ్ కార్యకలాపాలు నిరాటంకంగా కొనసాగుతున్నాయి. రాజకీయ ఒత్తిళ్ల కారణంగా అమరావతి నిర్మాణ పనుల అత్యవసరాలను తీర్చడానికి కొండవీటి ఫారెస్ట్ బ్లాక్‌లో రాష్ట్ర గనుల శాఖ కొత్త మైనింగ్ లీజులను మంజూరు చేస్తుండడం మరింత ఆందోళనకరం. ఈ కారణంగా విజయవాడ, అమరావతిల్లో నివసించే ప్రజలు వాయు కాలుష్యం బారిన పడతారు. తక్షణం రిజర్వ్ ఫారెస్ట్ బ్లాక్‌లో అక్రమ మైనింగ్, క్వారీయింగ్ కేసులను గుర్తించడానికి సమగ్ర తనిఖీలు చేపట్టాలి. మైనింగ్ కార్యకలాపాలను నిలిపివేసి, బాధ్యులందరిపై కేసులు నమోదు చేయాలి. పెండింగ్‌లో ఉన్న అన్ని కోర్టు కేసులనూ సమీక్షించి, మధ్యంతర స్టేలను రద్దు చేయడానికి కోర్టుల ముందు అటవీ రక్షణకు తగిన ఆధారాలు, వాదనలను సమర్పించాలి' అని ఈ లేఖలో ఇఎఎస్.శర్మ పేర్కొన్నారు. ఈ కాపీని కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖకు పంపినట్టు ఆయన తెలిపారు.

రాష్ట్రంలో 7 డయాలసిస్ కేంద్రాలు

- మంత్రి సత్యకుమార్ యాదవ్

ప్రజాశక్తి – అమరావతి బ్యూరో

కిడ్నీ రోగులకు ఉపశమనం కలిగించేలా రాష్ట్రంలో అదనంగా 7 డయాలసిస్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. విజయనగరం జిల్లా ఎస్.కోట, పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం, చిత్తూరు జిల్లా పీలేరు ఆస్పత్రుల్లో, పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేట, ఎస్‌పిఎస్‌ఆర్ నెల్లూరు జిల్లా వెంకటగిరి, బాపట్ల జిల్లా అద్దంకి, నంద్యాల జిల్లా సున్నిపెంట సిహెచ్‌సి ఆస్పత్రుల్లో డయాలసిస్ కేంద్రాలు కొత్తగా రానున్నాయని తెలిపారు. ప్రతి కేంద్రంలో ప్రతిరోజూ మూడు సెషన్ల ద్వారా 15 మందికి రక్తశుద్ధి జరుగుతుందన్నారు. పిఎం నేషనల్ డయాలసిస్ ప్రోగ్రామ్ కింద ఏర్పాటుకానున్న ఒక్కొక్క కేంద్రంలో సుమారు రూ.75 లక్షలు విలువ చేసే మూడు రక్త శుద్ధి యంత్రాలు, పరికరాలు సమకూరుతాయన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం 232 కేంద్రాలు పనిచేస్తుండగా, కొత్తవాటితో కలుపుకుని 239కు చేరుతాయన్నారు. ఎస్.కోట, సీతంపేట ఆస్పత్రుల్లో కొత్త డయాలసిస్ కేంద్రాలు త్వరలో పనిచేయనున్నాయని, పిపిపి విధానంలో వీటి నిర్వహణ బాధ్యతలను ఓ సంస్థకు అప్పగించినట్లు మంత్రి పేర్కొన్నారు. మిగిలిన కేంద్రాలను కూడా పిపిపి విధానంలో టెండర్లు పిలవాలని రాష్ట్ర వైద్య మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థను రాష్ట్ర వైద్యారోగ్యశాఖ కోరిందన్నారు.

లక్ష్మీనాయుడు హత్యకేసు విచారణకు 'ఫాస్ట్‌ట్రాక్ కోర్టు'

- బాధిత కుటుంబానికి పరిహారం
- సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి – అమరావతి బ్యూరో

కందుకూరు నియోజకవర్గం, గుడ్లూరు మండలం, దారకానిపాడులో ఇటీవల హత్యకు గురైన తిరుమలశెట్టి లక్ష్మీనాయుడు కేసును ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఏర్పాటు చేసి వేగంగా దర్యాప్తు పూర్తి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. హత్య కేసు దోషులకు కఠినంగా శిక్ష పడాలన్నారు. కోర్టులో కేసు విచారణ కోసం ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్‌ను నియమించాలని ఆదేశాలిచ్చారు. సచివాలయంలో మంగళవారం హోంమంత్రి వంగలపూడి అనిత, మున్సిపల్‌శాఖ మంత్రి పి నారాయణ, డిజిపి హరీష్‌కుమార్ గుప్తా, కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరు నాగేశ్వరరావుతో సమావేశమయ్యారు.

మృతుని కుటుంబానికి పరిహారం

లక్ష్మీనాయుడు హత్యతో జీవనాధారం కోల్పోయిన కుటుంబాన్ని ఆదుకునేందుకు ఆయన భార్యకు రెండెకరాల భూమి, రూ.5 లక్షల నగదు పరిహారం అందించాలని అధికారులను సిఎం ఆదేశించారు. మృతునికి ఇద్దరు పిల్లలకు రెండెకరాల చొప్పున భూమి, రూ.5 లక్షల చొప్పున ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయాలని సూచించారు. అంతేకాకుండా ఇద్దరు పిల్లలను చదివించే బాధ్యతను ప్రభుత్వం తీసుకుంటుందన్నారు. ఇదే ఘటనలో గాయపడిన పవన్‌కు నాలుగెకరాల భూమి, రూ.5 లక్షల నగదుతో పాటు ప్రభుత్వమే వైద్య ఖర్చులు భరిస్తుందన్నారు. భార్గవ్‌కు కూడా రూ.3 లక్షల నగదు, ఆస్పత్రి ఖర్చులు చెల్లించాలని సిఎం పేర్కొన్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించేది లేదు


రాష్ట్రంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని సిఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ తరహా వ్యవహారాలపై ప్రభుత్వం చాలా సీరియస్‌గా ఉందన్నారు. శాంతి భద్రతల విషయంలో అత్యంత కఠినంగా వ్యవహరిస్తామని తెలిపారు.

బాణసంచా పేలుడు మృతులకు రూ.15 లక్షల చొప్పున పరిహారం

అంబేద్కర్ కోనసీమ జిల్లా రాయవరంలో బాణసంచా పేలుడు తయారీ కేంద్రం ఘటనలో మృతుల కుటుంబాలకు రూ.15 లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలని సిఎం చంద్రబాబు ఆదేశించారు.

ఘటనకు సంబంధించిన నివేదికను ముఖ్యమంత్రికి అధికారులు అందజేశారు. ఒకే షెడ్డులో 14 మంది కార్మికులు వీటిని తయారు చేస్తుండగా ఈ ఘటన జరిగిందని నివేదికలో పేర్కొన్నారు. బాణ సంచా తయారీలో ఇనుప పరికరాలు ఉపయోగించడం వల్లే రాపిడికి మంటలు చెలరేగి ఒక్కసారిగా పేలుడు చోటుచేసుకుందని తెలిపారు.

జిఎస్‌ఎంఎతో హెచ్‌సిఎల్‌టెక్‌లో భాగస్వామ్యం



నోయిడా : మొబైల్ ఇకోసిస్టమ్ సేవల గ్లోబల్ సంస్థ జిఎస్‌ఎంఎతో భాగస్వామ్యం కుదుర్చుకున్నట్లు ప్రముఖ గ్లోబల్ టెక్నాలజీ కంపెనీ అయిన హెచ్‌సిఎల్‌టెక్ వెల్లడించింది. దీంతో జిఎస్‌ఎంఎ ఓపెన్ గేట్‌వే ఇనిషియేటివ్‌ను ముందుకు తీసుకెళ్లడానికి సహకరిస్తున్నట్లు పేర్కొంది. ఈ ఇనిషియేటివ్ కస్టమర్ అనుభవాలను మెరుగుపరచడం, అప్లికేషన్ డెవలప్‌మెంట్‌ను సులభతరం చేయడం, గ్లోబల్ టెలికాం పరిశ్రమ కోసం కొత్త ఆదాయ మార్గాలను పెంచుతుందని తెలిపింది.

హెచ్‌సిఎల్‌టెక్ టెలికాం నెట్‌వర్క్‌లో ఓపెన్‌నెస్, ఆదాయ ఉత్పత్తి, ఇన్నోవేషన్‌ను వేగవంతం చేయడంలో తన నిబద్ధతను బలోపేతం చేస్తోందని పేర్కొంది. హెచ్‌సిఎల్‌టెక్ తన అత్యాధునిక సొల్యూషన్స్, లోతైన డొమైన్ నైపుణ్యం, విస్తృత సిస్టమ్ ఇంటిగ్రేషన్ అనుభవాన్ని ఈ ఇనిషియేటివ్‌ను గ్లోబల్‌గా విస్తరించడానికి ఉపయోగించనున్నట్లు తెలిపింది.

ప్రజాశక్తి డిప్యూటీ ఎడిటర్‌గా వి. రాంభూపాల్



ప్రజాశక్తి – అమరావతి బ్యూరో

ప్రజాశక్తి డిప్యూటీ ఎడిటర్‌గా వి. రాంభూపాల్ నియమితులైనారు. ప్రజాశక్తి రాష్ట్ర కార్యాలయం ప్రజాశక్తి భవన్‌లో మంగళవారం జరిగిన జనరల్ బాడీ సమావేశంలో ఈ విషయం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రజాశక్తిలో నాణ్యత, వృత్తినైపుణ్యం మరింతగా అభివృద్ధి చెందాలని అన్నారు. ఈ కృషిలో సిబ్బంది భాగస్వామ్యం కావాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన ప్రపంచ రాజకీయాల్లో చోటుచేసుకున్న ఆయా సందర్భాలలో పత్రికల పాత్రను వివరించారు. ఎనభయ్యోవ దశకంలో ప్రారంభమైన ఆర్థిక సంస్కరణలు, వాటికి వ్యతిరేకంగా జరిగిన పోరాటాలను ప్రస్తావించారు. ఏకధృవ ప్రపంచంగా మారిన అనంతరం నెలకొన్న ప్రతికూల పరిస్థితులను సైతం ప్రజాశక్తి వంటి పత్రికలు ఎదుర్కొని నిలిచాయని తెలిపారు. ప్రస్తుతం ట్రంప్ టారిఫ్ టెర్రరిజం, అమెరికన్ సామ్రాజ్యవాదంపై ప్రపంచవ్యాప్తంగా వ్యతిరేకత వ్యక్తమవుతోందన్నారు. మారుతున్న పాఠకుల అభిరుచులకు తగ్గట్టుగా పత్రికలోనూ, డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లలోనూ మార్పులు తేవాల్సి ఉందన్నారు. ప్రజాశక్తి సంపాదకులు బి. తులసీదాస్ మాట్లాడుతూ కరోనా కాలంలో ఎదుర్కొన్న ఇబ్బందులు, సమిష్టి కృషితో వాటిని అధిగమించిన తీరును వివరించారు. డిప్యూటీ ఎడిటర్‌గా నియమితులైన వి. రాంభూపాల్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుండి ఉద్యమాల్లో పాల్గొన్న అనుభవం ఉందని, సిబ్బంది అందరి సహకారంతో పత్రికను మరింత ముందుకు తీసుకువెళ్తామని అన్నారు. సిజిఎం అచ్యుతరావు మాట్లాడుతూ క్లిష్టమైన పరిస్థితులను అధిగమించి పురోగమిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమానికి జనరల్ మేనేజర్ హరికిషోర్ అధ్యక్షత వహించారు.

నాలుగు డిఎలకు ఒక డిఎనా?

- ఉద్యోగ సంఘాలతో చేసుకున్న ఒప్పందం అన్యాయం
- సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు

ప్రజాశక్తి – గ్రేటర్ విశాఖ బ్యూరో

ప్రభుత్వ ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో తాజాగా రాష్ట్ర ప్రభుత్వం చేసుకున్న ఒప్పందం ఉద్యోగులకు అన్యాయం తలపెట్టేలా ఉందని, దీనిని సిఐటియు తీవ్రంగా వ్యతిరేకిస్తోందని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు అన్నారు. మంగళవారం విశాఖలోని జగదాంబ జంక్షన్ సిఐటియు జిల్లా కార్యాలయంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్‌తో కలిసి మీడియాతో మాట్లాడారు.

బకాయి పడ్డ నాలుగు డిఎలు ఇవ్వాల్సి ఉండగా ఒక్క డిఎ చెల్లిస్తాననడం దారుణమన్నారు. 2024 ఆగస్టు నుంచి రిటైర్ అయిన ఉద్యోగులకు ఇంతవరకూ గ్రాట్యుటీ, ఇఎల్స్, ఇన్సూరెన్స్ స్కీం సహా బకాయిలు చెల్లించకపోవడం రాష్ట్ర ఆర్థిక పరిస్థితికి అద్దం పడుతోందన్నారు. రాష్ట్రంలోని అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు కార్మికుల కనీస వేతనాల గురించి చంద్రబాబు ప్రభుత్వం ఊసే ఎత్తడం లేదన్నారు. రాష్ట్రంలో ఎన్ని ప్రభుత్వాలు మారినా అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులకు మాత్రం సకాలంలో జీతాలు చెల్లించడం లేదని వివరించారు. ఎమ్మెల్యేల జీతాలను మాత్రం రూ.90 వేల నుంచి అన్ని అలవెన్సులు కలిపి సుమారు రూ.రెండు లక్షల వరకూ పెంచుకోవడం, ఠంచనుగా నెలయ్యేసరికి ఇవ్వడం జరుగుతుందని విమర్శించారు. కష్టజీవులు, కార్మికుల కంటే వారు చాలా పేదవారా ? అని ప్రశ్నించారు.

మధ్యాహ్న భోజన నిర్వాహకులకు అందని వేతనాలు

రాష్ట్రంలోని మధ్యాహ్న భోజన కార్మికులకు నాలుగు నెలలుగా వేతనాలు చెల్లించడం లేదని, ఇదేనా చంద్రబాబు చెప్పే మంచి ప్రభుత్వమని ప్రశ్నించారు. కార్మికుల పని గంటలను టిడిపి కూటమి ప్రభుత్వం ఎనిమిది గంటల నుంచి 12 గంటలకు పెంచుతూ చట్టసవరణ వంటి చర్యలు చేపట్టడం కార్మికవర్గం పట్ల చంద్రబాబు కక్షపూరిత వైఖరికి దర్పణం పడుతోందన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలతో ప్రభుత్వం ముందుకెళ్లాలనుకుంటే సాగనివ్వబోమని హెచ్చరించారు. తక్షణమే కార్మికులు, ఉద్యోగులపై ప్రభుత్వ ద్రోహపూరిత తీరును విడనాడాలని డిమాండ్ చేశారు.

కొయ్యూరు జెడ్‌పిటిసి హత్య

- భూ వివాదమే కారణం : పోలీసులు

ప్రజాశక్తి- రోలుగుంట, కొయ్యూరు (అనకాపల్లి/అల్లూరి జిల్లాలు)



వారా నూకరాజు (ఫైల్ ఫొటో)

అనకాపల్లి జిల్లా రోలుగుంట మండలం ఎంకె.పట్నం శివారు పెదపేట ఆవరణలో అల్లూరి జిల్లా కొయ్యూరు వైసిపి జెడ్‌పిటిసి సభ్యులు వారా నూకరాజు హత్యకు గురయ్యారు. పోలీసుల కథనం ప్రకారం... ఎంకె.పట్నం శివారు పెదపేట సర్వే నెంబరు 139లో పది ఎకరాల భూమిని నూకరాజు కొంత కాలం క్రితం వేరొక వ్యక్తి నుంచి కొనుగోలు చేశారు. అదే భూమిలో 20 ఏళ్లుగా చటర్జీపురం గ్రామానికి చెందిన గిరిజనులు సాగులో ఉన్నారు. మూడేళ్లుగా ఈ భూమి విషయమై గిరిజనులకు, ఆయనకు మధ్య తగాదాలు జరుగుతున్నాయి. గత ఏడాది ఆ భూమిలో గిరిజనులు సాగు చేస్తున్న పంటను నూకరాజు రెండు ఆటోలపై సుమారు 40 మందిని తీసుకువచ్చి ధ్వంసం చేయించారు. దీంతో, ఇరుగ్రూపుల మధ్య అప్పట్లో పెద్ద ఘర్షణ జరిగింది. ఆయనకు, గిరిజనులకు గాయాలయ్యాయి. ఈ విషయమై నూకరాజుపైనా, సాగు రైతులపైనా బైండోవర్ కేసులు నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో నూకరాజుకు, గిరిజనులకు మధ్య సోమవారం మాటమాటా పెరిగి తీవ్ర స్థాయిలో వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో నూకరాజు హత్యకు గురయ్యారు.

ఈ కేసులో కేదారి రాజబాబు, నీలాపు ఎరకన్న, నీలాపు లచ్చన్న, కేదారి రాజేశ్వరి, ఈదల రాజేశ్వరి, నీలాపు అప్పలనాయుడు, నీలాపు దేవుడులను పోలీసులు అరెస్టు చేశారు. మంగళవారం నర్సీపట్నం ఏరియా ఆస్పత్రి వద్ద నూకరాజు మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. నూకరాజు కుటుంబ సభ్యులను మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ తదితరులు పరామర్శించారు. కూటమి పాలనలో వ్యవస్థలు అస్తవ్యస్తంగా మారాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిందితులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ వైసిపి కార్యకర్తలు నర్సీపట్నం ఏరియా ఆస్పత్రి వద్ద ఆందోళన చేశారు.

కీలక రంగాల మందగింపు

- మూడు నెలల కనిష్టానికి పతనం

న్యూఢిల్లీ : దేశ ఆర్థిక వ్యవస్థకు అత్యంత ముఖ్యమైన ఎనిమిది కీలక రంగాల ఉత్పత్తి భారీగా పడిపోయింది. ఈ ఏడాది సెప్టెంబర్‌లో ఈ రంగాల ఉత్పత్తి ఏకంగా 3 శాతానికి పతనమయ్యింది. బొగ్గు, చమురు, సహజ వాయువు, రిఫైనరీ రంగాలు పేలవ ప్రదర్శనను కనబర్చాయని కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ మంగళవారం ఓ రిపోర్ట్‌లో తెలిపింది. ఇంతక్రితం ఆగస్టులో 6.5 శాతం వృద్ధి చోటు చేసుకుంది. గతేడాది ఇదే సెప్టెంబర్‌లో బొగ్గు, ముడి చమురు, సహజ వాయువు, రిఫైనరీ ఉత్పత్తులు, ఎరువులు, ఉక్కు, సిమెంట్, విద్యుత్ తదితర ఎనిమిది రంగాల ఉత్పత్తి 6.3 శాతంగా నమోదయ్యింది. మొత్తం పారిశ్రామిక ఉత్పత్తిలో వీటి వాటా 42 శాతం పైగా ఉంటుంది.

గడిచిన సెప్టెంబర్‌లో బొగ్గు, ముడి చమురు, సహజ వాయువు, రిఫైనరీ ఉత్పత్తులు వృద్ధిలో క్షీణతను చవి చూశాయి. ఎరువులు, సిమెంట్, విద్యుత్ ఉత్పత్తి మందగించింది. ఉక్కు మాత్రమే మెరుగైన పనితీరును కనబర్చింది. సెప్టెంబర్‌లో బొగ్గు ఉత్పత్తి 1.2 శాతానికి పడిపోయింది. ఆగస్టులో ఇది 11.4 శాతంగా ఉంది. దీంతో పోల్చితే భారీగా తగ్గింది. ఇదే నెలలో ముడి చమురు ఉత్పత్తి 2.4 శాతంగా ఉండగా.. గడిచిన సెప్టెంబర్‌లో 1.3 శాతానికి పతనమయ్యింది. సహజ వాయువు ఉత్పత్తి 3.8 శాతానికి తగ్గింది. రిఫైనరీ ఉత్పత్తులు సెప్టెంబర్‌లో 3.7 శాతానికి పడిపోయాయి. ట్రంప్ టారిఫ్‌లతో దేశంలో ఇటీవల పారిశ్రామిక కార్యకలాపాలు ఒత్తిడిని ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే.

అమెరికా సుంకాలను నిరసిస్తూ ఆందోళనలు

- ట్రంప్ దిష్టిబొమ్మ, చిత్రపటాలు దహనం

ప్రజాశక్తి - యంత్రాంగం

భారత్‌పై అమెరికా అధ్యక్షుడు విధించిన సుంకాలను నిరసిస్తూ రాష్ట్రవ్యాప్తంగా పలు చోట్ల ట్రంప్ దిష్టిబొమ్మను, చిత్రపటాన్ని దహనం చేశారు. సిపిఎం, ఎపి రైతు సంఘం, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఈ నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. ట్రంప్ సుంకాలకు చైనా దీటుగా బదులిస్తుండగా భారత్ మాత్రం మౌనం వహిస్తోందని, ఇప్పటికైనా మోడీ పెదవి విప్పి సమాధానం చెప్పాలని పలువురు నాయకులు డిమాండ్ చేశారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా నిరసనలు తెలిపారు. కాకినాడ జిల్లా తాళ్లరేవు సంతపేట సెంటర్‌లో ధర్నా, అనంతరం ట్రంప్ చిత్రపటాన్ని దహనం చేశారు. ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు మాట్లాడుతూ... ట్రంప్ విధించిన 50 శాతం సుంకాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ట్రంప్ టారిఫ్‌లు భారతదేశంపై తీవ్ర ప్రభావాన్ని చూపుతాయని, ఇప్పటికే ఆక్వా, పత్తి, పాడి, పౌల్ట్రీ, జీడిపప్పు తదితర రంగాలపై ప్రభావం పడిందన్నారు. దీనివల్ల పరిశ్రమలు మూతపడే ప్రమాదం ఉందని, వేలాది మంది కార్మికులు ఉపాధికి దూరమయ్యే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సుంకాల విషయంలో ప్రధాని మోడీ పెదవి విప్పకపోవడం విడ్డూరమన్నారు. దీపావళి సందర్భంగా నరకాసుర దిష్టిబొమ్మకు బదులుగా నేడు ట్రంప్ దిష్టిబొమ్మ చేస్తున్నామన్నారు. గుంటూరు జిల్లా మంగళగిరి మండలం కాజా గ్రామంలో ట్రంప్ చిత్రపటాన్ని దహనం చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ... భారత్‌పై అమెరికా విధించిన సుంకాల మూలంగా మన దేశ ఉత్పత్తులపై అధిక ప్రభావం పడుతోందని తెలిపారు. దీనివల్ల మన వస్తువుల ఎగుమతులకు అవకాశం ఉండదని, మద్దతు ధరలు దక్కక రైతులు తీవ్రంగా నష్టపోతారన్నారు. మేడికొండూరు మండలం పేరేచర్లలో నిరసనలో కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు బి.రామకృష్ణ మాట్లాడారు. పల్నాడు జిల్లా యడ్లపాడులో నిరసన ప్రదర్శన అనంతరం ట్రంప్ చిత్రపటాన్ని దహనం చేశారు.

ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెంలో బాబు జగ్జీవన్‌రావు విగ్రహం వద్ద ట్రంప్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ.రవి పాల్గొన్నారు. అనకాపల్లి జిల్లా కె.కోటపాడు మండలం ఎం.కోడూరులో ట్రంప్ దిష్టిబొమ్మను దహనం చేశారు. నంద్యాల జిల్లా కేంద్రంలోని సాయిబాబా నగర్ సెంటర్ వద్ద ట్రంప్ ఫొటోను దగ్ధం చేసి నిరసన తెలిపారు. జిల్లాలోని డోన్, ఆత్మకూరు, బండి ఆత్మకూరులో ఆందోళన చేపట్టారు. కర్నూలు జిల్లా ఆలూరు, ఆస్పరిలో ట్రంప్ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా ట్రంప్ చిత్రపటాన్ని దహనం చేసి నిరసన తెలిపారు. శింగనమల, పుట్లూరు, గోరంట్ల, సోమందేపల్లి, ధర్మవరం, కదిరిలో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ప్రకాశం, బాపట్ల జిల్లాల్లో పలు చోట్ల ట్రంప్ దిష్టిబొమ్మలను, చిత్రపటాలను దహనం చేశారు. కృష్ణా జిల్లా మొవ్వ, బంటుమిల్లి, గన్నవరంలో నిరసన తెలిపారు.



కాకినాడలో ట్రంప్ చిత్రపటాన్ని దహనం చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు


సదస్సులో మాట్లాడుతున్న కెఎస్ లక్ష్మణరావు

ట్రంప్ సుంకాలకు లొంగిపోయిన మోడీ

- వస్త్ర, రొయ్యలు, ఔషధ రంగాలకు తీవ్ర నష్టాలు
- అమరారెడ్డి వర్ధంతి సందర్భంగా సదస్సులో కెఎస్ లక్ష్మణరావు

ప్రజాశక్తి - తాడేపల్లి (గుంటూరు జిల్లా)

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఎడాపెడా విధిస్తున్న సుంకాలు విషయంలో కేంద్రంలోని మోడీ ప్రభుత్వం పూర్తిగా లొంగిపోయిందని మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు అన్నారు. సిపిఎం నాయకులు మేక అమరారెడ్డి 44 వర్ధంతి సందర్భంగా 'ట్రంప్ సుంకాలు - భారత్‌పై ప్రభావం' అంశంపైన గుంటూరు జిల్లా తాడేపల్లి పట్టణంలో నిర్వహించిన సదస్సుకు డి.శ్రీనివాసకుమారి అధ్యక్షత వహించారు. ఈ సదస్సులో కెఎస్.లక్ష్మణరావు మాట్లాడుతూ భారత్‌పై అమెరికా విధిస్తున్న 50 శాతం సుంకాలు దేశంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని, రాష్ట్రంలోని వస్త్ర పరిశ్రమ, రొయ్యలు, ఔషధాలు తదితర రంగాలకు తీవ్ర నష్టాలొస్తాయని వివరించారు. ఒక్క రొయ్యల వ్యాపారంలోనే రూ.34 వేల కోట్ల నష్టమన్నారు. సినిమాలపైనా సుంకాల దెబ్బ పడిందని తెలిపారు. భారత్ నుండి వెళ్లి అమెరికాలో చదువుకునేవారిపైనా ఈ ప్రభావం తీవ్రంగా ఉందని, అక్కడున్న భారతీయుల కాళ్లకు, చేతులకు బేడీలు వేసి తిప్పి పంపినా మోడీలో చలనం లేదని అన్నారు.

1990లో నూతన ఆర్థిక విధానం ప్రారంభమైన సమయంలో వరల్డ్ ట్రేడ్ ఆర్గనైజేషన్ ఒప్పందం మేరకు ఏ దేశం నుండి ఏ దేశమైనా సరుకులను ఎగుమతులు, దిగుమతులు పన్నుల్లేకుండా చేసుకోవచ్చని అమెరికా ప్రతిపాదించిందని గుర్తు చేశారు. సదస్సులో ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి ఎంఎ చిష్టి, సిపిఎం పట్టణ, రూరల్ కార్యదర్శులు బి.వెంకటేశ్వర్లు, పి.కృష్ణ, నాయకులు జి.సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

టిటిడి ట్రస్ట్‌లకు భారీ విరాళాలు

- 11 నెలల్లో 918.6 కోట్లు

ప్రజాశక్తి- తిరుమల

తిరుమల తిరుపతి దేవస్థానం ట్రస్ట్‌లకు భారీగా విరాళాలు వచ్చాయి. 11 నెలల్లో రికార్డు స్థాయిలో రూ.918.6 కోట్లు విరాళాలు (2024 నవంబర్ 1 నుంచి - 2025 అక్టోబర్ 16వ తేదీ వరకు) దక్కాయి. దాతలకు తగిన గౌరవం, సదుపాయాలు కల్పించడంలో ఎక్కడా లోపం తలెత్తకూడదని టిటిడి చైర్మన్ బిఆర్ నాయుడు ఆదేశాలు ఇచ్చారు. ట్రస్ట్‌లకు విరాళాలతో పాటు పలు నిర్మాణాలు, యంత్రాల కొనుగోలు, సాంకేతిక అభివద్ధికి దాతలు సంపూర్ణ సహకారం అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. అత్యధికంగా ఎస్‌వి అన్నప్రసాదం ట్రస్ట్‌కు రూ.338.8 కోట్ల విరాళం వచ్చింది. ఆఫ్ లైన్ కంటే ఆన్ లైన్ ద్వారానే ఎక్కువ సంఖ్యలో విరాళాలు సమర్పిస్తున్నారు. ఆన్‌లైన్ ద్వారా రూ.579.38 కోట్లు, ఆఫ్‌లైన్ ద్వారా రూ.339.20 కోట్ల విరాళాలు అందించారు.

ఏ ట్రస్ట్‌కు ఎంత...

శ్రీవాణి ట్రస్ట్‌కు రూ.252.83 కోట్లు
శ్రీబాలాజీ ఆరోగ్య వరప్రసాదిని స్కీమ్‌కు రూ.97.97 కోట్లు
ఎస్‌వి ప్రాణదాన ట్రస్ట్‌కు రూ.66.53 కోట్లు
ఎస్‌వి గో సంరక్షణ ట్రస్ట్‌కు రూ.56.77 కోట్లు
ఎస్‌వి విద్యాదాన ట్రస్ట్‌కు రూ.33.47 కోట్లు
బర్డ్ ట్రస్ట్‌కు రూ.30.02 కోట్లు
ఎస్‌వి సర్వశ్రేయాస్ ట్రస్ట్‌కు రూ.20.46 కోట్లు
ఎస్‌వి వేదపరిరక్షణ ట్రస్ట్‌కు రూ.13.87 కోట్లు
ఎస్‌విబిసికి రూ.6.29 కోట్లు
స్విమ్స్‌కు రూ.1.52 కోట్లు

ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ సుబ్బనాయుడు మృతి

- ముగిసిన అంత్యక్రియలు
- పలువురు నివాళి

ప్రజాశక్తి-కావలి

రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్, టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు మాలేపాటి సుబ్బనాయుడు (58) మృతి చెందారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన గుంటూరు మణిపాల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున మరణించారు. ఆయన స్వగ్రామం దగదర్తి మండలంలో కుటుంబసభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. సుబ్బనాయుడు మృతి పట్ల పలువురు నాయకులు సంతాపం తెలిపారు.



పట్టణంలోని ఉదయగిరి బ్రిడ్జి సెంటర్ వద్ద నిర్వహించిన సంస్మరణ సభలో కావలి ఎమ్మెల్యే కావ్యక్రిష్ణారెడ్డి పాల్గొన్నారు. సుబ్బనాయుడు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... టిడిపి కావలి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌గా 2022 నుంచి 2024 వరకు ఎంతో నిబద్ధతతో పనిచేశారని కొనియాడారు. సుబ్బనాయుడు సేవలను గుర్తించి రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్‌గా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నియమించారన్నారు. ఈ సంస్మరణ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున హాజరై పుష్పాంజలి ఘటించారు.

3న కలెక్టరేట్ల వద్ద ఆందోళన

- ఎపి కౌలు రైతు సంఘం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ పథకం వెంటనే అమలు చేయాలని కోరుతూ.. వచ్చే నెల 3న జిల్లాల కలెక్టరేట్ల వద్ద ఆందోళనలకు ఎపి కౌలు రైతు సంఘం రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చింది. కూటమి నేతలు ఎన్నికల ముందు పాత చట్టాన్ని రద్దు చేస్తామని, కొత్త చట్టం తెస్తామని హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చి 16 నెలలవుతున్నా చట్టం తీసుకురాలేదని పేర్కొంది. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వై రాధాకృష్ణ, ఎం హరిబాబు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు శాసనసభలో ప్రత్యేకంగా కొత్త చట్టాన్ని తీసుకొచ్చి, కౌలు రైతులు అందరికీ అన్నదాత సుఖీభవ పథకం కింద లబ్ధిచేకూర్చనున్నట్లు ప్రకటించారని తెలిపారు. గత రెండేళ్లుగా కౌలు రైతులు ఎందో ఆశగా ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు. వాస్తవంగా పంటలు పండించే వారికి పంట రుణాలివ్వాలని ఆందోళనలు చేసినా బ్యాంకులు కౌలు రైతులకు ఇవ్వడం లేదని, అధికారులు పంట సాగు చేస్తున్నవారి పేరుతో ఇ-క్రాప్ నమోదు చేయకుండా భూ యజమాని పేరుతో నమోదు చేస్తున్నారని తెలిపారు. 3న చేపట్టబోయే ఆందోళనలో కౌలు రైతులు ఎక్కువ మంది పాల్గొనాలని కోరారు.

రాష్ట్రంలో పేదరికం 6.06 శాతమేనట!

- సిద్ధమైన గణాంకాలు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

జాతీయ స్థాయితో పోలిస్తే రాష్ట్రంలో పేదరికం గణనీయంగా తగ్గినట్లు ప్రభుత్వం చెబుతోంది. ఈ మేరకు ప్రణాళిక శాఖ 2023-24 వ సంవత్సరపు గణాంకాలను తాజాగా సిద్ధం చేసింది. దీని ప్రకారం జాతీయ స్థాయిలో పేదరికం సగటు 14.96 శాతంగా ఉండగా, రాష్ట్రంలో 6.06 శాతంగానే తేలినట్లు పేర్కొన్నారు. పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల లెక్కలను విడివిడిగా చూస్తే గ్రామీణ ప్రాంతంలో 7.71 శాతం, పట్టణ ప్రాంతాల్లో 2.20 శాతం మాత్రమే పేదరికం ఉన్నట్లు తేల్చారు. ఈ రెండు విభాగాల్లోనూ జాతీయ సగటుకన్నా తక్కువగానే పేదరికాన్ని చూపించారు. నగదు బదిలీ పథకా వల్ల పేదరికం గణనీయంగా తగ్గిపోయినట్లు గణాంకాల్లో పేర్కొన్నారు. అధికారిక లెక్కలు ఎలా ఉన్నప్పటికీ సరైన ఉపాధి లభించక, వ్యవసాయంలో నష్టాల కారణంగా ప్రజలు గ్రామీణ ప్రాంతాల నుండి వలసబాట పడుతున్న విషయం తెలిసిందే. పట్టణాల్లో కూడా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు గణనీయంగా తగ్గుతోంది

నిరుద్యోగం కూడా....

నిరుద్యోగంపె రూపొందించిన గణాంకాలు కూడా ఇదే మాదిరి ఉన్నాయి. 2023-24 ఆర్థిక సంవత్సరంలో 4.1 శాతం మాత్రమే నిరుద్యోగం ఉన్నట్లు అధికారిక గణాంకాలు పేర్కొంటున్నాయి. గ్రామీణ నిరుద్యోగం 3.4 శాతంగా, పట్టణ నిరుద్యోగం 5.9 శాతంగా ఉన్నట్లు చెబుతున్నారు. మొత్తం నిరుద్యోగంలో 15 నుంచి 29 సంవత్సరాల మధ్య వారిలో నిరుద్యోగం 17.5 శాతంగా, మహిళల నిరుద్యోగం 6.9 శాతంగా ఉండగా, పురుషుల్లో నిరుద్యోగం 4.3 శాతంగా ఉన్నట్లు తేల్చారు.

'హైడ్రో' భూతాన్ని తరిమికొడతాం

- గిరిజనులు నిరసన
- 24న పాడేరులో 'చలో కలెక్టరేట్'


ప్రజాశక్తి - అరకులోయ (అల్లూరి జిల్లా)

ఆదివాసీలను జల సమాధి చేసే కార్పొరేట్ హైడ్రో భూతాన్ని తరిమికొడతామంటూ అల్లూరి జిల్లా అరకులోయలో గిరిజనులు నిరసన తెలిపారు. ఈ మేరకు అరకులోయ మండలం తాంగులుగూడ, ఒల్డ్‌పనస గ్రామాల్లో ఆదివాసీ గిరిజన సంఘం, హైడ్రో పవర్ ప్రాజెక్ట్ వ్యతిరేక కమిటీ ఆధ్వర్యంలో 'కార్పొరేట్ నరకాసుర హైడ్రో పవర్ ప్రాజెక్ట్ భూతం' దిష్టిబొమ్మను సోమవారం దహనం చేశారు. ఈ సందర్భంగా ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్ మాట్లాడుతూ నవయుగ, అదాని, శిరిడీ సాయి, మేఘా వంటి కార్పొరేట్ కంపెనీలతో హైడ్రో పవర్ ప్రాజెక్టుల ఏర్పాటుకు రాష్ట్రంలోని టిడిపి కూటమి ప్రభుత్వం ఒప్పందాలు చేసుకుని 51, 13, 2 జిఒలను జారీ చేసిందని తెలిపారు. ఆదివాసీలకు తీవ్ర నష్టం చేకూర్చే హైడ్రో పవర్ ప్రాజెక్టులను రద్దు చేయాలంటూ రెండు నెలలుగా ఆందోళనలు చేస్తున్నా పట్టకపోవడం దారుణమన్నారు. హైడ్రో ప్రాజెక్టుల పనులు ఆపివేశామని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి మోసగించాలని చూస్తున్నారని విమర్శించారు. ఆ ప్రాజెక్టుల విషయంలో ముందుకెళ్తే తీవ్ర పరిణామాలు తప్పవని హెచ్చరించారు. హైడ్రో పవర్ ప్రాజెక్టుల ఒప్పందాలను రద్దు చేయాలంటూ ఈ నెల 24న పాడేరులో చలో కలెక్టరేట్ కార్యక్రమం నిర్వహిస్తామని, ఆదివాసీలు దీన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘం మండల ఉపాధ్యక్షులు కిల్లో జగన్నాథం, కొర్రా మగ్గన్న, తాంగుల హరి, హైడ్రో పవర్ ప్రాజెక్ట్ వ్యతిరేక పోరాట కమిటీ ఇరగాయ పంచాయతీ కన్వీనర్ బురిడి నర్సింగరావు, రవికుమార్, రాజు పాల్గొన్నారు.


తాంగులు గూడలో హైడ్రో భూతం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఆదివాసీలు

టారిఫ్‌లతో గ్లోబల్ కంపెనీలకు దెబ్బ

రెండేళ్లలో రూ.3 లక్షల కోట్ల నష్టం



వాషింగ్టన్ : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పలు దేశాలపై విధించిన అధిక సుంకాలు గ్లోబల్ కార్పొరేట్ కంపెనీలను బెంబేలెత్తుస్తున్నాయి. ఆదాయాలు భారీగా దెబ్బతినవచ్చని రిపోర్టులు వస్తోన్నాయి.

అమెరికా సుంకాల వల్ల గ్లోబల్ కంపెనీలు 35 బిలియన్ డాలర్ల (రూ.3 లక్షల కోట్లు) పైగా అదనపు వ్యయాలు ఎదుర్కొన్నాయని రాయిటర్స్ ఓ రిపోర్ట్‌లో అంచనా వేసింది. ఇది ఆ కంపెనీలకు నష్టంగా మారొచ్చని విశ్లేషించింది. అయితే.. డొనాల్డ్ ట్రంప్ విధించిన సుంకాల నుండి కొత్త వాణిజ్య ఒప్పందాలు కొంత ఉపశమనం కల్పించనున్నాయని పేర్కొంది. ట్రంప్ వాణిజ్య యుద్ధం యుఎస్ సుంకాలను 1930ల నాటి గరిష్ట స్థాయికి తీసుకెళ్లాయి. దీంతో కంపెనీలు తమ ఖర్చు అంచనాలను తగ్గించాయి. మరోవైపు ధరల పెంపు వంటి ప్రణాళికలు రూపొందించాయి.

రాయిటర్స్ విశ్లేషణ ప్రకారం.. 2025లో కంపెనీలు 21 బిలియన్ డాలర్ల నుంచి 22.9 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.2 లక్షల కోట్లు) నష్టాలను ఎదుర్కునే అవకాశాలున్నాయి. వచ్చే ఏడాది 2026లో 15 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.1.3 లక్షల కోట్లు) నష్టం ఉండొచ్చు. దిగ్గజ ఆటోమొబైల్ కంపెనీ టొయోటా 9.5 బిలియన్ల (రూ.83వేల కోట్లు) అంచనాతో అతిపెద్ద నష్టాన్ని ఎదుర్కోనుంది. యూరప్, జపాన్‌తో ట్రంప్ చివరగా కుదుర్చుకున్న ఒప్పందాల వల్ల అనేక కంపెనీలు తమ మునుపటి అత్యధిక నష్ట అంచనాలను తగ్గించాయి. ఉదాహరణకు, స్టెల్లాంటిస్, పెర్నోడ్ రికార్డ్ వంటి కంపెనీలు యూరప్ ఒప్పందం తర్వాత తమ నష్ట అంచనాలను తగ్గించాయి.

కంపెనీ పేరు	నష్టం అంచనా
టొయోటా	9.5 బిలియన్లు
ఫోర్డ్	3 బిలియన్లు
నైక్	1.5 బిలియన్లు
స్టెల్లాంటిస్	.5 బిలియన్లు

చైనాపై టారిఫ్‌లతో కొత్త సవాళ్లు

ట్రంప్ ఇటీవల చైనాపై అదనంగా 100 శాతం సుంకాలను విధించే ఆలోచనను ప్రతిపాదించారు. అయితే ఈ సుంకాలు స్థిరంగా ఉండవని ఆయన తర్వాత తెలిపారు. ఈ అనిశ్చితి కంపెనీలకు కొత్త సవాళ్లను తెచ్చిపెడుతోంది. మరోవైపు అమెరికాతో చైనా వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోకపోతే 155 శాతం సుంకాలను విధిస్తామని ట్రంప్ తాజాగా హెచ్చరించడంతో గ్లోబల్ కంపెనీల గుండెల్లో రైళ్లను పరుగెత్తిస్తుంది. ట్రంప్ విధానాలు కంపెనీల ఆదాయాలను ఒత్తిడికి గురి చేస్తున్నాయని తీవ్ర ఆందోళనలో ఉన్న గ్లోబల్ కంపెనీలకు తాజాగా అమెరికా, చైనా మధ్య నెలకొన్న టారిఫ్ ఉద్రిక్తతలు మరింత బెంబేలెత్తిస్తున్నాయి.

నష్టపోతున్న ప్రధాన రంగాలు

అధిక టారిఫ్‌లతో వినియోగదారు ఉత్పత్తులు, తయారీ రంగాలు అత్యధికంగా నష్టపోతున్నాయి. వియత్నాం వంటి ఆసియా దేశాలపై ఆధారపడే కంపెనీలు ఎక్కువ నష్టాన్ని ఎదుర్కొంటున్నాయి. భారత్ లాంటి దేశాలు టెక్స్‌టైల్, ఫుట్‌వేర్, సముద్ర ఉత్పత్తులు, అభరణాల రంగాల కంపనీల ఆదాయాలు పడిపోతున్నాయి. చైనాపై కొత్త సుంకాల బెదిరింపు భవిష్యత్తులో అనిశ్చితిని మరింత పెంచొచ్చనే ఆందోళనలు నెలకొన్నాయి.

డబ్బుల కోసం మైనర్ల దారుణం

- మద్యం మత్తులో ఉన్న కర్ణాటక వాసిపై దాడి
- హత్య కేసులో నిందితులు అరెస్టు : డిఎస్‌పి

ప్రజాశక్తి - హిందూపురం


నిందితుల అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న డిఎస్‌పి మహేష్

శ్రీ సత్యసాయి జిల్లా హిందూపురం రూరల్ మండల పరిధిలోని అప్పలకుంట గేట్ వద్ద ఈనెల 13న జరిగిన హత్య కేసులో నిందితులను అరెస్టు చేసినట్లు హిందూపురం డిఎస్‌పి కెవి మహేష్ తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలను మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన వెల్లడించారు. డిఎస్‌పి తెలిపిన వివరాల మేరకు... కర్ణాటక రాష్ట్రం గౌరిబిదనూరుకు చెందిన పవన్‌కుమార్ హిందూపురం రూరల్ పరిధిలోని అప్పలకుంట గేట్ వద్ద మద్యం మత్తులో ఉండగా.... డబ్బుల కోసం ఇద్దరు మైనర్ బాలురులు ఆయనను నమ్మించి కల్లు తాగించేందుకు తమ వెంట తీసుకువెళ్లారు. దారి మధ్యలో పవన్‌కుమార్ వద్ద ఉన్న డబ్బు, వెండిచైను దొంగలించేందుకు ప్రయత్నించారు. పవన్‌కుమార్ ఎదురు తిరగడంతో తమ వద్ద ఉన్న ఇనుపరాడ్, బీర్ బాటిళ్లతో బాలురులు దాడి చేశారు. వెండిచైను, రూ.2500 నగదు, ద్విచక్ర వాహనాన్ని పవన్‌కుమార్ నుంచి దొంగలించారు. అనంతరం ఈ విషయాన్ని తమ స్నేహితులైన ఆంజనేయులు, ఆకర్షలకు మైనర్ బాలురు తెలియజేశారు. దీంతో వారిద్దరూ పవన్‌కుమార్‌ను గుర్తుపట్టకుండా ఆయన శరీరంపై పెట్రోల్ పోసి నిప్పుపెట్టారు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని హత్య కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నలుగురు నిందితులను అరెస్టు చేయడంతో పాటు వారి నుంచి ద్విచక్ర వాహనం, వెండి చైను స్వాధీనం చేసుకున్నట్లు డిఎస్‌పి తెలిపారు.

ఎపి వ్యకాస ఆధ్వర్యాన ట్రంప్ సుంకాల దిష్టి బొమ్మలు దహనం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అమెరికా అధ్యక్షులు ట్రంప్ సామ్రాజ్యవాదంతో భారతదేశ వ్యవసాయ రంగ ఉత్పత్తులపై సుంకాలను 11 నుంచి 50 శాతం పెంపును నిరసిస్తూ ఎపి వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యాన దీపావళి సందర్భంగా ట్రంప్ సుంకాల దిష్టి బొమ్మలను దహనం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 21 జిల్లాల్లోని 82 మండలాల్లో 170 గ్రామాల్లో నరకాసుర వధకు బదులు ట్రంప్ సుంకాల దిష్టి బొమ్మలను దహనం చేసినట్లు ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ నిరసన కార్యక్రమాల్లో వ్యవసాయ కార్మికులు, రైతులు, కౌలు రైతులు పాల్గొన్నారని వెల్లడించారు.

ట్రంప్ విధించిన సుంకాల వల్ల దేశ వ్యవసాయ రంగం దివాలా తీసి రైతులు నష్టాల పాలవడం, వ్యవసాయ కార్మికులు ఉపాధి కోల్పోయి అప్పుల పాలవుతున్నారని తెలిపారు.

మురిపించని 'మూరత్' ట్రేడింగ్

- స్వల్ప లాభాలతో ముగింపు

ముంబయి : దీపావళి పండగ సందర్భంగా నిర్వహించిన మూరత్ ట్రేడింగ్-2025 ఇన్వెస్టర్లను నిరాశపర్చింది. స్టాక్ మార్కెట్లు ప్రతీ ఏడాది ప్రత్యేక సెషన్ నిర్వహిస్తుంటాయి. మంగళవారం కూడా సంవత్ 2082 పేరుతో గంట పాటు మూరత్ ట్రేడింగ్ జరిగింది. కాగా.. ఈ ఏడాది పెద్ద ఉత్సాహం కనబడలేదు. ప్రారంభంలో రాణించిన మార్కెట్లు కాసేపట్లో అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. తుదకు బిఎస్‌ఇ సెన్సెక్స్ స్వల్పంగా 62 పాయింట్లు పెరిగి 84,426 వద్ద ముగిసింది. ఎన్‌ఎస్‌ఇ నిఫ్టీ 25 పాయింట్ల లాభంతో 25,838.80కి చేరింది. మధ్యాహ్నం 1.45 గంటలకు మూరత్ ట్రేడింగ్ ప్రారంభమై 2.45కి ముగిసింది. ఆరంభంలో సూచీల్లో కొనుగోళ్ల మద్దతు కనబడింది. సెన్సెక్స్ 270 పాయింట్ల మేర ర్యాలీ చేయగా.. నిఫ్టీ 25,900 మార్క్ దాటి ట్రేడ్ అయ్యింది. చివర్లో సూచీలు ఒత్తిడికి గురై స్వల్ప లాభాలతో సరిపెట్టుకున్నాయి.

దీపావళి పండగ వేళ పెట్టుబడులు పెట్టడాన్ని మదుపర్లు శుభప్రదంగా భావిస్తారు. ఈ పండగ రోజు ఏదైనా పని ప్రారంభిస్తే లాభం చేకూరుతుందనేది విశ్వాసం. కానీ ఈ దఫా ఆ ఉత్సాహం, నమ్మకం కానరాలేదు. భౌగోళిక ఉద్రిక్తతలు, ట్రంప్ అధిక టారిఫ్‌లు, దేశ ఆర్థిక వ్యవస్థలోనూ పెద్ద సానుకూల అంశాలు కానరాకపోవడం ఇన్వెస్టర్లను నిరుత్సాహపర్చింది. సెన్సెక్స్-30లో సిప్లా, బజాజ్ ఫిన్‌సర్వ్, యాక్సిస్ బ్యాంక్, ఇన్ఫోసిస్, గ్రాసిమ్ షేర్లు అధికంగా లాభపడగా.. కొటక్ మహీంద్రా బ్యాంక్, ఐసిఐసిఐ బ్యాంక్, హెచ్‌సిఎల్ టెక్నాలజీస్, మ్యాక్స్ హెల్త్‌కేర్, ఏషియన్ పెయింట్స్ నష్టపోయాయి.

ఆర్‌బిఐ 7.7 బిలియన్ డాలర్ల విక్రయం

ముంబయి : ఈ ఏడాది ఆగస్టులో 7.7 బిలియన్ డాలర్లను విక్రయించినట్లు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) తెలిపింది. ఇటీవల అంతర్జాతీయ మార్కెట్‌లో రూపాయి విలువ తగ్గడంతో.. దాన్ని కట్టడి చేయడానికి డాలర్లను విక్రయించినట్లు ఆర్‌బిఐ వెల్లడించింది. ఆగస్టులో డాలర్‌తో పోలిస్తే రూపాయి 1.6 శాతం మేర క్షీణించడంతో రూపాయి పతనాన్ని కట్టడి చేయడానికి నికరంగా 7.69 బిలియన్ డాలర్లను విక్రయించినట్లు పేర్కొంది. అంతకుముందు నెలతో పోలిస్తే దాదాపు మూడింతలు ఎక్కువ కావడం ఆందోళనకరం. జులై, ఆగస్టు నెలల్లో అమెరికన్ డాలర్లను కొనుగోలు చేయలేదని ఆర్‌బిఐ తెలిపింది.

బిడ్డలిద్దరినీ చంపి.. తల్లి ఆత్మహత్య

- జనకవరంలో విషాదం

ప్రజాశక్తి-పంగులూరు (బాపట్ల జిల్లా)

కుటుంబ కలహాల నేపథ్యంలో కన్నబిడ్డలిద్దరినీ చంపి.. తల్లి ఆత్మహత్య చేసుకున్న ఘటన నల్గొండ జిల్లా, కొండమల్లేపల్లిలో సోమవారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... బాపట్ల జిల్లా పంగులూరు మండలం, జనకవరానికి చెందిన కుంచాల రమేష్.. ఆయన భార్య నాగలక్ష్మి (27), కుమార్తె అవంతిక (9), కుమారుడు భువన్ సాయి (7)తో కలిసి కొంతకాలంగా తెలంగాణ రాష్ట్రం నల్గొండ జిల్లాలోని కొండమల్లేపల్లి గ్రామంలో నివాసం ఉంటున్నారు. రమేష్ బిల్డర్‌గా పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. ఆదివారం భార్యాభర్తల మధ్య గొడవ జరగడంతో నాగలక్ష్మికి చెప్పకుండా రమేష్ స్వగ్రామమైన జనకవరం వచ్చారు. భర్త ఎంతకీ ఇంటికి రాకపోవడంతో పోలీస్‌స్టేషన్‌లో ఆమె ఫిర్యాదు చేశారు. సోమవారం తెల్లవారుజామున నాగలక్ష్మి పిల్లలిద్దరినీ చంపి.. ఆమె ఉరి వేసుకున్నారు. రమేష్, నాగలక్ష్మిల మధ్య అప్పుడప్పుడూ చిన్నచిన్న గొడవలు వస్తుంటాయని.. కానీ అవి ఇంతవరకు వస్తాయని అనుకోలేదని బంధువులు రోదిస్తున్నారు. సోమవారం దీపావళి పండుగ కావడం వల్ల మంగళవారం మధ్యాహ్నానికి మృతదేహాలను పోస్టుమార్టం నిర్వహించారు. మంగళవారం అర్ధరాత్రి మృతదేహాలు జనకవరం తెచ్చే అవకాశం ఉందని బంధువులు తెలిపారు.


నాగలక్ష్మి, అవంతిక, భువన్‌సాయి (ఫైల్)

ఎసిసిలో సింప్లీజిత్‌కు మెజారిటీ వాటా

SimplyJITH Holdings
ACC ARABIAN CONSTRUCTION CO.

హైదరాబాద్ : అరేబియన్ కన్‌స్ట్రక్షన్ కంపెనీ (ఎసిసి) ఇండియాలో మెజారిటీ వాటాను కొనుగోలు చేసినట్లు హైదరాబాద్‌కు చెందిన సింప్లీజిత్ గ్రూప్ వెల్లడించింది. ఆర్థిక, ఎగుమతులు పలు రంగాలలో బలమైన స్థానం కలిగిన విభిన్న వ్యాపార సంస్థ సింప్లీజిత్ గ్రూప్ 14వ సంవత్సరంలోకి అడుగుపెడుతోన్న సందర్భంగా ఈ కీలక నిర్ణయ తీసుకోవడం విశేషమని పేర్కొంది. ఎసిసిలో వాటాల కొనుగోలు ద్వారా రియల్ ఎస్టేట్, మౌలిక వసతులు రంగాల్లోకి ప్రవేశించినట్లయ్యిందని తెలిపింది. కొత్త రంగాల్లో ఈ వ్యూహాత్మక పెట్టుబడి సింప్లీజిత్ గ్రూప్ ఆవిష్కరణ, ఆర్థిక నైపుణ్యం, స్థిరమైన అభివృద్ధి ఆధారంగా విస్తరణ దిశగా కొత్త దశను ప్రారంభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేసింది. ఎసిసి ఇండియా వృద్ధికి ఇది కొత్త అధ్యాయం అవుతుందని ఆ కంపెనీ ఎండి అనీ రే పేర్కొన్నారు. సింప్లీజిత్ విస్తరణ దిశగా చూపిన సిద్ధత ఈ భాగస్వామ్యానికి బలమైన పునాదన్నారు. ఎసిసి గ్రూపునతో భాగస్వామ్యం మా విస్తరణ దృష్టిని బలోపేతం చేస్తుందని సింప్లీజిత్ గ్రూప్ ఎండి అభిజిత్ జయంతి పేర్కొన్నారు. తమ ఆర్థిక బలం, ఆర్కిటెక్చరల్ ప్రతిభను సమన్వయం చేస్తూ భారత రియల్ ఎస్టేట్ రంగంలో కొత్త ప్రమాణాలను సృష్టించాలని అనుకుంటున్నామన్నారు.

సంపాదకీయం


నో కింగ్స్

అగ్రరాజ్యం అమెరికాలో ప్రజాస్వామ్యం మేడిపండు చందమని 'నో కింగ్స్' పేరుతో వెల్లువెత్తిన ప్రజాగ్రహం ప్రపంచం ముందు చాటిచెప్పింది. 2008 నుంచి వివిధ రూపాల్లో అమెరికా ప్రజలు రోడ్లపైన ఉద్యమిస్తున్నారు. వాల్‌స్ట్రీట్ ముట్టడి తర్వాత అతి పెద్ద నిరసన 'నో కింగ్స్' ఉద్యమం. ట్రంప్ రాజు కాదని, ఇక్కడ రాజులెవరూ లేరని, నిరంకుశ పాలన ఆపాలని, ప్రజలదే నిజమైన అధికారం అంటూ... 70 లక్షలమందికి పైగా ముక్తకంఠంతో నినదించారు. ప్రజాస్వామ్య విధ్వంసాన్ని, నియంతృత్వ పోకడలను ఏమాత్రం సహించబోమని హెచ్చరించారు. ప్రజాస్వామ్యం పేరుతో గాజా సహా అనేక దేశాల్లో సాగుతున్న మారణహోమంలో భాగస్వామ్యం కావడాన్ని ఈసడించారు.

అధికారం కోసం అడ్డదారులు తొక్కడం, పాలన పగ్గాలు చేపట్టాక కార్పొరేట్ల సేవలో తరించడం, ప్రజల ప్రాథమిక హక్కులను సైతం కాలరాయడం, నిరంకుశ పోకడలు పోవడం 'ప్రజాస్వామ్య' దేశాలుగా చెప్పుకుంటున్న భారత్‌సహా అనేక దేశాల్లో కనిపిస్తోంది. 1789లో ఫ్రెంచి విప్లవం.. ఫ్రాన్స్‌లో రాజరికాన్ని కూకటి వేళ్లతో పెకిలించిన తరువాత 'ప్రజాస్వామ్యం' విస్తృతంగా ప్రచారంలోకి వచ్చింది. ప్రజల కొరకు, ప్రజల చేత ఎన్నికై, ప్రజల కోసం పనిచేసే ప్రభుత్వమే ప్రజాస్వామ్యం అన్న అబ్రహం లింకన్ నిర్వచనాన్ని నేటికీ అన్వయిస్తూ ఉంటారు. పాలకులు ప్రజల ప్రతినిధులని, ప్రభుత్వం ప్రజలకు సేవ చేయాలని, అధికారమంతా ప్రజల చేతుల్లో ఉండాలన్న స్ఫూర్తి ఏమాత్రం లేని ట్రంప్ లాంటి నేతలకు ప్రపంచంలో కొదవ లేదు. రెండోసారి అధికారంలోకి వచ్చిందే తడవుగా అక్రమ వలసదారుల పేరుతో అమెరికన్లకు ఏళ్ల తరబడి సేవలందించిన వారి కాళ్లు, చేతులకు సంకెళ్లు వేసి, యుద్ధ విమానాల్లో ట్రంప్ తరలించాడు. చిన్నచిన్న దేశాలుసైతం నిలదీసినా, తీవ్రంగా వ్యతిరేకించినా పెదవి విప్పేందుకుసైతం మన పాలకులు సాహసించలేదు. ఈ అంశంపైనా నిరసనకారులు ట్రంప్‌ను నిలదీశారు. 200కుపైగా ప్రజా, పౌర సంస్థల పిలుపు మేరకు అమెరికాలోని 50 రాష్ట్రాల్లోని ప్రధాన నగరాలన్నిటా జనం కదంతొక్కారు. షికాగోలో రెండున్నర లక్షలకు పైగా ప్రజానీకం రోడ్లపైకి రాగా, వాషింగ్టన్ డిసి సహా పలు నగరాల్లో రెండు లక్షలమందికిపైగా ట్రంప్ పోకడలను నిరసించారు. అమెరికా రాజ్యాంగ ప్రవేశిక ముద్రించిన బ్యానర్‌పై సంతకాలు చేశారు. జర్మనీ, ఇటలీ, ఫ్రాన్స్, బ్రిటన్, స్వీడన్‌లాంటి 20 దేశాల్లోని అమెరికా రాయబార కార్యాలయాల వద్ద నిరసనలు పెల్లుబికాయి.

ప్రపంచ దేశాలపై ఇష్టారాజ్యంగా టారిఫ్‌లు ప్రకటించడం, మందులుసహా నిత్యావసరాల ధరలు ఆకాశాన్నంటడం, షట్‌డౌన్ విధించడంతో ప్రభుత్వ సేవలు, ఇతర ముఖ్యమైన కార్యక్రమాలన్నీ నిలిచిపోవడం, వేలమంది ఉద్యోగాలు కోల్పోయి రోడ్డునపడటం, ప్రధాన నగరాల్లో సైన్యాన్ని మోహరించడం లాంటి అనేక చర్యలు ప్రజల రోజువారీ జీవనాన్ని అల్లకల్లోలం చేశాయి. ట్రంప్‌పై ప్రజాగ్రహాన్ని రెట్టింపు చేశాయి. ఈ ఏడాది ఫిబ్రవరిలో అధ్యక్ష భవనం వైట్ హౌస్ 'కింగ్ ట్రంప్ లాంగ్ లివ్' పేరుతో ఆయన చిత్రంతో పుస్తకాన్ని ప్రచురించగా, ఒక పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో 'దేశానికి నియంత కావాలని' ప్రజలు కోరుకుంటున్నారని ట్రంప్ స్వయంగా ప్రకటించాడు. రాజకిరీటం ధరించి... యుద్ధవిమానంలో నిరసనకారులపై బురద జారవిడుస్తున్న ఎఐ చిత్రాన్ని తాజాగా పోస్టు చేయడం ద్వారా... తాను బలమైన రాజునని, నిరసనలను లెక్కచేయబోనని, బురదతో సన్మానిస్తానని సంకేతాలు పంపాడు. ఉపాధ్యక్షుడు సైతం.. ట్రంప్ ముందు డెమొక్రట్లు మోకరిల్లుతున్న ఎఐ చిత్రాన్ని పోస్టు చేశాడు. మన దేశంలోలాగే వీరంతా ప్రజాస్వామ్య వ్యతిరేకులంటూ 'హేట్ అమెరికా ర్యాలీ' అంటూ ప్రచారం చేశారు. గతంలో ఎన్నడూ నిరసనల్లో పాల్గొనని వారు సైతం భాగస్వాములై ఇటువంటి వాదనలను తిప్పికొట్టారు. పాలకుల అహంకార పోకడలను నిట్టనిలువునా పాతిపెట్టిన చరిత్ర ప్రపంచ ప్రజలది. 'నియంతృత్వ పాలనను ప్రతిఘటించడం, నిరసన తెలపడమే అసలైన దేశభక్తి' అని చాటిచెప్పిన అమెరికన్ల ప్రజాస్వామ్య స్ఫూర్తి నిరంకుశత్వాన్ని ఎదిరిస్తున్న ప్రపంచ యువతకు మరింత ఉత్సాహాన్నిచ్చేదే. కులం, మతం, ప్రాంతీయ విద్వేషాలతో రెచ్చగొట్టి, ఎన్నికల ప్రక్రియనే అపహాస్యం చేసి, డబ్బు వెదజల్లి అధికారంలోకి వచ్చే పాలకులకు ఓ హెచ్చరిక.

మహనీయుల మాట




పెట్టుబడిదారీ విధానంలో ప్రజల వేతన బానిసత్వం, పేదరికం, దు:ఖం కారణంగా ప్రజాస్వామ్యం పరిమితమై కుదించుకుపోతుంది.

- వి.ఐ. లెనిన్

'ప్రపంచీకరణ - కరువులు'

'ఎగుమతులకు పనికొచ్చే' పంటలను మరింత ఎక్కువగా పండించాలని భారతీయ రైతులకు ప్రధాని నరేంద్ర మోడీ నవంబర్ 11న న్యూఢిల్లీ నుండి పిలుపునిచ్చాడు. మన రైతులు ఆహారధాన్యాల సాగు నుంచి వైదొలగాలని, దేశం ఆహారధాన్యాలను దిగుమతి చేసుకోవాలన్నదే ఆ పిలుపు సారాంశం. ప్రపంచ బ్యాంక్, దాని తరపున వకాల్తా పుచ్చుకుని ఇక్కడ మాట్లాడే భారతీయ ఆర్థిక శాస్త్రవేత్తలు కొంత కాలంగా ఇస్తున్న సలహా ఇదే. సామ్రాజ్యవాద దేశాలు కోరుతున్నదీ ఇదే. అనేక సంవత్సరాలుగా అమెరికాలో రైతులకు భారీ సబ్సిడీలు ఇస్తున్నారు. ఆ దేశంలో పండే ఆహారధాన్యాల విలువలో దాదాపు సగం మేరకు ఆ సబ్సిడీ ఉంటుంది. దాంతో అక్కడి రైతులు పండించే ఆహారధాన్యాల నిల్వలు కూడా బాగా పేరుకుపోతున్నాయి. వాటిని చెల్లగొట్టుకోవాలంటే భారతదేశం వంటి మార్కెట్లే వారికి దారి. అందుకోసం ఇక్కడి రైతులు ఆహార పంటల సాగు నుండి మారి అమెరికా వంటి దేశాల్లో పండించడం సాధ్యం కాని పంటలను పండించేలా ఒత్తిడి తెస్తున్నారు. సామ్రాజ్యవాదుల ఈ కోరికకు అనుగుణంగానే ఇక్కడ మోడీ రైతులకు సలహా ఇస్తున్నాడు.

గతంలో మోడీ ప్రభుత్వం తెచ్చిన మూడు నల్ల వ్యవసాయ చట్టాల సారాంశం కూడా ఇదే. ఆహార పంటల సాగునుండి వైదొలగి సామ్రాజ్యవాద దేశాలకు కావలసిన పంటను పండించేలా రైతులను నెట్టడమే వాటి అసలు ఉద్దేశం. అంతకు ముందు వరకూ కనీస గిట్టుబాటు ధరలు రైతులకు గ్యారంటీ చేసే విధంగా ప్రభుత్వం బాధ్యత వహించి మద్దతు ధరలను ప్రకటించి అమలు చేస్తూ వుండే విధానం ఉండేది. మొదట అటువంటి మద్దతును వ్యాపార పంటల విషయంలో తొలగించారు. ఆ తర్వాత ఆహార పంటల విషయంలోనూ తొలగించడానికి ప్రయత్నించారు. కాని రైతులు ఏడాదికి పైగా జరిపిన పోరాటం ఫలితంగా ఆ నల్ల చట్టాలను వెనక్కు తీసుకుని మద్దతు ధర విధానాన్ని ఆహార పంటల విషయంలో కొనసాగిస్తున్నారు. ఇది మోడీ ప్రభుత్వానికి కాని, సామ్రాజ్యవాదులకు గాని బొత్తిగా రుచించని విషయం. అందుకే వాళ్ళిద్దరూ తమ ప్రయత్నాన్ని మాత్రం విడిచిపెట్టడం లేదు. తాజాగా మోడీ రైతులకు ఇచ్చిన సలహా ఈ వాస్తవాన్నే ధృవపరుస్తోంది.



ప్రభాత్ పట్నాయక్

ఆహార పంటల నుండి వైదొలగి ఎగుమతులకు పనికివచ్చే పంటల వైపు, అంటే వ్యాపార పంటల వైపు మళ్ళడం వలన నిజానికి రైతులకే ఎక్కువ ప్రయోజనం కలుగుతుందని చెప్తూ ప్రపంచబ్యాంక్ తరపున వకాల్తా పుచ్చుకున్న వారంతా రైతన్నల ఆందోళన కొనసాగుతున్న కాలమంతా ప్రచారం చేస్తూనే వచ్చారు. రైతులు ఆ విధంగా తమ సాగును మళ్ళించడానికి అవరోధంగా ఉన్నది మద్దతు ధరల విధానం అని, దానిని రద్దు చేస్తే అప్పుడు రైతుల వ్యాపార పంటలవైపు మళ్ళుతారని, దాని వలన వారికి ఎక్కువ ప్రయోజనాలు కలుగుతాయని వారా కాలమంతా పనిగట్టుకుని ప్రచారం చేశారు. కాని రైతులకు కనీస మద్దతు ధర వ్యవస్థ ప్రాధాన్యత బాగా తెలుసు. ఒకసారి ఆ విధానాన్ని గనుక రద్దు చేస్తే ఆ తర్వాత మన రైతులు ప్రపంచ మార్కెట్‌లో ఆహార పంటల ధరల ఎగుడుదిగుడుల మాయాజాలంలో చిక్కుపడిపోతారు. గతంలో వ్యాపార పంటల విషయంలో వారికి వచ్చిన అనుభవం ఇదే. వ్యాపార పంటల ధరల విషయంలో ఆ పంటలు దిగుబడికి వచ్చే సమయంలో అమాంతం వాటి ధరలు పడిపోవడం అనేది మన రైతులకు అనుభవవేద్యమే. దానికి తోడు ఆ వ్యాపార పంటలను సాగు చేయడానికి ఎక్కువ పెట్టుబడులు అవసరమౌతాయి. అందుకోసం భారీ రుణాలు తీసుకోవలసి వస్తుంది. అలా తీసుకున్న రుణాలను ధరల పతనం తర్వాత చెల్లించడం రైతులకు అసాధ్యం అవుతుంది. అలా రుణాలను తీర్చలేని పరిస్థితులు ఏర్పడినందువల్లే గత మూడు దశాబ్దాల కాలంలో వ్యాపార పంటలు పండిచే రైతుల్లో నాలుగు లక్షల మందికి పైగా ఆత్మహత్యలకు పాల్పడ్డారు. అందుచేత రైతులకు ఎంతో కొంత రక్షణ కల్పించే కనీస మద్దుతు ధర వ్యవస్థను రద్దు చేయడానికి మోడీ ప్రభుత్వం నల్ల చట్టాల ద్వారా ప్రయత్నించినప్పుడు వారంతా దానిని బలంగా వ్యతిరేకించారు. ఆ మద్దతు ధర వ్యవస్థ గనుక రద్దయితే తమ భవిష్యత్తు ఎలా ఉండబోతోందో వారికి స్పష్టంగా తెలుసు.



> ఆహార ధాన్యాల అవసరాలకు దిగుమతుల మీద ఆధారపడడం ఉచితం కాదు అని చెప్పడానికి కేవలం అది కరువుకు దారి తీస్తుందన్న ఒక్కటే కారణం కాదు. ఆహార ధాన్యాల కోసం ప్రధానంగా దిగుమతుల మీద ఆధారపడిన దేశాలకు మరొక ముప్పు కూడా ఉంది. క్యూబా, ఇరాన్, వెనిజులా, రష్యా, ఉత్తర కొరియా వంటి దేశాల ప్రభుత్వాలు తనకు లొంగి నడుచుకోవడం లేదన్న అక్కసుతో వాటి మీద ఏకపక్షంగా అమెరికా ఆంక్షలు విధించింది. ఇంకా చాలా దేశాల మీద కూడా ఈ విధమైన ఆంక్షలు కొనసాగుతున్నాయి. ఈ ఆంక్షల పేరుతో అమెరికా ఆ దేశాలతో వ్యాపారం చేయదు, తక్కిన దేశాలను కూడా వ్యాపారం చేయనివ్వదు. అటువంటి స్థితిలో ఆ ఆంక్షలకు గురైన దేశం గనుక ఆహార ధాన్య అవసరాలకోసం దిగుమతుల మీద ఆధారపడి వుంటే అప్పుడు పరిస్థితి ఏమిటి? ఈ ఆంక్షలలో ఆ యా దేశాల విదేశీ మారక నిల్వలను జప్తు చేయడం అనే చర్య కూడా ఒకటి ఉంది. అదే జరిగితే అప్పుడు జరిగే వినాశకర పర్యవసానాలను ఊహించుకోగలమా?

కనీస మద్దుతు ధర వ్యవస్థ గనుక లేకపోతే ఆహార పంటల సాగునుంచి వ్యాపార పంటల సాగు వైపు మళ్ళడం, అటువంటి వ్యాపార పంటలను పండించిన తర్వాత వాటిరేట్లు పడిపోయి చేసిన అప్పులు తీర్చలేకపోవడం, దేశం మొత్తానికి-రైతాంగంతో సహా-ఆహార భద్రత లేకుండా పోవడం, ఇదంతా కరువుల రూపంలో మన ముందు దర్శనమిస్తుంది. అటువంటి కరువులు చాలా ఆఫ్రికన్ దేశాలలో సంభవించాయి. అక్కడ ఆహార పంటల నుండి వ్యాపార పంటల వైపు ప్రపంచీకరణ వ్యవస్థలో రైతులు మళ్ళడంతో అది కరువులకు దారి తీసింది.

"ప్రమాదకర మార్గం" అన్న తన గ్రంథంలో ఆర్థికవేత్త అమియా కుమార్ బాగ్చీ ఈ కరువులను "ప్రపంచీకరణ కరువులు" అని సరిగ్గా అతికినట్టు వర్ణించారు.

ఈ కరువులు ఎందుకు వస్తాయి? కారణాలేమిటి? ఒక దేశం ఆహార పంటల సాగును మానేసి దానికి బదులు వ్యాపార పంటలను సాగు చేయడం మొదలుపెడితే, ఆ వ్యాపార పంటల ధరలు పడిపోయిన ఏడాది ఆ దేశానికి విదేశీ మారక ద్రవ్యం రూపంలో రావలసిన ఆదాయం రాకుండా పోతుంది. అలా పడిపోయినప్పుడు తాను ఆహార అవసరాలకు దిగుమతి చేసుకునే ధాన్యాలకు చెల్లించవలసిన విదేశీ మారకద్రవ్యం ఉండదు. వ్యాపార పంటల ధరలతో పోల్చినప్పుడు ఆహార పంటల ధరలలో ఎగుడుదిగుడులు తక్కువగా ఉంటాయి. వ్యాపార పంటల ధరలు పడిపోయినా, ఆహారధాన్యాల ధరలు పడిపోయే అవకాశం తక్కువ. అందుచేత ఆహార ధాన్యాల దిగుమతికి చెల్లించవలసిన విదేశీ మారకద్రవ్యం సరిపడా లేకపోయేసరికి దేశంలో తలసరి ఆహార ధాన్యాల లభ్యత పడిపోతుంది. అప్పుడు కరువు పరిస్థితులు నెలకొంటాయి.

ఏదో ఒక విధంగా ప్రభుత్వం ఏ "సహాయమో" అర్థించి ప్రజలకు కావలసిన ఆహారధాన్యాలను సేకరించిందను కుందాం. అప్పుడు కూడా ఇబ్బంది ఉంటుంది. వ్యాపార పంటలు పండించి దివాలా ఎత్తిన రైతుల దగ్గర ఈ ఆహార ధాన్యాలను కొనుగోలు చేయడానికి సరిపడా ధనం ఉండదు. వారందరికీ ఆహార ధాన్యాలు అందాలంటే అప్పుడు 'సహాయం'తోబాటు రైతులకు వాటిని కొనుగోలు చేయడానికి వీలుగా సబ్సిడీలు కూడా చెల్లించాలి. లేదా ఉచితంగా సరిపడా ఆహారధాన్యాలను వారికి సరఫరా చేయగలగాలి. లేకపోతే కరువును నివారించడం సాధ్యం కాదు.

ఇక్కడ ఇంకో సమస్య కూడా ఉంది. ఆహార పంటల సాగులో లభించే ఉపాధి (కూలీల అవసరం) వ్యాపార పంటలలో ఉండదు. వ్యాపార పంటలవైపు మళ్ళితే వారికి పనులు దొరకవు. అలా వ్యవసాయ పనులు దొరకని కూలీలకు ఆహార ధాన్యాన్ని కొనుగోలు చేసే శక్తి ఉండదు. అందుచేత ఆహార ధాన్యాలు తగినంత దిగుమతి చేసుకోలేని స్థితి ఏర్పడినా, లేక దిగుమతి చేసుకున్న ధాన్యాన్ని కొనుగోలు చేసే శక్తి దిగజారిపోయినా కరువు పరిస్థితులు తప్పవు.

అందుచేత దేశ ఆహార భద్రతను దెబ్బతీసి రైతాంగాన్ని వ్యాపార పంటల సాగు వైపు నెట్టడం అనేది దేశాన్ని కరువు కాటకాలలోకి నెడుతుంది. నయా ఉదారవాద వ్యవస్థలో, ముఖ్యంగా మూడవ ప్రపంచ దేశాలలో, ప్రత్యేకించి ఆఫ్రికా దేశాలలో ఇదే జరిగింది. మన దేశం ఇంతవరకూ ఇటువంటి పరిస్థితి ఏర్పడకుండా నివారించగలిగింది. కాని ఇప్పుడు ప్రధాని మోడీ సలహాను రైతాంగం పాటిస్తే మాత్రం నివారించడం సాధ్యపడదు.

ఆహార ధాన్యాల అవసరాలకు దిగుమతుల మీద ఆధారపడడం ఉచితం కాదు అని చెప్పడానికి కేవలం అది కరువుకు దారి తీస్తుందన్న ఒక్కటే కారణం కాదు. ఆహార ధాన్యాల కోసం ప్రధానంగా దిగుమతుల మీద ఆధారపడిన దేశాలకు మరొక ముప్పు కూడా ఉంది. క్యూబా, ఇరాన్, వెనిజులా, రష్యా, ఉత్తర కొరియా వంటి దేశాల ప్రభుత్వాలు తనకు లొంగి నడుచుకోవడం లేదన్న అక్కసుతో వాటిమీద ఏకపక్షంగా అమెరికా ఆంక్షలు విధించింది. ఇంకా చాలా దేశాల మీద కూడా ఈ విధమైన ఆంక్షలు కొనసాగుతున్నాయి. ఈ ఆంక్షల పేరుతో అమెరికా ఆ దేశాలతో వ్యాపారం చేయదు, తక్కిన దేశాలను కూడా వ్యాపారం చేయనివ్వదు. అటువంటి స్థితిలో ఆ ఆంక్షలకు గురైన దేశం గనుక ఆహార ధాన్య అవసరాలకోసం దిగుమతుల మీద ఆధారపడి వుంటే అప్పుడు పరిస్థితి ఏమిటి? ఈ ఆంక్షలలో ఆ యా దేశాల విదేశీ మారక నిల్వలను జప్తు చేయడం అనే చర్య కూడా ఒకటి ఉంది. అదే జరిగితే అప్పుడు జరిగే వినాశకర పర్యవసానాలను ఊహించుకోగలమా? సామ్రాజ్యవాదాన్ని ఎదిరించి నిలబడడానికి పూనుకున్నప్పుడు గాజాలో ఎంత నరమేథం జరిగిందో, దానిని ఆ సామ్రాజ్యవాద దేశాల ప్రభుత్వాలన్నీ ఎంతగా సమర్థించాయో మనం చూస్తున్నాం. అటువంటప్పుడు సామ్రాజ్యవాదాన్ని ఎదిరించి తలపడడానికి ఎన్ని దేశాలు ముందుకు రాగలుగుతాయి?

ఇప్పుడు ట్రంప్ సుంకాల యుద్ధం సాగిస్తున్నది మన దేశాన్ని ఆహారధాన్యాల దిగుమతి మీద ఆధారపడే దేశంగా మార్చడానికే. అదే జరిగితే మన దేశ స్వయం నిర్ణయాధికారం హరించుకుపోవడం ఖాయం. సామ్రాజ్యవాదుల బంటు హోదాకి మన దేశం దిగజారడం అనివార్యం ఔతుంది.

రైతులకు ఈ విధంగా ఆహారధాన్యాల సాగు నుండి వ్యాపార పంటల సాగు దిశగా మారమని సలహా ఇస్తున్న మన ప్రధానికి సైతం ఈ విషయం మీద స్పష్టత ఉందా? అనుమానమే. మన పాలకుల పరిస్థితి ఇలా ఉండడం కూడా సామ్రాజ్యవాదుల ఒత్తిళ్ళకు తలొగ్గడానికి దోహదం చేస్తుంది.

(స్వేచ్ఛానుసరణ)

స్మృతి

మరపురాని ఆదర్శం శంకరన్



నేడు శంకరన్ జయంతి

> ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ కార్యదర్శిగా శంకరన్ దళిత, ఆదివాసీల సంక్షేమం, అభ్యున్నతి, అభివృద్ధికి బాటలు వేసేందుకు ఒక్క ఏడాదిలోనే 120కి పైగా జీవోలు జారీ చేశారు. 100కి పైగా ఉత్తర్వులు ఆయన సంతకంతోనే వెలువడ్డాయి. అందులో భాగంగానే హరిజన సంక్షేమ మంత్రిత్వ శాఖను సాంఘిక సంక్షేమ శాఖగా మార్చడానికి జీవో తెచ్చారు. ఆదివాసీల అభివృద్ధి కోసం ఐ.టి.డి.ఎ లను, సబ్ ప్లాన్‌లను ప్రవేశ పెట్టడంలోనూ ఆయనదే ముఖ్య పాత్ర. అణగార్చబడిన వర్గాల పిల్లల కోసం దాదాపు నలభై ఏళ్ల కిందట సాంఘిక సంక్షేమ పాఠశాలలను ఏర్పాటు చేయడానికి మార్గదర్శి.

మీకు ఇష్టమైన నాయకులు ఎవరు? నటులు ఎవరు? ఇలా అడిగితే ఎవరికి తోచిన పేరు వారు చెప్పొచ్చు. కానీ మీకు ఇష్టమైన ఐ.ఎ.ఎస్ అధికారి పేరు చెప్పమంటే మాత్రం దేశంలో చైతన్యవంతులైన వారు ముందుగా చెప్పే పేరు ఎస్.ఆర్.శంకరన్ అనడంలో సందేహం లేదు. తను చేసిన సేవల వలన తెచ్చిన ఉత్తర్వుల వలన, జీవితం నడిపిన తీరు వలన శంకరన్ ప్రజలపై చెరగని ముద్ర వేశారు. అందులోనూ ప్రముఖ నాయకులు అగ్రశ్రేణి అధికారులు, అధ్యాపకులు, సామాజిక కార్యకర్తలు ఆయననో ఆదర్శ నమూనాగా పరిగణిస్తారు. అందుకే మరణించి పుష్కరకాలం దాటినా శంకరన్ జీవిత ఘట్టాలు ఇప్పటికీ సంస్మరించుకుంటూనే వుంటారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ కార్యదర్శిగా శంకరన్ దళిత, ఆదివాసీల సంక్షేమం, అభ్యున్నతి, అభివృద్ధికి బాటలు వేసేందుకు...ఒక్క ఏడాదిలోనే 120కి పైగా జీవోలు జారీ చేశారు. 100కి పైగా ఉత్తర్వులు ఆయన సంతకంతోనే వెలువడ్డాయి. అందులో భాగంగానే హరిజన సంక్షేమ మంత్రిత్వ శాఖను సాంఘిక సంక్షేమ శాఖగా మార్చడానికి జీవో తెచ్చారు. ఆదివాసీల అభివృద్ధి కోసం ఐ.టి.డి.ఎ లను, సబ్ ప్లాన్‌లను ప్రవేశ పెట్టడంలోనూ ఆయనదే ముఖ్య పాత్ర. అణగార్చబడిన వర్గాల పిల్లల కోసం దాదాపు నలభై ఏళ్ల కిందట సాంఘిక సంక్షేమ పాఠశాలలను ఏర్పాటు చేయడానికి మార్గదర్శి.

1934 అక్టోబర్ 22న తమిళనాడులోని తంజావూరులో మధ్యతరగతి కుటుంబంలో పుట్టిన శంకరన్ 1959లో కర్నూల్ జిల్లా నంద్యాల సబ్ కలెక్టర్‌గా, నెల్లూరు జిల్లా జాయింట్ కలెక్టర్‌గా పని చేశారు. నెల్లూరు జిల్లా కలెక్టరుగా, వీరి సేవలకు గుర్తింపుగా నెల్లూరు జిల్లాలో శంకరపురం, శంకరన్ నగర్‌లు అనేకం ఉన్నాయి. సాంఘిక సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శిగా, కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శిగా, త్రిపుర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా పలు హోదాల్లో పనిచేసిన ఆయన 1992లో పదవీ విరమణ చేశారు. పేదల కోసం పూర్తిగా పని చేయాలన్న ఆలోచనకు ఆటంకం కలుగుతుందని బ్రహ్మచారిగానే ఉండిపోయారు. ఉమ్మడి రాష్ట్రంలో కార్యదర్శిగా, ముఖ్య కార్యదర్శిగా పనిచేశారు. రాష్ట్ర ప్రభుత్వంలో పనిచేసిన కాలంలోనే ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం మార్గదర్శకాలు, నిబంధనలు రూపొందించారు. ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్లకు ఊపిరి పోశారు. ఎస్సీ, ఎస్టీ జనాభా ప్రాతిపదికన దామాషా పద్ధతిలో రాష్ట్ర బడ్జెట్‌లో నిధులు కేటాయించేందుకు ఎస్సీ ఉప ప్రణాళిక (ఎస్.సి.ఎస్.పి), గిరిజన ఉప ప్రణాళికలకు (టి.ఎస్.పి) రూపకల్పన చేశారు.

నృపేన్ చక్రవర్తి ముఖ్యమంత్రిగా వుండగా త్రిపుర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా వెళ్లి నిబద్ధతతో పనిచేశారు. ఆ దశను గురించి ఎన్నో విశేషాలున్నాయి. స్వయంగా నృపేన్ నిరాడంబర ప్రజానాయకుడు కాగా అందుకు తగిన విధంగా అధికార యంత్రాంగాన్ని పని చేయించిన వ్యక్తిగా శంకరన్ కూడా గుర్తుండిపోయారు. ఆయన కూడా శంకరన్ వలె అవివాహితుడు. శంకరన్ గారికి పాలన విషయంలో పూర్తి స్వేచ్ఛనిచ్చారు. త్రిపురలో శంకరన్ ప్రభుత్వ అతిథి గృహంలో ఉండేవారు. ప్రజలు నేరుగా కలిసి తమ సమస్యలు చెప్పుకునేవారు. త్రిపుర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా మూడేళ్లపాటు పనిచేశారు. కేంద్రం దుర్బుద్ధితో మోహరించిన పారామిలటరీ దళాల అరాచకాలను అదుపు చేయడానికి కూడా తన అధికారాలను ఆయన చాకచక్యంగా వినియోగించారు.

ఆయన సేవలను గుర్తించి ప్రభుత్వం 2005లో పద్మభూషణ్ అవార్డును ప్రకటించగా సున్నితంగా తిరస్కరించడం శంకరన్‌కే చెల్లింది. పదవులు, బిరుదుల కోసం ఎగబడే పైరవీల కాలంలో ఇది అరుదైన ఉదాహరణే. దాన్ని తిరస్కరించడమే గాక, ఆ విషయం ప్రచురించవద్దని పత్రికా విలేకరులను మరీమరీ కోరారు. ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల నుంచి ఆయనను బదిలీ చేయగా వద్దంటూ ప్రజలు ఆందోళనకు దిగడం చూస్తే వారితో ఎంతగా మమేకం అయ్యారో ఎంత విశ్వాసం చూరగొన్నారో తెలుస్తుంది. ఎంతటి పదవిలో వున్నా తన స్వంత పనులకు ప్రభుత్వ వాహనాన్ని వాడుకోబోననే నియమాన్ని పాటించారు. కలెక్టర్ హోదాకే పరిమితం కాగా అత్యంత సాధారణమైన జీవితాన్ని ఆయన గడిపేవారు. తనకంటూ సొంత ఇల్లు కూడా కోరుకోలేదంటే ఆశ్చర్యం కలగొచ్చు. ఇప్పుడు మనం నోట్లకట్టలతో బంగారు ముద్దలతో పట్టుబడే అధికారులను చూస్తుంటాం. ప్రజలు ఆయనను 'ఐ.ఎ.ఎస్ గాంధీ' అని పిలిచేవారంటే కారణం ఇదే. అధికారంలో వుండగా చేసిన బహుముఖ సేవలు గాక పదవీ విరమణ అనంతరం వచ్చిన పెన్షన్ కూడా పేద ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల చదువుల కోసం క్రమపద్ధతిలో కేటాయించేవారు. ఎవరికి సాయం చేసినా వారు దానం స్వీకరించామనే ఆత్మన్యూనతకు గురికాకుండా వారితో ఒక బాండు రాయించుకునేవారట.

తూర్పుగోదావరి జిల్లా రంపచోడవరంలోని గుర్తేడు గ్రామంలో గిరిజన సంక్షేమ పాఠశాలను సందర్శించడానికి వెళ్ళిన సందర్భంలో శంకరన్‌తో సహా దాదాపు 11 మంది అధికారులను మావోయిస్టులు నిర్బంధించారు. ఆ తరువాత 12 రోజులకు విడుదల చేశారు. సామాజిక దృక్పథం, విస్తృత సంబంధాలు గల శంకరన్ ఉద్యోగ విరమణ అనంతరం కాలంలో ప్రభుత్వానికి, నక్సలైట్లకు మధ్య చర్చలు జరగడంతో ముఖ్యమైన భూమిక పోషించారు. బెజవాడ విల్సన్‌తో కలిసి 'సఫాయి కర్మచారి అందోళన్' అనే సంస్థను స్థాపించి సఫాయి కార్మికుల దుర్భర జీవితాలపై చర్యకూ చర్యలకూ కారకులయ్యారు. ఇవన్నీ ఆయన అంకితభావాన్ని సామాజిక చింతననూ చెప్పే ఉదాహరణలే. ప్రజా సంక్షేమానికే అంకితమైన ఆయన 2010 అక్టోబర్ 7న తుది శ్వాస విడిచారు.

- పీపీ

వ్యాఖ్య

విరుచుకుపడుతున్న వివక్ష భూతం!

సోదరభావం, సమానత్వం దిశగా, అభివృద్ధి పథంలో దేశ ప్రజలు అడుగులు వేయాలని సాధించుకున్న స్వాతంత్ర్య స్ఫూర్తి మసకబారే ఈ ధోరణి ఈమధ్య కాలంలో బాగా పెరిగిపోయింది. చిన్న పల్లె నుంచి దేశ రాజధాని వరకూ కుల, మత వివక్ష భూతం విరుచుకు పడుతోంది. ఇది ఆందోళనకరం.



ఇటీవల హర్యానాలో ఐపిఎస్ కేడర్ వ్యక్తి కులం పేరుతో ఉన్నతాధికారులు పెట్టే అవమానాలు తట్టుకోలేక ఆత్మహత్య చేసుకున్నారు. అతని భార్య ఓ ఐఎఎస్ అధికారి. ఆ సమయంలో ఆమె ప్రభుత్వ ప్రతినిధిగా ముఖ్యమంత్రితో పాటు విదేశీ పర్యటనలో ఉన్నారు. తిరిగి వచ్చిన ఆమె భర్త మరణానికి కారణమైన అధికారుల పేర్లు సైతం వెల్లడించారు. మరణించిన అధికారి సూసైడ్ నోట్‌లో కూడా వారి పేర్లు ఉన్నాయి. అయినా వాళ్లమీద ఏవిధమైన చర్యలూ తీసుకోలేదని ఆమె వాపోయారు. ఒక ఉన్నతాధికారి కుటుంబమే కుల వివక్షకి ఇంతలా తల్లడిల్లుతుంటే ఇక సామాన్య ప్రజల పరిస్థితి ఏంటి?

'బ్రాహ్మణులని పూజిస్తాం..' అనిపించారు

అక్టోబరు నెల ప్రారంభంలో మధ్యప్రదేశ్‌లో జరిగిన ఓ ఘటన ప్రజాస్వామ్యాన్ని, నాగరిక సమాజాన్ని పరిహాసం చేసేదిగా ఉంది. సోషల్ మీడియాలో వైరల్ అయిన సమాచారం ప్రకారం.. 'ఒబిసి వర్గానికి చెందిన ఓ యువకుడు, ఉన్నతవర్గానికి చెందిన యువకుడి కాళ్లు కడిగి, నెత్తిన జల్లుకున్నాడు. ఆ తరువాత 'బ్రాహ్మణులని అవమానించినందుకు నేను క్షమాపణలు చెబుతున్నా. ఇంకెప్పుడూ ఈ తప్పు జరగదు. ఇకమీద మేమంతా బ్రాహ్మణులని ఈవిధంగానే పూజిస్తాం' అన్నది ఆ వీడియో సారాంశం. ఎంత దిక్కుమాలిన చర్య ఇది! కులం పేరుతో సాటి మనిషిని ఇంతలా అవమానించడం దేనికి సంకేతం?

వేరే కులం వారిని ఇష్టపడినందుకు, పెళ్లి చేసుకున్నందుకు కన్నవారే హంతకులుగా మారిపోతున్న ఘటనలు ఎన్నో చూస్తున్నాం. అయితే పై ఘటనలు వీటికి పూర్తిగా భిన్నమైనవి. సమాజంలో వెనుకబడిన వర్గాల వారిని సాటి మనుషులుగా కూడా గుర్తించని భావజాలానికి నిదర్శనం అవి. సదరు వ్యక్తులు ఉన్నత హోదాలో ఉన్నాసరే ఆ సంకుచిత్వం ఏదోవిధంగా బయటపడుతూనే ఉంటోంది. సిజెఐపై దాడి అటువంటిదే.

'దేవుడే నన్ను ఈ పని చేయమన్నా'డు.. అని ప్రకటించారు

సుప్రీంకోర్టులో జరిగిన ఘటనలో న్యాయవాది రాకేష్ కిషోర్, సిజెఐ గవాయ్‌పై బూటు విసిరే ప్రయత్నం చేస్తూ 'సనాతన ధర్మాన్ని అవమానిస్తే భారతదేశం సహించదు' అన్నారు. ఇంకా 'దేవుడే నన్ను ఈ పని చేయమన్నాడ'ని ప్రకటించారు. ఇంత అక్కసు వెళ్లగక్కడం వెనుక సిజెఐ సామాజిక నేపథ్యం కూడా ఒక కారణమేనని విశ్లేషణలు వచ్చాయి. పదవి చేపట్టిన నాటినుండి గవాయ్ పలు సందర్భాల్లో 'ఇది భారతదేశం.. బుల్డోజర్ న్యాయం ద్వారా కాకుండా, రాజ్యాంగం ప్రకారం చట్టపరమైన పాలన ఇక్కడ జరగాలి' అని ఉద్ఘాటించారు. దేశంలో రాజ్యాంగ అమలుని సహించని మనువాదకులకి ఇది మింగుడుపడని చర్య.

అనుమానంతోనే చంపేశారు..

ఇటీవల రాయ్‌బరేలీలో జరిగిన ఓ దుర్ఘటన కూడా కుల వివక్షని ఎత్తిచూపుతోంది. దొంగతనం చేయకుండనే, చేస్తాడేమోనన్న నెపంతో షెడ్యూల్ కులానికి చెందిన ఓ యువకుడిని అగ్రవర్ణానికి చెందిన ఓ గుంపు కొట్టి చంపింది. అక్కడ ఇంకా దొంగతనం జరగలేదు. చేస్తాడేమో అన్న అనుమానం ఆ దారుణానికి ఒడిగట్టేలా చేసింది. అంతటి లోకువకు కారణం అతడి కులం.

గతంలో ఈ తరహా ఘటనలు ఎన్నో జరిగాయి. ఈ సంకుచితత్వం ఇప్పుడు మనువాదుల ఏలుబడిలో మరింతగా విరుచుకు పడుతోంది. అయితే, ఇది భారతదేశం. మనువాద రాజ్యం కాదు. దేశం ప్రగతి పథంలో నడవాలి అంటే మనం నడవాల్సింది ముందుకు. వెనుకకు కాదు.

- ఫీచర్స్ అండ్ పాలిటిక్స్

మీ వ్యాసాలను పంపాల్సిన మెయిల్ : editpageps @ gmail.com

రంగంపేటలో ఏనుగుల బీభత్సం



ప్రజాశక్తి - చంద్రగిరి: చంద్రగిరి మండలం, రంగంపేట పరిధిలోని శివాలయం దగ్గర సోమవారం ఉదయం మూడు గంటల ప్రాంతంలో ఏనుగుల గుంపు గ్రామానికి ఆనుకొని ఉన్న రైతు విజయ్ కుమార్ పొలంలోకి దూసుకువచ్చి అరటి చెట్లు, కొబ్బరి చెట్లు, గడ్డిని ధ్వంసం చేసాయి. పొలానికి వేసి ఉన్న ఫెన్సింగ్‌ను ధ్వంసం చేసి బోర్ మోటార్, బోర్ నుండి పొలానికి నీటి సరఫరాకు అమర్చిన పైపులను కూడా ధ్వంసం చేసి తిరిగి అడవిలోకి వెళ్లాయి. గ్రామస్తులు భయాందోళనకు గురై అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. అటవీ శాఖ అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని ధ్వంసం చేసిన ప్రదేశాన్ని పరిశీలించి, ప్రజలు రాత్రిపూట అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ రోజు రాత్రికి కందులవారిపల్లి, నారావారిపల్లి, నాగపట్ల, కళ్యాణిడ్యాం పీలేరు ప్రాంతాలలో కూడా సంచరించే అవకాశం ఉందని అటవీశాఖ అధికారులు చెబుతున్నారు. పైన తెలిపిన ప్రాంతాలను అలెర్ట్ చేసి, ప్రజలు భయభ్రాంతులకు గురి కాకూడదని తెలియజేసి, సమాచారం వెంటనే అందించాలని గ్రామస్తులని అధికారులు కోరారు.

తమిళనాడు, కేరళలో భారీ వర్షాలు

● చెన్నైలో పలు కాలనీలు జలమయం

తిరువనంతపురం : నైరుతి రుతుపవనాలు తగ్గుముఖం పట్టిన.. ఆగ్నేయ అరేబియా సముద్రంపై ఉన్న అల్పపీడన ప్రభావంతో తమిళనాడు, కేరళతో పాటు దక్షిణాది తీర ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. కేరళలోని ఐదు జిల్లాల్లో ఆరెంజ్, ఎల్లో అలర్ట్‌లను భారత వాతావరణశాఖ (ఐఎండి) హెచ్చరికలు జారీచేసింది. సోమ, మంగళవారాల్లో కేరళలోని 10 జిల్లాల్లో భారీ వర్షాలు కురిసాయి. కన్నూర్‌లోని చెరువుపుళలో ఆకస్మిక వరదలు సంభవించి రెండు ఇళ్లు, ఒక వ్యాపార సంస్థ మునిగిపోయాయి. ప్రాపొయిల్ వద్ద ఒక ఇంటిపై కాంపౌండ్ గోడ కూలిపోయింది. ఇడుక్కి, పాలక్కడ్, మలప్పురం జిల్లాలకు భారత వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ చేసింది. ఈ జిల్లాలోని విద్యాసంస్థలకు బుధవారం సెలవు ప్రకటించారు. పతనం తిట్ట, అలప్పుజ, కొట్టాయం, ఎర్నాకులం, త్రిస్సూర్, కోజికోడ్, వాయనాడ్ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్, మిగిలిన జిల్లాలకు ఎల్లో అలర్ట్ ప్రకటించారు. ఐఎండి హెచ్చరికతో పుదుచ్చేరి, కారైకల్ ప్రాంతాల్లోని అన్ని విద్యా సంస్థలకు బుధవారం సెలవు ప్రకటిస్తూ పుదుచ్చేరి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

సురక్షిత ప్రాంతాలకు తరలించాలని స్టాలిన్ ఆదేశం

చెన్నైలో వరుణుడు దడ పుట్టిస్తున్నాడు. చెన్నై సమీపంలోని వెలాచెరీ, మేడవక్కం, పల్లికరనాయ్‌తో పాటు ఇసిఆర్ నీలంకారీ ప్రాంతాలు భారీ వర్షం కారణంగా జలమయమయ్యాయి. తూతుకుడిలో వరుసగా రోజులుగా నిత్యం వర్షం కురుస్తుండటంతో జనజీవనం స్తంభించింది. పలు కాలనీల్లో వరద నీరు చేరడంతో జనం బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈశాన్య రుతుపవనాల కారణంగా సంభవిస్తున్న వర్షాలతో ప్రజలు ఇబ్బందులు పడకుండా చూసేందుకు జిల్లా యంత్రాంగం, రాష్ట్ర అత్యవసర సేవల విభాగాలు సంసిద్ధంగా ఉండాలని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆదేశించారు. అంతేకాక సముద్రతీరాలు, లోతట్టు ప్రాంతాల్లో నివసించే వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని స్టాలిన్ అధికారులకు సూచించారు.

న్యూయార్క్‌కు నిధులు ఆపేస్తా ...

● సోషలిస్టు మమ్దాని గెలిస్తే నగరం ఇబ్బందులు పడుతుంది
● ట్రంప్ బెదిరింపులు
● 91 శాతం ఓటర్లు మమ్దాని వెంటేనన్న 'కల్షి' సర్వే
● సైద్ధాంతిక యుద్ధంగా మారిన మేయర్ ఎన్నికలు



ట్రంప్



జోహ్రాన్ మమ్దాని

వాషింగ్టన్ : న్యూయార్క్ మేయర్ ఎన్నికల్లో సోషలిస్టు జోహ్రాన్ మమ్దాని గెలిస్తే నిధులు నిలిపేస్తానని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ బెదిరించారు. మంగళవారం వైట్ హౌస్‌లో ట్రంప్ మీడియాతో మాట్లాడుతూ న్యూయార్క్ మేయర్ ఎన్నికల్లో పోటీలో ఉన్న మమ్దానిపై తీవ్ర వ్యతిరేకతను వ్యక్తం చేశారు. అతను అనుభవం లేని వ్యక్తి అని, కమ్యూనిస్టు మమ్దాని గెలిస్తే నగరం ఇబ్బందుల్లో పడుతుందని హెచ్చరించారు. అతని సోషలిస్టు వాగ్దానాలకు రిపబ్లికన్ ప్రభుత్వం నిధులు ఇవ్వదని బెదిరించారు. భవిష్యత్తులో అభివృద్ధికి సమాఖ్య నిధులు రాకుండా చేస్తానన్నారు. " అధ్యక్షుడిగా నా నుండి డబ్బు అవసరం. అందులో అతని ఏమీ లభించదు. కాబట్టి అతనికి ఓటు వేయడంలో అర్ధంలేదు " అని ట్రంప్ తెలిపారు. మరోవైపు 33 ఏళ్ల జోహ్రాన్ మమ్దాని ప్రచారంలో దూసుకుపోతున్నారు. గత వారం జరిగిన అభ్యర్థుల డిబేట్‌లో అందరినీ ఆకట్టుకున్నారు. అనంతరం మమ్దానికి ప్రజల్లో సానుకూలత పెరిగింది. గాజాలో మారణహోమం సృష్టిస్తున్న ఇజ్రాయిల్ అధ్యక్షుడు నెతన్యాహు న్యూయార్క్ వస్తే అరెస్ట్ చేయిస్తానని మరోమారు పునరుద్ఘాటించారు. కల్షి సంస్థ నిర్వహించిన సర్వేలో మమ్దానికి 91% ఓటర్లు అనుకూలంగా ఉన్నారని, స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేస్తున్న మాజీ గవర్నర్ ఆండ్రూ క్యూమోకు 8% మంది ఓటర్లు, మరో అభ్యర్థి ఆడమ్స్‌కు 1% మాత్రమే అనుకూలంగా ఉన్నారని ఆ సంస్థ ప్రకటించింది.. ఎన్ని కుట్రలు చేసినా ట్రంప్, ఆయన సహచర కోటీశ్వరులు ఈ ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేయలేరని, న్యూయార్క్ నగరంలో సమస్యలను పరిష్కరించడానికి స్పష్టమైన ప్రణాళిక రూపొందించిన మమ్దాని ప్రచారం చేస్తున్నారు. అధ్యక్షుడు ట్రంప్ పదేపదే మమ్దానిని లక్ష్యంగా చేసుకుని విమర్శిస్తున్నారు. అమెరికా సమాజం ఎప్పటికీ సోషలిస్టు విధానాలను అంగీకరించదని, ఎప్పటికీ కమ్యూనిస్టు దేశంగా మారదని చెప్పుకొచ్చారు. మమ్దానికి నల్లజాతీయుల నుండి, ఆసియా ఓటర్లనుండి బలమైన మద్దతు ఉంది. సోషలిస్టు అనుకూల ప్రచారంతో, ఉద్యోగాలు, అద్దెలు, ఆర్థిక సమస్యల పరిష్కారం వంటి విషయాలతో యువ ఓటర్లను సైతం ఆకట్టుకోవడం ప్రత్యర్థుల శిబిరంలో కలకలం రేపుతుంది. న్యూయార్క్ వాసులు మమ్దానిపైనే మొగ్గుచూపే అవకాశం ఉండటంతో ట్రంప్ దాడి తీవ్రతరం చేశారని పలువురు విశ్లేషిస్తున్నారు.

వైట్ హౌస్ ఈస్ట్‌వింగ్ కూల్చివేత

● ట్రంప్ కలల ప్రాజెక్టు కోసం ఆరాటం

వాషింగ్టన్ : నో కింగ్స్ అంటూ ప్రపంచవ్యాప్తంగా అమెరికా అధ్యక్షుడికి వ్యతిరేక నిరసనలు ఉధృతమవుతున్నా.. ట్రంప్ తీరు అస్సలు మారటం లేదు. తన కలల ప్రాజెక్టు కోసం వైట్‌హౌస్‌లోని పురాతన కట్టడాన్ని కూల్చేశారు. ఇప్పుడు అక్కడ బాల్‌రూమ్ నిర్మాణానికి ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా వైట్‌హౌస్‌లో ఈస్ట్‌వింగ్ విభాగంలో కూల్చివేతలు ప్రారంభమయ్యాయి. స్వయంగా ట్రంపే ఈ విషయాన్ని ట్రూత్ సోషల్ వేదికగా తెలిపారు. సోమవారం ఈ ఈస్ట్‌వింగ్‌లోని ప్రవేశ ద్వారం, కిటికీలను సిబ్బంది కూల్చేశారు.

శ్వేతసౌధంలో 25 కోట్ల అమెరికన్ డాలర్ల వ్యయంతో ట్రంప్ ఈ బాల్‌రూమ్ తృత్యశాల నిర్మిస్తున్నారు. ఇది వైట్‌హౌస్‌లో ట్రంప్ చేపట్టనున్న అతిపెద్ద నిర్మాణ కార్యక్రమం. దీన్ని ఈస్ట్‌వింగ్ ప్రాంతంలో నిర్మిస్తున్నారు. అక్కడ 999 మంది కూర్చొనేందుకు వీలుగా ప్లాన్ చేశారు. ఈ బాల్‌రూమ్ నిర్మాణం 150 ఏళ్ల పైగా అమెరికా అధ్యక్షుల కల అని ట్రంప్ పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టులో తన సొంత డబ్బును పెట్టుబడిగా పెట్టినట్లు తెలిపారు. దీనికి సంబంధించిన అమెరికన్ పన్ను చెల్లింపుదారులకు ఎలాంటి ఖర్చు ఉండదన్నారు. ఇది వైట్‌హౌస్ నిర్మాణానికి అనుసంధానంగా ఉన్నప్పటికీ.. దీనికి శ్వేతసౌధంతో సంబంధం లేదని తెలిపారు. వైట్‌హౌస్ రెండు శతాబ్దాలుగా అమెరికా అధ్యక్షుడి చారిత్రక నివాసంగా ఉంది. ఈస్ట్ వింగ్‌ను 1902లో నిర్మించారు.

ఒప్పందం చేసుకోకుంటే 155 శాతం సుంకాలు

● చైనాకు ట్రంప్ బెదిరింపు

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చైనాపై వ్యంగ్యాస్త్రాలు సంధించారు. చైనాకు అమెరికాపై అపార గౌరవం ఉన్నందునే ఎక్కువ టారిఫ్‌లు చెల్లిస్తోందని పేర్కొన్నారు. చాలా దేశాలు అమెరికాను సద్వినియోగం చేసుకుంటున్నాయన్నారు. చైనా మాత్రం అమెరికాను సద్వినియోగం చేసుకోలేకపోతోందని తెలిపారు. అమెరికాతో ఒప్పందం చేసుకోకుంటే చైనా 155 శాతం సుంకాలు చెల్లించాలన్నారు. ఈ పెరిగిన సుంకాలు నవంబర్ 1 నుంచి చైనా చెల్లించే అవకాశం ఉందన్నారు. మరోవైపు చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో రెండు వారాల్లో దక్షిణ కొరియాలో సమావేశం కానున్నట్టు ట్రంప్ ప్రకటించారు.

కౌలు రైతు ఆత్మహత్య

ప్రజాశక్తి- మైలవరం (ఎన్‌టిఆర్ జిల్లా)

అప్పుల బాధతో కౌలు రైతు ఆత్మహత్య చేసుకున్నారు. ఈ ఘటన ఎన్‌టిఆర్ జిల్లా మైలవరం మండలం శివారు సీతారాంపురం తండాలో మంగళవారం జరిగింది. పోలీసు లు తెలిపిన వివరాల ప్రకారం.. సీతారాంపురం తండాకు చెందిన భూక్య సక్రు (55) కొంత భూమిని కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తూ జీవిస్తున్నారు. మూడేళ్లపాటు బయట అప్పులు చేసి వ్యవసాయానికి రూ.15 లక్షల వరకు పెట్టుబడి పెట్టారు.. అరకొర వచ్చిన ఆదాయంతో వడ్డీలు చెల్లించలేక తీవ్ర మనోవేదనకు గురయ్యారు. ఈ నేపథ్యంలో మంగళవారం తెల్లవారు జామున తాను సాగు చేస్తున్న పొలానికి వెళ్లి పురుగుమందు తాగారు. సమీపంలోని పొలాల్లో ఉన్న రైతులు గమనించి మైలవరంలోని ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే ఆయన మృతి చెందారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ సుధాకర్ తెలిపారు.

ఆర్‌డిఒ, డిఆర్‌ఒలపై బదిలీ వేటు

- శ్రీలేఖ వ్యవహారాన్ని సీరియస్‌గా తీసుకున్న ప్రభుత్వం

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్

వివాదాలకు కేంద్ర బిందువైన విశాఖపట్నం ఆర్‌డిఒ, శ్రీలేఖ ఎట్టకేలకు బదిలీ అయ్యారు. ఆమెతో పాటు జిల్లా రెవెన్యూ అధికారి బి.హెచ్.భవానీ శంకర్‌ను కూడా బదిలీ చేశారు. ఈ మేరకు ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు అందాయి. దాదాపు ఏడాది క్రితం విశాఖపట్నం ఆర్‌డిఒగా బాధ్యతలు చేపట్టిన శ్రీలేఖ ప్రారంభం రోజుల నుంచి అనేక వివాదాలకు కేంద్ర బిందువుగా మారారు. పలువురిపై కేసులు బనాయించారు. ఉన్నతాధికారుల ఆదేశాలను బేఖాతర్ చేస్తూ రెవెన్యూ శాఖకు తలనొప్పిని కలిగించారు. ప్రజలు, మీడియా ప్రతినిధులను బెదిరింపులు చేస్తూ వచ్చిన శ్రీలేఖ ఆఖరికి తన ఉన్నతాధికారి డిఆర్‌ఒపై కూడా తిరుగుబాటు జెండా ఎగురవేశారు. పెందుర్తి మండలం చినముషిడివాడ దళితవాడలో ఉన్న అంబేద్కర్ విగ్రహాన్ని తొలగించడానికి తహశీల్దార్, ఆర్‌ఐ వంటి ఉద్యోగులపై ఒత్తిడి తెచ్చి చట్టవిరుద్ధంగా వ్యవహరించారు. దీనికి సంబంధించిన వివాదం కోర్టులో ఉంది. అయినప్పటికీ మరోసారి ఆ స్థలం తనదని చెబుతున్న ఒక వ్యక్తికి కొమ్ముకాస్తూ అంబేద్కర్ విగ్రహం తొలగింపునకు ఆమె యత్నించినట్లు చెబుతుంటారు. దీనిని ప్రతిఘటించిన ఒక ప్రజా సంఘం కార్యకర్తలు, కలెక్టర్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. కలెక్టర్ స్పందించి కోర్టు వివాదం ఉండగా తొందరపాటు చర్య ఎందుకు తీసుకున్నారని ఆర్‌డిఒను మందలించారు. ఈ నేపథ్యంలో డిఆర్‌ఒ భవానీ శంకర్ తన పరిధిలో ఉన్న తహశీల్దార్లను, ఆర్‌ఐ వంటి ఉద్యోగులను ఒక్కొక్క మండలానికి నెలకు రూ.20 వేలు ఇవ్వాలని ఆదేశించినట్లు, ప్రోటోకాల్ ఖర్చులు, ఇతర ఖర్చులు అధికంగా ఉన్నాయని ఆయన చెప్పినట్లు ఆరోపిస్తూ ఆర్‌డిఒ శ్రీలేఖ ఆయనపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనికి సంజాయిషీ కోరుతూ కలెక్టర్ వారిద్దరికీ నోటీసులు ఇచ్చారు. ఈ వివాదం కాస్త తీవ్ర స్థాయికి చేరడంతో కలెక్టర్ ప్రభుత్వానికి నివేదిక పంపడం, రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ స్పందించడం చకచకా జరిగిపోయాయి. తుదకు ఇద్దరిపై బదిలీ వేటు పడింది.

రోడ్డు ప్రమాదంలో బిఎస్‌ఎఫ్ జవాన్ మృతి

ప్రజాశక్తి- చింతూరు (అల్లూరి జిల్లా)

అల్లూరి జిల్లా చింతూరు మండలంలోని చట్టి జాతీయ రహదారి 30పై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బిఎస్‌ఎఫ్ జవాన్ అక్కడికక్కడే మృతి చెందారు. ఎస్ఐ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం... బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్‌కు సంబంధించిన ఏడుగురు జవానులు తెలంగాణ రాష్ట్రం ఖమ్మం నుండి బలిమెల, ఒడిశాకు కారులో వెళ్తుండగా తెల్లవారుజామున చింతూరు మండలం చట్టి జంక్షన్‌కి దగ్గరలో ఉన్న కల్వర్టును ప్రమాదవశాత్తు ఢీకొంది. దీంతో, ఓ జవాన్ మృతి చెందారు. గాయపడిన మిగిలిన ఆరుగురినీ మెరుగైన వైద్యం కోసం భద్రాచలం ఆస్పత్రికి తరలించారు. చింతూరు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థినిపై అత్యాచారం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం సిటీ

రాజమహేంద్రవరంలో ఒక ప్రభుత్వ వసతిగృహంలో ఉంటూ చదువుకుంటున్న 14 ఏళ్ల విద్యార్థిని అత్యాచారానికి గురైంది. రెండు రోజుల క్రితం జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వసతిగృహం నుంచి బయటకు వెళ్లిన బాలిక ముఖం, శరీరంపై తీవ్ర గాయాలు ఉండటంతో హాస్టల్ వార్డెన్ నిలదీయడంతో విషయం బయటకు వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు కాకినాడకు చెందిన బాలిక రాజమహేంద్రవరంలోని ప్రభుత్వ హాస్టల్‌లో ఉంటూ పదో తరగతి చదవుకుంటోంది. రెండు రోజుల క్రితం బాలిక హాస్టల్ నుంచి బయటకు వచ్చింది. రావులపాలెం మండలం జొన్నాడకు చెందిన అజయ్(20) అనే యువకునితో బైకుపై వెళ్లింది. వీరితో పాటు మరో యువకుడు కూడా వెళ్లాడు. బాలికను వారు రైల్వే స్టేషన్ సమీపంలోని ఒక లాడ్జికి తీసుకెళ్లారు. అక్కడ ఆమెపై అత్యాచారం చేశారు. అనంతరం ఆమెను బైక్‌పై తీసుకుని దేవి చౌక్ సెంటర్‌లో వదిలేశారు. హాస్టల్ వార్డెన్ బాలిక తల్లిదండ్రులకు విషయం తెలియజేయడంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేవారు. కేసుకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని పోలీసులు తెలిపారు.

మొక్కజొన్న రైతులను దోచుకుంటున్న దళారులు

- కొనుగోలు చేయని ప్రభుత్వం
- పెట్టుబడులు రావడం లేదని రైతుల ఆవేదన

ప్రజాశక్తి-బొబ్బిలి

మొక్కజొన్న రైతులు దళారుల బారిన పడుతున్నారు. మొక్కజొన్నకు మంచి గిరాకీ ఉండడంతో జిల్లా వ్యాప్తంగా సుమారు 50వేల ఎకరాల్లో రైతులు సాగు చేస్తున్నారు. మొక్కజొన్న పశువులు, కోళ్ల దాణాకు ఎక్కువగా వినియోగించడంతో భలే డిమాండ్ ఉంది. ఈనేపథ్యంలోనే జిల్లా వ్యాప్తంగా మెట్ట, వర్షాధారంగా సాగు చేస్తున్న పల్లం భూముల్లో



మద్దతు ధర ప్రకటించినా కొనుగోలు చేయని ప్రభుత్వం

మొక్కజొన్నకు ప్రభుత్వం గిట్టుబాటు ధర రూ. 2,400 ప్రకటించింది. అయినప్పటికీ కొనుగోలు చేయడం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఈనేపథ్యంలోనే దళారులు, వ్యాపారులు క్వింటాలు మొక్కజొన్న రూ. 1900 నుంచి రూ. 2వేలు వరకు కొనుగోలు చేసి నిలువునా దోపిడీ చేస్తున్నారు. గిట్టుబాటు ధర రాకపోవడంతో పెట్టుబడులు కూడా రావడం లేదని రైతులు వాపోతున్నారు. మొక్కజొన్న కొనుగోలు చేసి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

మొక్కజొన్నను రైతులు సాగు చేస్తున్నారు. వారం రోజుల క్రితం నుంచి కోత దశకు రావడంతో రైతులు మొక్కజొన్న కోసిన నూర్పిడి చేసే పనుల్లో బిజీగా ఉన్నారు. వర్షాలు కురవడంతో నిల్వ చేసుకునేందుకు అవకాశం లేకపోవడంతో రైతులు కల్లంలోనే పంటను వ్యాపారాలు, రైతులకు అమ్మేస్తున్నారు. ఇదే అదునుగా భావిస్తున్న దళారులు, వ్యాపారాలు తక్కువ ధరకు కొనుగోలు చేసి నిలువునా రైతులను దోపిడీ చేస్తున్నారు.

నిల్వ చేసేందుకు అవకాశం లేక అమ్మేస్తున్నాం

మొక్కజొన్న నిల్వ చేసేందుకు అవకాశం లేక పోవడంతో వ్యాపారు లకు అమ్మేస్తున్నాం. ప్రభుత్వం గిట్టుబాటు ధర రూ. 2400 ప్రకటించిన కొనుగోలు చేయక పోవడంతో రైతులకు ఏమి లాభం. గిట్టుబాటు ధర లేకపోవడంతోపెట్టుబడులు కూడా రావడం లేదు.

- ఎం.అప్పలనాయుడు, ఎం. బూర్జవలస

ప్రభుత్వం కొనుగోలు చేసి ఆదుకోవాలి

మొక్కజొన్నను ప్రభుత్వం కొనుగోలు చేసి ఆదుకోవాలి. ఎరువులు, కూలి రేట్లు పెరగడంతో పెట్టుబడులు బాగా పెరిగి పోయాయి. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి గిట్టుబాటు ధరకు కొనుగోలు చేసి ఆదుకోవాలి.

సింగనపల్లి వేణు, గున్నతోటవలస

వంద మార్కులు వస్తే విమానయానం

- మాట నెరవేర్చిన పెదనింద్రకొలను హైస్కూల్ తెలుగు ఉపాధ్యాయుడు

ప్రజాశక్తి - నిడమర్రు

పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో తెలుగులో నూటికి నూరు మార్కులు తెచ్చుకుంటే విమానం ఎక్కిస్తాను అంటూ విద్యార్థులకు ఇచ్చిన మాటను మాస్టార్ నిలబెట్టుకున్న ఘటన నిడమర్రు మండలంలోని పెదనింద్రకొలను హైస్కూల్‌లో చోటుచేసుకుంది. అదే స్కూల్‌లో తెలుగు ఉపాధ్యాయునిగా పని చేస్తున్న షేక్ మౌలాలి విద్యార్థులకు ఇచ్చిన మాట ప్రకారం తెలుగులో నూటికి నూరు మార్కులు సాధించిన ఇద్దరు విద్యార్థులను గన్నవరం నుంచి విమానంలో హైదరాబాద్ తీసుకెళ్లడంతో ఆ విద్యార్థుల్లో ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి. తాను చదువు చెప్పే విద్యార్థులను పైకి తీసుకురావాలనే సంకల్పంతో తెలుగు మాస్టార్ మౌలాలి వినూత్న ఆలోచనలకు శ్రీకారం చుట్టారు. మూడేళ్లుగా పదో తరగతి పరీక్షల్లో తెలుగులో అత్యధిక మార్కులు సాధించిన వారిని తనదైన రీతిలో ప్రోత్సహిస్తున్నారు. మొదటి ఏడాది తెలుగులో 98 మార్కులు టార్గెట్‌గా విధించి సాధించిన విద్యార్థులకు బ్యాగ్‌లు, మెమెంటోలు అందించారు. రెండో ఏడాది 99 మార్కుల లక్ష్యం విధించి సాధించిన విద్యార్థులకు బహుమతులు ఇచ్చారు. 2025 పబ్లిక్ పరీక్షల్లో తెలుగులో నూటికి నూరు మార్కులు సాధించిన విద్యార్థులను విమానం ఎక్కిస్తానని మౌలాలి మాటిచ్చారు. ఎంతో కష్టపడి చదవి ఆ మార్కులు సాధించి, ప్రస్తుతం ఇంటర్ చదువుతున్న నిమ్మల పావని, నిమ్మల సత్యసాహితీలను ఇచ్చిన మాట ప్రకారం తన సొంత ఖర్చులతో గడిచిన శనివారం గన్నవరం విమానశ్రయానికి తీసుకెళ్లి, అక్కడ నుంచి విమానంలో హైదరాబాద్ తీసుకెళ్లారు. విమానం ఎక్కాలనే కల నెరవేరడంతో విద్యార్థుల సంతోషానికి అవధులు లేకుండాపోయాయి. అంతేకాకుండా శని, ఆదివారాల్లో వారికి చార్మినార్, ట్యాంక్‌బండ్, సాలార్జింగ్ మ్యూజియం, హైటెక్ సిటీ వంటి ప్రముఖ ప్రాంతాలను చూపించి తీసుకొచ్చారు. విద్యార్థులకిచ్చిన మాట నిలబెట్టుకున్న ఉపాధ్యాయులు మౌలాలిని పలువురు ప్రశంసిస్తున్నారు.





రాష్ట్రపతికి స్వాగతం పలుకుతున్న పినరయి విజయన్

కేరళకు ముర్ము

తిరువనంతపురం : నాలుగు రోజుల పర్యటన కోసం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మంగళవారం రాత్రి కేరళకు చేరుకున్నారు. తిరువనంతపురం విమానాశ్రయంలో ఆమెకు కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ స్వాగతం పలికారు. తరువాత ఆమె రాజ్‌భవన్‌కు చేరుకున్నారు. రాష్ట్రపతి ఈ పర్యటనలో శబరిమల, శివగిరి ఆలయాలను సందర్శిస్తారు. అలాగే రాజ్‌భవన్‌లో మాజీ రాష్ట్రపతి కె.ఆర్.నారాయణన్ విగ్రహ ఆవిష్కరణ చేయనున్నారు.

ఇద్దరు మహిళలు అదృశ్యం

- కేసు నమోదు

ప్రజాశక్తి - బండి ఆత్మకూరు

బండి ఆత్మకూరు మండలంలో ఇద్దరు మహిళలు అదృశ్యమయ్యారు. నంద్యాల జిల్లా బండి ఆత్మకూరు మండలంలోని లింగాపురం గ్రామానికి చెందిన వివాహిత మెట్ట సుంకన్న భార్య మెట్ట సింధు ఈ నెల 17న ఎవరికి చెప్పకుండా ఇంట్లో నుండి వెళ్లిపోయారు. సమీప గ్రామాల్లో బంధువుల దగ్గర, స్నేహితుల దగ్గర విచారణ చేపట్టినా ఆచూకీ కనిపించకపోవడంతో భర్త మెట్ట సుంకన్న స్థానిక పోలీస్ స్టేషన్లో మంగళవారం ఫిర్యాదు చేశారు. ఎస్ఐ జగన్మోహన్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మహిళ ఆచూకీ తెలిసిన వారు బండి ఆత్మకూరు పోలీసులను సంప్రదించాలని కోరారు. అలాగే పరమటూరు గ్రామానికి చెందిన తిమ్మన్న గారి బాలమద్దిలేటి తిమ్మన్న గారి లక్ష్మీదేవి దంపతుల కుమార్తె తిమ్మన్న గారి మధుమతి ఈ నెల 20న రాత్రి ఇంటి నుండి ఎవరికి చెప్పకుండా వెళ్లిపోయారని తల్లి లక్ష్మీదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ జగన్మోహన్ తెలిపారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మా డబ్బులు ఎప్పుడు ఇస్తారు?

- పోస్టల్ కార్యాలయం వద్ద ఖాతాదారుల ఆందోళన
- సిబ్బంది విధులకు హాజరు కాకుండా అడ్డగింత
- అధికారుల హామీతో ఆందోళన విరమణ

ప్రజాశక్తి - ఇచ్ఛాపురం (శ్రీకాకుళం)

శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం పోస్టల్ కార్యాలయంలో ఆర్థిక అవకతవకల కారణంగా ఖాతాదారులకు చెల్లించాల్సిన డబ్బులు మూడు నెలలైనా చెల్లించకపోవడంతో బాధితులు కార్యాలయం ఎదుట మంగళవారం ఆందోళన చేపట్టారు. ఉదయానికే పోస్టల్ కార్యాలయానికి చేరుకున్న బాధిత ఖాతాదారులు గేటుకు అడ్డంగా బైఠాయించి సిబ్బందిని విధులకు హాజరు కాకుండా అడ్డుకున్నారు. తమ డిపాజిట్లు చెల్లించాలని నినాదాలు చేశారు. పోస్టుమాస్టర్ జి.షణ్ముఖరావు బాధితులకు నచ్చజెప్పినా వినకపోవడంతో పోస్టల్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్‌కు ఫోన్‌లో సమాచారం ఇచ్చారు. ఆయన అక్కడకు చేరుకుని చాలా సేపు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. తమ డబ్బులు పలానా తేదీ నాటికి అందజేస్తామని లిఖితపూర్వకంగా ఇస్తే ఆందోళన విరమిస్తామని బాధితులు స్పష్టం చేశారు. తాను అలా ఇవ్వలేనని చెప్పి... పోస్టల్ అసిస్టెంట్ డైరెక్టర్ రాజు, సూపరింటెండెంట్ హరిబాబుకు ఫోన్‌లో విషయాన్ని వివరించారు. అందరికీ న్యాయం చేస్తామని, ఒక్క పైసా కూడా పోదని ఎడి రాజు ఫోన్‌లో వాయిస్ మెసేజ్ పంపించారు. తమకు వాయిస్ మెసేజ్‌లు వద్దని నేరుగా కార్యాలయం వద్దకు రావాలని, లేదంటే బాధితులతో ఫోన్‌లో మాట్లాడాలని పట్టుబట్టారు. కార్యాలయానికి రాలేకపోతే బాధితులతో ఫోన్‌లో మాట్లాడాలని ఆందోళనకు మద్దతు తెలిపేందుకు వచ్చిన జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి దాసరి రాజు, అంగన్వాడీ యూనియన్ నాయకులు బి.హైమ డిమాండ్ చేశారు. దీంతో పోస్టల్ అసిస్టెంట్ డైరెక్టర్ రాజు ఫోన్‌లో మాట్లాడి 15 రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని హామీనివ్వడంతో బాధితులు ఆందోళనను విరమించారు. మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఆందోళన కొనసాగడంతో అంతవరకు పోస్టల్ అధికారులు బయటే నిల్చొన్నారు.



గోదావరి జలాలు కడలిపాలు

- ఇప్పటి వరకు సముద్రంలోకి 4,178 టిఎంసిల విడుదల
- గోదావరి జిల్లాల్లో వాడుకున్నది 163 టిఎంసిలు మాత్రమే
- నీటిని సద్వినియోగం చేసుకుంటే 4.18 కోట్ల ఎకరాలకు సాగునీరు

ప్రజాశక్తి - కొవ్వూరు

ఏటా గోదావరి నుంచి వేలాది టిఎంసిల నీరు సముద్రంలోకి వృథాగా పోతుంది. ఈ ఏడాది జూన్ 1 నుంచి అక్టోబర్ 15 వరకు రికార్డు స్థాయిలో 4,178.72 టిఎంసిల నీరు సముద్రంలో కలిసింది. ఈ సీజన్‌లో ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల్లో సాగు, తాగు నీటి అవసరాలతో పాటు పరిశ్రమలకు 163 టిఎంసిల నీటిని మాత్రమే వినియోగించుకున్నారు.

ఈ ఏడాది గోదావరి జిల్లాలో 8.96 లక్షల ఎకరాలను సాగు చేశారు. రబీ సీజన్‌లో గోదావరి డెల్టా ఆయకట్టు రైతులు సాగునీటి ఇబ్బందులను ఎదుర్కోవడం పరిపాటిగా మారుతోంది. సమగ్రమైన నీటి పొదుపు చర్యలు పాటించకపోతే రబీ సీజన్‌లో పంట గట్టెక్కడం గగనమవుతుంది. ఏటా రబీలో సాగునీరు అందించేందుకు, నీటి పొదుపు చర్యలకు ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చిస్తుంది. మంగళవారం కూడా గోదావరి నుంచి 2.50 లక్షల నీరు సముద్రంలోకి విడిచి పెడుతున్నారు. ఏటా జులై, ఆగస్టు నెలలో గోదావరికి వరద రావడం పరిపాటి. ఈ ఏడాది సెప్టెంబర్ నెలలోనూ రికార్డు స్థాయిలో వరద వచ్చింది. ఇలా వరద రావడం ఏడేళ్ల కాలంలో ఇదే ప్రథమం. సెప్టెంబర్ నెలలో ఏకంగా 1591.94 టిఎంసిల నీరు కడలి పాలైంది. అక్టోబర్ నెలలోనూ సరాసరిన రోజుకు రెండు లక్షల క్యూసెక్కుల వరద నీరు సముద్రంలో కలుస్తుంది.



ఒక టిఎంసితో 11 వేల ఎకరాలకు సాగునీరు

నీటిపారుదల శాఖ లెక్కల ప్రకారం ఒక టిఎంసి నీటిని 11 ఎకరాలకు అందించొచ్చు.

కనిష్టంగా పదివేల ఎకరాల వరి పంటకు సాగునీరు ఇవ్వొచ్చని నీటి పారుదల శాఖ నిపుణులు చెబుతున్నారు. ఈ లెక్కన ఈ ఏడాది గోదావరి నుంచి సముద్రంలో కలిసిన 4,176 టిఎంసిల నీటిని పూర్తి స్థాయిలో సాగునీటి అవసరాలకు వినియోగించుకుంటే 4.18 కోట్ల ఎకరాలకు సాగునీరి అందే వీలుంటుంది.

పోలవరం పూర్తయితేనే పరిష్కారం

ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాలతో పాటు కృష్ణ, విశాఖ పట్టణం జిల్లాల్లో సాగు, తాగునీటి అవసరాలను తీర్చడం కోసం పోలవరం ప్రాజెక్టును నిర్మించారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే 7.72 లక్షల ఎకరాలకు అదనంగా సాగునీరు అందించే అవకాశం ఏర్పడు తుంది. 194 టిఎంసిల నీటిని నిల్వ చేసుకోవడం ద్వారా భవిష్యత్తు అవసరాలను తీర్చుకునే అవకాశం ఏర్పడుతుంది. ఏటా రబీలో సాగునీటి ఇబ్బందుల నుంచి గట్టెక్కే ఆస్కారం ఏర్పడుతుంది.




ధర్మాన్ని కాపాడుతూ ప్రతీకారం తీర్చుకున్నాం

- ఆపరేషన్ సిందూర్‌పై మోడీ

న్యూఢిల్లీ : ఆపరేషన్ సిందూర్ సమయంలో భారతదేశం ధర్మాన్ని కాపాడడంతో పాటు అన్యాయానికి ప్రతీకారం తీర్చుకున్నదని ప్రధాని నరేంద్ర మోడీ తెలిపారు. ఆయన మంగళవారం దేశ ప్రజలకు ఓ లేఖ రాశారు. అయోధ్యలో రామాలయ నిర్మాణం తర్వాత ఇది రెండో దీపావళి అని గుర్తు చేస్తూ ధర్మాన్ని ఎలా నిలబెట్టాలో శ్రీరాముడు నేర్పాడని, అలాగే అన్యాయాన్ని ఎదుర్కోవడానికి తగిన ధైర్యాన్ని కూడా ఇచ్చాడని వివరించారు. ఆపరేషన్ సిందూర్‌కు రాముడే ఉదాహరణ అని అన్నారు. నక్సలిజం, మావోయిజం మూలాలను నిర్మూలించిన ప్రాంతాలలో ఈ ఏడాది ప్రజలు దీపావళిని జరుపుకున్నారని తెలియజేశారు. ఇటీవలి కాలంలో దేశంలో చాలా మంది హింసామార్గాన్ని విడనాడి ప్రధాన అభివృద్ధి స్రవంతిలో చేరారని చెప్పారు. సమీప భవిష్యత్తులో ప్రపంచంలో మూడో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించబోతున్నామని తెలిపారు. జిఎస్‌టి రేట్ల కుదింపు వంటి తదుపరి తరం సంస్కరణలు కూడా దేశంలో ప్రారంభమయ్యాయని ప్రధాని తన లేఖలో వివరించారు. దేశీయ ఉత్పత్తులకు పెద్ద పీట వేయాలని, వాటిని కొనుగోలు చేసి ప్రోత్సహించాలని ప్రజలను ప్రధాని కోరారు.

ఢిల్లీని కమ్మేసిన కాలుష్యం

- ఎన్‌సిఆర్ పరిధిలో క్షీణించిన గాలి నాణ్యత
- దీపావళి వేడుకల తరువాత రెడ్ జోన్‌లోకి 36 పాయింట్లు
- అవసరమైతేనే బయటకు రావాలని నిపుణుల సూచన



ప్రజాశక్తి - న్యూఢిల్లీ బ్యూరో

దేశ రాజధాని ఢిల్లీని వాయు కాలుష్యం కమ్మేసింది. గత ఆరు రోజులుగా వాయు కాలుష్యం ప్రమాద స్థాయిలో కొనసాగుతోంది. దీపావళి వేడుకల తర్వాత వాయు కాలుష్యం ప్రమాదకర స్థాయికి చేరింది. మంగళవారం ఉదయం ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ (ఎక్యూఐ) 451 పాయింట్లతో నమోదైంది. ఎన్‌సిఆర్ పరిధిలో మొత్తం 38 ఎయిర్ మానిటరింగ్ స్టేషన్లు ఉండగా... దాదాపు 36 పాయింట్లలో వెరీ పూర్ కేటగిరితో రెడ్ జోన్‌ను చూపించాయి. వజీర్‌పూర్ 423, ద్వారకా 417, అశోక్ విహార్ 404, ఆనంద్ విహార్‌లో 404 ఎక్యూఐ నమోదైంది. పటేల్ నగర్, జహంగీర్‌పురి, బురారి వంటి ప్రాంతాల్లో ఎక్యూఐ 480 దాటినట్లు వెల్లడైంది. ఇది దేశ సగటు కంటే దాదాపు 1.8 రెట్లు ఎక్కువ అని అధికారులు తెలిపారు. యునెస్కో రికార్డుల ప్రకారం... ఏకంగా 15 రెట్లు ఎక్కువని నిపుణులు పేర్కొన్నారు. ఇది చాలా ప్రమాదకరమని కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి (సిబిసిబి) పేర్కొంది. బుధవారం వరకు ఇదే పరిస్థితి ఉంటుందని అధికారులు హెచ్చరిస్తున్నారు. అందువల్ల అత్యవసర పరిస్థితుల్లోనే ఇళ్ల నుంచి బయటకు రావాలని సూచించారు. కాలుష్యం పెరగడంలో కళ్లు, ముక్కు, గొంతులో మంట, దురద సమస్యలు తలెత్తుతాయని వైద్యులు తెలిపారు. అందువల్ల మాస్కులు ధరించాలని సూచిస్తున్నారు.

గతేడాది కంటే పెరిగిన కాలుష్యం

గత దీపావళితో పోల్చితే ఈసారి ఎయిర్ పొల్యూషన్ భారీగా నమోదైంది. గతేడాది దీపావళి మరుసటి రోజు ఉదయం ఎక్యూఐ 296 పాయింట్లుగా నమోదు కాగా.. ఈసారి పండగ సాయంత్రానికే ఎయిర్ క్వాలిటీ దారుణంగా పడిపోయింది. ఇందుకు బాణసంచా కాల్చడమే ప్రధాన కారణమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఎన్‌సిఆర్ పరిధిలో బాణసంచా కాల్చడంపై ఇటీవల సుప్రీంకోర్టు నిషేధం విధించింది. అయితే... కొత్తగా ఢిల్లీలో అధికారంలోకి వచ్చిన బిజెపి సర్కారు విజ్ఞప్తితో ఈసారి గ్రీన్ క్రాకర్స్ కాల్చుకునేందుకు ఈ నెల అక్టోబరు 15న సుప్రీంకోర్టు షరతులతో కూడిన అనుమతినిచ్చింది. అయితే... ఈ గ్రీన్ క్రాకర్స్ పేరుతో మార్కెట్లో గడువు ముగిసిన, నాణ్యత లేని బాణసంచా విచ్చలవిడిగా అమ్మకాలు జరిగాయి. ఫలితంగా బాణసంచా సౌండ్స్ కన్నా... పొల్యూషన్ భారీగా పెరిగింది. ఢిల్లీ వాసులు సైతం భారీగా బాణసంచాను కొలుగోలు చేశారు. రాత్రి 8 గంటల నుంచి 10 గంటల వరకే టపాసులు కాల్చుకునేందుకు కోర్టు అనుమతినివ్వగా... అర్ధరాత్రి వరకు బాణసంచా కాల్చారు. దీనికి వాతావరణ మార్పులు తోడవడంతో కాలుష్య కారకాలు అలాగే అంటిపెట్టుకొని గాలి తేమతో కలిసిపోయాయి.

ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్...

ఎయిర్ క్వాలిటీ అండ్ వెదర్ ఫోర్ కాస్టింగ్ అండ్ రీసెర్చ్ ప్రకారం... ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ (ఎక్యూఐ)లో స్థానిక ప్రాంతంలోని గాలి నాణ్యతలను తెలుసుకోవచ్చు. ఎక్యూఐ 0-100 మధ్య ఉంటే గాలి నాణ్యత బాగా ఉండి కాలుష్యం లేదని అర్థం. అదే 100-200 ఉంటే గాలి నాణ్యత మధ్యస్థంగా ఉందని, ఇక 200-300 మధ్య ఉంటే అధ్వానంగా ఉందని, 300-400 ఉంటే గాలి నాణ్యత మరింత అధ్వానంగా ఉన్నట్లు. ఇక 400-500 మధ్య ఉంటే కాలుష్యం తీవ్ర స్థాయిలో ఉన్నట్లు.

ఢిల్లీ పరిసర ప్రాంతాల్లో పెరిగిన కాలుష్యంతో సర్కారు దిద్దుబాటు చర్యలు చేపట్టింది. గ్రేడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్ (జిఆర్‌ఎపి) రెండో దశను అమల్లోకి తెచ్చింది. దీని ప్రకారం... నిర్మాణ పనులపై పరిమితులు విధించింది. తద్వారా నిర్మాణ సైట్స్ నుంచి వచ్చే దుమ్ము, ధూళిని కంట్రోల్ చేయడం లక్ష్యంగా పెట్టుకుంది. డీజిల్ జనరేటర్ల వినియోగంపై నిషేధం పెట్టింది. ప్రైవేట్ వాహనాలను కంట్రోల్ చేసేలా... ఎలక్ట్రిక్ బస్సులు, మెట్రో రైళ్ల సేవలు పెంచింది. స్టూడెంట్స్, ముఖ్యంగా పాఠశాలలకు వెళ్లే పిల్లల కోసం ఆన్‌లైన్ క్లాసులు పెట్టే పరిశీలన చేస్తోంది. వీటితోపాటు రోడ్లపై నీటి స్ప్రేలు, యాంటీ-స్మాగ్ గన్స్ వినియోగం పెంచాలని నిర్ణయించినట్లు అధికారులు తెలిపారు.

ఏడు బిఎండబ్ల్యూ కార్ల కొనుగోలుకు లోక్‌పాల్ టెండర్

- వెల్లువెత్తుతున్న విమర్శలు

న్యూఢిల్లీ : అవినీతిని నిర్మూలించే ఉద్దేశంతో ఏర్పాటైన లోక్‌పాల్ ఏడు విలాసవంతమైన బిఎండబ్ల్యూ కార్ల కొనుగోలుకు టెండర్‌ను పిలవడం విమర్శలకు తావిస్తోంది. ప్రతిపక్షపార్టీలు, అవినీతి వ్యతిరేక కార్యకర్తలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఈ నెల 16న జారీ చేసిన టెండర్‌లో భారత లోక్‌పాల్ కోసం ఏడు బిఎండబ్ల్యూ 3 సిరీస్ 330ఎల్‌ఐ కార్ల సరఫరా కోసం ప్రముఖ ఏజెన్సీల నుంచి ఓపెన్ టెండర్లను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. లాంగ్‌వీల్ బేస్, తెలుపు రంగులో ఉన్న ఎం స్పోర్ట్స్ మోడల్ కార్ల గురించి ప్రత్యేకంగా ప్రస్తావించారు. ప్రస్తుతం భారత లోక్‌పాల్‌లో ఛైర్మన్, ఆరుగురు సభ్యులున్నారు. అంటే ఒక్కొక్కరికీ ఒక్కో బిఎండబ్ల్యూ కారు కోసం ఈ టెండరు జారీ చేసినట్లయింది. అలాగే లోక్‌పాల్ టెండర్ ప్రకారం ఎంపికైన సరఫరాదారులు లోక్‌పాల్ ఎంపిక చేసిన డ్రైవర్లు, నియమించిన సిబ్బందికి ఏడు రోజుల సమగ్ర ఆచరణాత్మక, సైద్ధాంతిక శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించాలి. వాహనాలు డెలివరీ చేసిన 15 రోజుల్లోపు ఈ శిక్షణ పూర్తి చేయాల్సి ఉంటుంది. అన్ని నియంత్రణలు, భద్రతా వ్యవస్థలతో పరిచయంతో పాటు ప్రతీ డ్రైవర్‌కు కనీసం 50 నుంచి 100 కిలోమీటర్ల ఆన్-రోడ్ ప్రాక్టీస్‌ను కవర్ చేయాల్సి ఉంటుందని కూడా లోక్‌పాల్ స్పష్టం చేసింది. బిడ్లు దాఖలు చేయడానికి నవంబర్ 6ను చివరి తేదీగా పేర్కొన్నారు. అలాగే రూ.10 లక్షల ముందస్తు డిపాజిట్ చేయాలి. ప్రతిపక్ష నాయకులు, అవినీతి వ్యతిరేక కార్యకర్తలు ఈ టెండర్‌ను తీవ్రంగా ఖండించారు. ఇది సంస్థ లక్ష్యాన్నే దెబ్బతీసే దుబారా ప్రదర్శనగా విమర్శించారు. ప్రముఖ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ ఇలాంటి టెండర్ లోక్‌పాల్‌ను బలహీనపరుస్తుందని అన్నారు. 'అనేక ఏళ్లుగా లోక్‌పాల్‌ను ఖాళీగా ఉంచిన మోడీ ప్రభుత్వం ప్రస్తుతం లోక్‌పాల్‌లో విలాసాలతో మునిగి ఉన్న వ్యక్తులను సేవకులుగా నియమించింది. వారు ఇప్పుడు తమ కోసం 70ఎల్ బిఎండబ్ల్యూ కార్లను కొనుగోలు చేస్తున్నారు' అని ప్రశాంత్ భూషణ్ ఎక్స్‌లో పోస్టు చేశారు. కాంగ్రెస్ నాయకులు సరళ్ పటేల్ ఈ చర్యను వ్యతిరేకిస్తూ ఈ లోక్‌పాల్ గత 11 ఏళ్లలో ఒక్క కేసుపైన అయినా చర్య తీసుకున్నారా.. అని ప్రశ్నించారు. లోక్‌పాల్ అవినీతిపై దర్యాప్తు చేయడానికి బదులుగా దుబారాకు పాల్పడుతున్నట్లుగా కనిపిస్తోందని విమర్శించారు.

21 అంతస్తుల భవనంలో అగ్నిప్రమాదం

- నలుగురు మృతి, 10 మందికి గాయాలు
- నవీ ముంబయిలో ఘటన



ముంబయి : నవీ ముంబయిలో మంగళవారం తెల్లవారు జామున జరిగిన అగ్ని ప్రమాదంలో నలుగురు మృతి చెందారు. మరో 10 మంది తీవ్రంగా గాయపడ్డారు. వాషి ప్రాంత టౌన్‌షిప్‌లోని సెక్టార్ 14లో ఉన్న 21 అంతస్తుల భవనంలో ఈ ప్రమాదం జరిగింది. తొలుత 20వ అంతస్తులోని ఒక ఫ్లాట్‌లో అర్ధరాత్రి 12:30 గంటల సమయంలో మంటలు చెలరేగాయి. ఆ తరువాత పై అంతస్తులకు వ్యాపించాయి. సమాచారం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు వెంటనే అక్కడకు చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఎనిమిది అగ్నిమాపక శకటాలతో 40 మంది సిబ్బంది మంటలను అదుపుచేసేందుకు ప్రయత్నించారు. చివరకు మంగళవారం ఉదయం 6 గంటల సమయానికి మంటలు అదుపులోకి వచ్చాయి. మృతుల్లో ఇద్దరు మహిళలు, బాలిక(6), ఒక పురుషుడు ఉన్నారు. గాయపడిన వారిని వాషిలోని వివిధ ఆసుపత్రులకు తరలించారు. ఈ ప్రమాదంపై విచారణ కొనసాగుతోందని అధికారులు తెలిపారు.

హిందీ మేధావి ఒర్సినీ అడ్డగింత

- ఢిల్లీ విమానాశ్రయం నుంచి వెనక్కి పంపిన అధికారులు
- ప్రభుత్వ తీరుపై పలువురి ఆగ్రహం



న్యూఢిల్లీ : సరైన వీసా పత్రాలు ఉన్నప్పటికీ ప్రముఖ హిందీ పండితురాలు ఫ్రాన్సిస్కా ఒర్సినీని ఢిల్లీ విమానాశ్రయం నుంచి వెనక్కి పంపారు. ఆమె ప్రపంచవ్యాప్తంగా ఎంతో గుర్తింపు, గౌరవం పొందిన వ్యక్తి. తన జీవితాన్ని హిందీ భాష, సాహిత్యాన్ని అధ్యయనం చేసేందుకే వెచ్చిస్తున్నారు. లండన్ విశ్వవిద్యాలయంలోని స్కూల్ ఆఫ్ ఓరియంటల్ అండ్ ఆఫ్రికన్ స్టడీస్ (ఎస్ఒఎ-ఎస్)లో ప్రొఫెసర్ ఎమిరిటాగా అనేక సంవత్సరాలుగా పని చేస్తున్నారు. అలాంటి ఓ గౌరవనీయమైన వ్యక్తిని... అందునా సరైన వీసా పత్రాలు ఉన్న మేధావిని భారత్‌లో ప్రవేశించకుండా ఎందుకు అడ్డుకున్నారు? గతంలో ఇలాగే ముగ్గురు విద్యావేత్తలను దేశంలో అడుగు పెట్టకుండా నిరోధించారు. ఒర్సినీ దేశంలో ప్రవేశిస్తే తమకు ముప్పు అని ఎవరు భావిస్తున్నారు?. విదేశీయులు భారత్ గురించి అర్థం పర్థం లేని విషయాలు రాస్తుంటారని, ఇది దేశ ప్రతిష్టను దెబ్బతీస్తుందని కేంద్రంలోని మోడీ ప్రభుత్వం భావిస్తోంది. వారి రచనలపై ఆంక్షలు విధించే అవకాశం లేనందున ప్రవేశాలను అడ్డుకుంటోంది. ఒర్సినీ రచనలు మున్నెన్నడూ రాజకీయ లేదా విద్యా వివాదాలకు దారితీయలేదు. బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కేంద్ర విశ్వవిద్యాలయాలన్నింటికీ ఓ సర్క్యులర్ జారీ చేసింది. అదేమిటంటే... ఏదైనా విద్యా సంబంధమైన కార్యక్రమానికి వక్తలను ఆహ్వానించే ముందు వారి జాబితాను సంబంధిత పాలక మండలి పరిశీలించి ఆమోదించాల్సి ఉంటుంది.

ఒర్సినీని దేశంలో ప్రవేశించకుండా అడ్డుకోవడం విద్యా స్వేచ్ఛకు విఘాతం కలిగించడమే అవుతుందని విద్యావేత్తలు ఆందోళన వ్యక్తం చేశారు. ఆమెకు చెల్లుబాటయ్యే ఐదు సంవత్సరాల ఈ-వీసా ఉంది. అయినప్పటికీ మంగళవారం తెల్లవారుజామున విమానం నుంచి దిగిన ఆమెను అప్పటికప్పుడే వెనక్కి పంపారు. చైనాలో ఓ విద్యా సదస్సుకు హాజరై హాంగ్‌కాంగ్ మీదుగా ఆమె న్యూఢిల్లీ చేరుకున్నారు. ఇక్కడ ఉన్న స్నేహితులను కలుసుకోవాలని ఆమె అనుకున్నారు. గత ఏడాది అక్టోబర్‌లో కూడా ఆమె మన దేశంలో పర్యటించారు. ఢిల్లీ విమానాశ్రయం వద్ద ఒర్సినీ విలేకరులతో మాట్లాడుతూ 'నన్ను వెనక్కి పంపుతున్నారు. నాకు తెలిసింది అంతే' అని అన్నారు. తనను తిప్పి పంపడానికి ఇమ్మిగ్రేషన్ అధికారులు ఎలాంటి కారణాలు చెప్పలేదని తెలిపారు. తిరిగి లండన్ వెళ్లిపోవాల్సిందిగా ఆమెకు సూచించారు. గతంలో ఆంత్రోపాలజిస్ట్ ఫిలిప్పో ఒసెల్లా, ఆర్కిటెక్ట్ లిండ్సే బ్రెమ్నర్, కాశ్మీరీ విద్యావేత్త నిటాషా కౌల్‌ను కూడా దేశంలో ప్రవేశించకుండా బిజెపి ప్రభుత్వం తిప్పి పంపింది. దేశంలో విద్యా స్వేచ్ఛ క్షీణిస్తోందని చెప్పడానికి ఈ ఘటనలు ఉదాహరణ అని విద్యా సంఘాలు, పౌర సమాజం ఆందోళన వ్యక్తం చేశాయి. తాజా ఘటనపై చరిత్రకారుడు రామచంద్ర గుహ మండిపడుతూ 'ఒర్సినీ ప్రముఖ విద్యావేత్త. పండితురాలు. భారతీయ సాంస్కృతిక చరిత్ర గురించి ప్రపంచ దేశాలు అర్థం చేసుకోవడానికి ఆమె పరిశోధన ఉపకరించింది. పాలకుల్లో నెలకొన్న అభద్రతాభావానికి, మానసిక అపరిపక్వతకు ఈ ఉదంతం అద్దం పడుతోంది' అని ఆయన సామాజిక మాధ్యమ వేదిక ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

ఫ్రాన్స్ మాజీ అధ్యక్షుడు సర్కోజీకి ఐదేళ్ల జైలుశిక్ష అమలు



పారిస్ : ఫ్రాన్స్ మాజీ అధ్యక్షుడు నికొలస్ సర్కోజీ తనకు విధించిన జైలుశిక్షను అనుభవించేందుకు పారిస్‌లోని జైలుకు మంగళవారం చేరుకున్నారు. 2007లో తన ఎన్నికల ప్రచారం కోసం లిబియా నుండి నిధులు తీసుకున్న క్రిమినల్ కుట్ర కేసులో ఆయనకు ఐదేళ్ల జైలు శిక్ష పడింది. ఆధునిక ఫ్రాన్స్‌లో ఇలా జైలు శిక్ష అనుభవించే తొలి నేత సర్కోజీనే. జైలుకెళ్లడానికి ముందుగా ఆయన సోషల్ మీడియాలో ఒక ప్రకటన చేశారు. అమాయకుడైన ఒక వ్యక్తిని అన్యాయంగా లాకప్‌లో వేస్తున్నారు అని వ్యాఖ్యానించారు. గత నెల్లోనే ఆయనపై వచ్చిన అభియోగాలు రుజువై ఆయనకు శిక్ష ఖరారైంది. జైల్లో ఆయనను ఏకాంతంగా వుంచుతారు. భద్రతా కారణాల రీత్యా ఆయనను ఇతర ఖైదీలతో కలిపి వుంచరు. ఈ చర్యతో తాను అమాయకుడినని నిరూపించుకోవాలన్న ఆయన కృతనిశ్చయం మరింత బలోపేతమైందని ఆయన తరపు లాయర్ వ్యాఖ్యానించారు.

జపాన్ ప్రధానిగా తకైచి



టోక్యో (జపాన్) : జపాన్‌లోని లిబరల్ డెమొక్రటిక్ పార్టీ నేత సనే తకైచి ప్రధానిగా ఎన్నికయ్యారు. ఈమె ఆ దేశానికి తొలి మహిళా ప్రధాని కావడం విశేషం. పార్లమెంటులోని దిగువ సభ 465 ఓట్లలో తకైచి 237 ఓట్లను గెలుచుకున్నారు. దిగువ సభలో జరిగిన మొదటి రౌండ్ ఓటింగ్‌లో కాన్‌స్టిట్యూషనల్ డెమొక్రటిక్ పార్టీ నాయకుడు యోషిహికో నోడాకు 149 ఓట్లు రాగా, ఎల్‌డిపి పార్టీ అభ్యర్థి తకైచికి 237 ఓట్లు వచ్చాయి. దీంతో ఆమె ప్రధాని మంత్రిగా బాధ్యతలు స్వీకరించనున్నట్లు జపాన్ న్యూస్ ఏజెన్సీ క్యోడో తెలిపింది. ఆ దేశ ఆర్థిక వ్యవస్థ మందగించడం, అవినీతి కుంభకోణాలు, పార్టీలో అంతర్గత కుమ్ములాటలు... ఇన్ని సవాళ్ల మధ్య సనై తకైచి ప్రధాని బాధ్యతలు స్వీకరించనున్నారు.

యెమెన్ నౌకలో భారతీయులు క్షేమం

- 23మందిని కాపాడిన అధికారులు

డిజిబౌటి సిటీ : పేలుడు సంభవించడంతో యెమన్ తీర ప్రాంతంలో మంటల్లో చిక్కుకుపోయిన ఎంవి ఫాల్కన్ నౌక నుండి 23మంది భారతీయులను కాపాడి డిజిబౌటి తీర ప్రాంత రక్షణ దళాలకు అప్పగించారు. కామెరూన్‌కి చెందిన ఆ నౌక డిజిబౌటికి వెళుతుండగా అడెన్ ఓడరేవుకు ఆగ్నేయంగా వున్న సమయంలో ఈ నెల 18న నౌకలో పేలుడు సంభవించింది. ఆ సమయంలో ఎల్‌పిజిని తీసుకెళుతున్న నౌకలో 26మంది వున్నారు. 23మంది భారతీయులతోపాటు ఒక ఉక్రెయిన్ జాతీయుడిని రక్షించారు. మరో ఇద్దరు గల్లంతయ్యారు. నౌక నుండి సహాయం కోరుతూ అభ్యర్థన రాగానే తమ ఫోర్ కమాండర్ నేతృత్వంలో బలగాలు వారిని కాపాడాయని అస్పీడ్స్ అనే రక్షణ సంస్థ ఒక ప్రకటనలో పేర్కొంది.

గాజా ఒప్పందానికి ఇజ్రాయిల్ తూట్లు

- కొనసాగుతున్న వైమానిక దాడులు, కాల్పులు
- 24గంటల్లో 13మంది మృతి
- నెతన్యాహూతో అమెరికా ప్రతినిధుల భేటీ



గాజా, జెరూసలేం : కాల్పుల విరమణ ఒప్పందం అమల్లోకి వచ్చి పది రోజులు గడిచినా ఇంకా గాజాలో ఇజ్రాయిల్ మిలటరీ దారుణాలు కొనసాగుతున్నాయి. గత 24 గంటల్లో 13 మృతదేహాలు వివిధ ఆస్పత్రులకు వచ్చాయి. అంతకుముందు 24గంటల్లో 45మంది పాలస్తీనియన్లు మరణించారని గాజా ఆరోగ్యశాఖ వర్గాలు తెలిపాయి. ఒప్పందం కుదిరినప్పటి నుండి ఇప్పటివరకు 165మంది పాలస్తీనా ఖైదీల మృతదేహాలను ఇజ్రాయిల్ అప్పగించింది.

గాజాలో కాల్పుల విరమణ ఒప్పందం కుదరడంతో శాంతి వీచికలు వీస్తాయని ప్రకటించిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అందుకు భిన్నంగా ఇజ్రాయిల్ మారణకాండకు పాల్పడుతుండటంతో కాల్పుల విరమణ ఒప్పందం సజావుగా అమలయ్యేలా చూసేందుకు ఉపాధ్యక్షుడు జెడి వాన్స్‌ను టెల్ అవీవ్ పంపారు. వాన్స్ వెంట మధ్య ప్రాచ్య వ్యవహారాలు చూసే దూత స్టీవ్ విట్కాఫ్, ట్రంప్ అల్లుడు జేర్డ్ కుష్నర్ కూడా వున్నారు. గాజాలో సుస్థిరంగా, దీర్ఘకాలం శాంతి నెలకొనాలంటే అనుసరించాల్సిన పంథాపై చర్చించేందుకు వారిక్కడకు వచ్చారు. ఇజ్రాయిల్ ప్రధాని బెంజిమిన్ నెతన్యాహూను విట్‌కాఫ్, కుష్నర్ సోమవారం కలవగా, అమెరికా ఉపాధ్యక్షుడు జెడి వాన్స్, ఆయన సతీమణి ఉషా వాన్స్ మంగళవారం నెతన్యాహూతో భేటీ అయ్యారు. కాల్పుల విరమణ ఒప్పందాన్ని సజావుగా అమలయ్యేలా చూడాల్సిందిగా వాన్స్ నెతన్యాహూను కోరారు. ఈజిప్ట్ ఇంటెలిజెన్స్ చీఫ్ మేజర్ జనరల్ హసన్ మహమూద్ రషీద్ మంగళవారం ఇజ్రాయిల్‌లో అమెరికా ప్రతినిధులతో సమావేశమయ్యారు. కాల్పుల విరమణ ఒప్పందాన్ని పటిష్టంగా అమలు చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఈ సమావేశానికి ఇజ్రాయిల్ అధికారులు కూడా హాజరయ్యారు.

ఇజ్రాయిల్ తీరును ఖండించిన ప్రపంచ దేశాలు

కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఖాతరు చేయకుండా ఇజ్రాయిల్ పదే పదే ఉల్లంఘిస్తుండడాన్ని కతార్ పాలకుడు తీవ్రంగా ఖండించారు. ఇజ్రాయిల్ ఊచకోతకు పాల్పడుతోందని విమర్శించారు. ఈ ఒప్పందం పూర్తిగా అమలవుతుందని గాజా ప్రజలు కూడా ఆశాభావంతో లేరు. గంటకో విధంగా పరిణామాలు మారిపోతున్నాయని ఈ పరిస్థితుల్లో తమరోజు గడవడమే కష్టమైపోతోందని పలువురు పాలస్తీనియన్లు వాపోతున్నారు. ఇప్పటికీ అతి తక్కువగానే గాజాకు ఆహారం వస్తోందని ప్రపంచ ఆహార కార్యక్రమం ప్రతినిధి తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో గాజాలోకి తక్షణమే పెద్ద మొత్తంలో ఆహార ట్రక్కులు వెళ్లాల్సిన అవసరం వుందని ఫ్రాన్స్ అధ్యక్షుడు మాక్రాన్ పేర్కొన్నారు. గాజాలో విభజన లైన్ మరింత స్పష్టంగా తెలియచేసేందుకు ఎల్లో లైన్ దగ్గర కాంక్రీట్ బారికేడ్లను, పోల్స్‌ను నిలబెట్టామని మిలటరీ తెలిపింది. తాము శాంతికి కట్టుబడి వున్నామని, యుద్ధాన్ని సంపూర్ణంగా ముగించడానికి సిద్ధమని హమాస్ పునరుద్ఘాటించింది.

వాషింగ్టన్‌తో అణు చర్చలు ఉండవు

- స్పష్టం చేసిన ఖమేనీ

టెహ్రాన్ : అణు చర్చలు ప్రారంభిద్దామంటూ అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చేసిన ప్రతిపాదనను ఇరాన్ సుప్రీం నేత అయతొల్లా అలీ ఖమేనీ తోసిపుచ్చారు. ఈ ఏడాది జూన్‌లో జరిపిన వైమానిక దాడిలో ఇరాన్ అణు స్థావరాలను ధ్వంసం చేశామంటూ ట్రంప్ చేసిన వాదనను ఖండిస్తూ 'అలా కలలు కంటూనే ఉండండి' అని ఎద్దేవా చేశారు. తనతో కుదుర్చుకునే ఒప్పందం ఫలితాన్ని అమెరికా ముందుగానే నిర్దేశిస్తోందని, బెదిరింపులకు దిగుతోందని ఆయన ఓ ప్రకటనలో ఆరోపించారు. ఇరాన్, అమెరికా దేశాలు ఐదు విడతలుగా పరోక్ష అణు చర్చలు జరిపాయి. జూన్‌లో 12 రోజుల పాటు అమెరికా జరిపిన వైమానిక దాడులతో అవి నిలిచిపోయాయి. ఆ సమయంలో ఇజ్రాయిల్, అమెరికా దళాలు ఇరాన్ అణు స్థావరాలపై బాంబు దాడులు జరిపిన విషయం తెలిసిందే.

'ఒప్పందాన్ని తానే రూపొందిస్తానని ట్రంప్ అంటారు. అయితే బలవంతంగా రుద్దినప్పుడు, దాని ఫలితాన్ని ముందుగానే నిర్ణయించినప్పుడు అది ఒప్పందం ఎలా అవుతుంది? అది బలవంతంగా రుద్దడం లేదా బెదిరించడం అవుతుంది' అని ఖమేనీ సామాజిక మాధ్యమ వేదిక ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

రాజుకుంటున్న ఎన్నికల వేడి

(మొదటిపేజీ తరువాయి)

ప్రజలకు సూచించారు.

ప్రతిపక్షాల అభ్యర్థులను బిజెపి బెదిరిస్తోంది : ప్రశాంత్ కిషోర్

మరోవైపు బిజెపి ఒత్తిళ్లతోనే తమ పార్టీకి చెందిన ముగ్గురు అభ్యర్థులు బరి నుండి వైదొలగారని ఎన్నికల వ్యూహకర్త నుండి రాజకీయ నేతగా మారిన ప్రశాంత్ కిషోర్ మంగళవారం చెప్పారు. పాట్నాలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఓడిపోతామనే భయంతో పాలక ఎన్‌డిఎ వుందని విమర్శించారు. అందుకే ఎన్నికల బరి నుండి వైదొలగాలని ప్రతిపక్షాల అభ్యర్థులను బెదిరిస్తోందని విమర్శించారు. "ప్రజాస్వామ్యం హత్య చేయబడుతోంది. దేశంలో ఇంతకుముందెన్నడూ ఇలాంటిది జరగలేదు." అని ఆయన వ్యాఖ్యానించారు. అభ్యర్థుల భద్రతకు చర్యలు తీసుకోవాలని ఆయన ఎన్నికల కమిషన్‌ను కోరారు. దానాపూర్, బరంపురం, గోపాల్‌గంజ్ సీట్ల నుండి ఉపసంహరించుకోవాలని ఆయా స్థానాల్లో పోటీ చేసే అభ్యర్థులపై వారు ఒత్తిడి తెచ్చారని విమర్శించారు. సూరత్‌లో ఏకగ్రీవంగా ఎన్నికైన నమూనానే ఇక్కడా అమలు చేయాలని బిజెపి ప్రయత్నిస్తోందని ఆయన విమర్శించారు. బీహార్‌లో 243 సీట్లకూ ప్రశాంత్ కిషోర్ పార్టీ అభ్యర్థులను ప్రకటించింది. ముగ్గురు అభ్యర్థులు వైదొలగడంతో ఇక 240 సీట్లకూ పోటీ చేస్తోంది.

ఆర్‌జెడి అభ్యర్థి అరెస్టు

రాష్ట్రంలోని ససారామ్ అసెంబ్లీ సీటు నుండి నామినేషన్ పత్రాలు దాఖలు చేసిన వెంటనే ఆర్‌జెడి అభ్యర్థి సత్యేంద్ర షాను అరెస్టు చేశారు. ఆయనపై నాన్ బెయిలబుల్ వారంటుసహా 20 కేసులు పెండింగ్‌లో ఉండటంతో జార్ఖండ్ పోలీసులు షాను అదుపులోకి తీసుకున్నారని సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులు తెలిపారు. నామినేషన్ పత్రాలు వేసిన తర్వాత ఇండియా బ్లాక్ అభ్యర్థులు ఇలా అరెస్టు కావడం ఇది మూడో సంఘటన. ఇంతకుముందు భోర్, దరౌలి సీట్ల నుండి నామినేషన్లు వేసిన సిపిఐ(ఎంఎల్) అభ్యర్థులు జితేంద్ర పాశ్వాన్, సత్యదేవ్ రామ్‌లను అరెస్టు చేశారు. ఇవన్నీ రాజకీయ దురుద్దేశంతో చేసినవని సిపిఐ(ఎంఎల్) ఒక ప్రకటన విడుదల చేసింది. డబుల్ ఇంజన్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజల్లో పెరుగుతున్న ఆగ్రహావేశాలను ఎదుర్కోలేక బిజెపి - జెడియు కూటమి ఇలా అణచివేత చర్యలకు పాల్పడుతోందని విమర్శించింది.

పోటీ నుంచి తప్పుకున్న జెఎంఎం

బీహార్ అసెంబ్లీ ఎన్నికల పోటీ నుంచి జార్ఖండ్ ముక్తి మోర్చా (జెఎంఎం) తప్పుకుంది. మహాగట్‌బంధన్‌లో ప్రధాన పార్టీలైన ఆర్‌జెడి, కాంగ్రెస్‌లతో సీట్ల సర్దుబాటు విషయంలో ఒప్పందం కుదరక ఈ ఎన్నికల్లో పోటీ చేయడం లేదని జెఎంఎం సోమవారం ప్రకటించింది. నామినేషన్ల ప్రక్రియకు ముందు ఆర్‌జెడి నేత తేజస్వి యాదవ్‌తోనూ, కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే, ఆ పార్టీ సీనియర్ నేత రాహుల్‌గాంధీతోనూ సీట్ల సర్దుబాటుపై జెఎంఎం చీఫ్ హేమంత్ సోరెన్ చర్చలు జరిపారు. జార్ఖండ్, బీహార్ సరిహద్దు జిల్లాల్లో దాదాపు 20కి పైగా సీట్లలో పోటీ చేసేందుకు జెఎంఎం సిద్ధమైంది. జెఎంఎం కోరినట్లు కాంగ్రెస్, ఆర్‌జెడి పార్టీలు ఆ స్థానాల్ని కేటాయించలేదు.

లాలూపై విమర్శలతో నితీష్ ప్రచారం

అధికారంలో వుండగా లాలూ ప్రసాద్ మహిళలకు చేసిందేమీ లేదని ముఖ్యమంత్రి నితీష్ కుమార్ అన్నారు. ముజఫర్ జిల్లాలోని మీనాపూర్ నియోజకవర్గంలో మంగళవారం తన ఎన్నికల ప్రచారాన్ని ఆయన ఆరంభించారు. మహిళా సాధికారతకు తమ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల గురించి ఆయన మాట్లాడారు.

సిపిఎం అభ్యర్థుల ప్రచారానికి విశేష స్పందన

బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో నామినేషన్ ప్రక్రియ ముగియడంతో సిపిఎం అభ్యర్థులు జోరుగా ప్రచారం నిర్వహిస్తున్నారు. బిభూతిపుర్ స్థానం నుంచి అజయ్‌కుమార్, హయఘట్ నుంచి శ్యామ్ భర్తి, పిప్రా నుంచి రాజ్‌మంగళ్ ప్రసాద్, మాంఝీ నుంచి సత్యేంద్ర యాదవ్‌లను సిపిఎం పోటీలో నిలిపింది. బహిరంగ సభలు, ర్యాలీలతోపాటు ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్నారు. మోడీ ప్రభుత్వ పతనం బీహార్ నుంచే ప్రారంభించాలని ప్రజలకు పిలుపునిస్తున్నారు. వీరి ప్రచారానికి ప్రజల నుంచి విశేష ఆదరణ లభిస్తోంది.

ముందస్తు అనుమతి లేకుంటే నో యాడ్స్ : ఇసి

ముందస్తు అనుమతి, ధ్రువీకరణ లేకుండా పోలింగ్ రోజున, అంతకుముందు రోజున ప్రింట్ మీడియాలో ఏ రాజకీయ పార్టీ, అభ్యర్థి, సంస్థ లేదా వ్యక్తి వాణిజ్య ప్రకటనలను ప్రచురించడానికి అనుమతించబోమని ఎన్నికల కమిషన్ మంగళవారం స్పష్టం చేసింది. మీడియా సర్టిఫికేషన్ అండ్ మోనిటరింగ్ కమిటీ (ఎంసిఎంసి) ఆ సమాచారాన్ని చూసి, ముందుగా సర్టిఫై చేస్తేనే దాన్ని యాడ్‌గా ప్రచురించవచ్చని పేర్కొంది.

శబరిమల ఆలయంలో బంగారం వివాదం

- హైకోర్టుకు మధ్యంతర నివేదిక

కొచ్చి : శబరిమల ఆలయంలో బంగారం వివాదం కేసుపై దర్యాప్తు నిర్వహిస్తున్న ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) తన మధ్యంతర నివేదికను కేరళ హైకోర్టుకు మంగళవారం సమర్పించింది. ఈ కేసు విచారణను ఈ నెల ప్రారంభంలో ఎస్‌పి ఎస్.శశిధరణ్ నేతృత్వంలోని సిట్‌కు హైకోర్టు అప్పగించిన సంగతి తెలిసిందే. నివేదికను సీల్డ్‌కవర్‌లో శశిధరణ్ కోర్టుకు అందజేశారు. మంగళవారం ఈ కేసు విచారణను జస్టిస్ రాజా విజయరాఘవన్, జస్టిస్ కెవి జయకుమార్‌లతో కూడిన ధర్మాసనం నిర్వహించింది. ఈ విచారణ సందర్భంగా కోర్టులోకి సాధారణ ప్రజలను, మీడియా ప్రతినిధులను అనుమతించలేదు. శబరిమల ఆలయంలోని బంగారు పూత పోసిన ద్వారపాలకులు రాగి విగ్రహాల బరువు 2019 నుంచి 4.5 కేజీలు తగ్గడంపై వివాదం ఏర్పడింది. దీనిపై సిట్ విచారణ నిర్వహిస్తుంది. ఎలక్ట్రోప్లేటింగ్ కోసం విగ్రహాలను చెన్నైకు చెందిన వ్యాపారవేత్త ఉన్నికృష్ణన్ పొట్టికి పంపిన తరువాత విగ్రహాల బరువు తగ్గిన విషయాన్ని ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డు (టిడిబి) విజిలెన్స్ విభాగం గుర్తించింది. దీనిపై కేసు నమోదు చేయాలని, సిట్‌ను ఏర్పాటు చేయాలని హైకోర్టు ఆదేశించింది. 'అదృశ్యమైన' బంగారానికి సంబంధించిన రికార్డులు, ఇతర ఆధారాల కోసం ఉన్నికృష్ణన్ పొట్టి నివాసంలో శనివారం సోదాలు నిర్వహించింది. ఈ వివాదంలో ఉన్నికృష్ణన్ పొట్టి, మరో తొమ్మిది మందిని దోషులుగా సిట్ భావిస్తోంది. ఉన్నికృష్ణన్ పొట్టి 2004 నుంచి 2008 వరకూ ఆలయంలోని ఒక పూజారికి సహాయకుడిగా పనిచేశారని, ఆయనకు విగ్రహాల్లోని బంగారు పూత గురించి తెలుసునని సిట్ వెల్లడించింది. ఈ విగ్రహాలను 1998లో పారిశ్రామికవేత్త విజయ్ మాల్యా విరాళంగా ఇచ్చారు.

తిరుమలలో కుండపోత

(మొదటిపేజీ తరువాయి)

ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. భారీ వర్షాలకు బుచ్చినాయుడు కండ్రిలో వరి నారుమడులు పూర్తిగా దెబ్బతిన్నాయి. నెల్లూరు జిల్లా అనంతసాగరం మండలంలో భారీ కురిసింది. కోతకు వచ్చిన వరి చేలు నీటమునిగాయి. వేరుశనగకు పంటకు కూడా నష్టం వాటిల్లింది. కృష్ణా జిల్లాలోని 11 మండలాల్లో 33.6 మిల్లీమీటర్ల సగటున వర్షపాతం నమోదైంది. ఈనిక దశలోనూ, పాలుపోసుకుని కంకి బరువెక్కిన దశలోనూ ఉన్న వరి చేలు ఈదురుగాలులకు నేలవాలాయి.

పిడుగుపాటుకు ఇద్దరు మృతి

పల్నాడు జిల్లా బెల్లంకొండ మండలం మన్నెసుల్తాన్‌పాలెం గ్రామానికి చెందిన మాటూరి జకరయ్య (22) తన పశువులను మేపడానికి సమీప అడవికి తోలుకెళ్లాడు. వర్షం కురవ్వడంతో ఓ చెట్టు కింద తలదాచుకున్నాడు. వర్షం తగ్గినా బయటకు రాకపోవడంతో తోటి కాపరులు వెళ్లి చూడగా చెట్టుకింద మృతి చెంది ఉన్నాడు. వర్షం కురిసిన సమయంలో ఉరుములు, మెరుపులకు తోడు పిడుగుపడడంతో జకరయ్య మృతి చెంది ఉంటాడని తోటి కాపరులు తెలిపారు. దాచేపల్లి మండలం చేపలగడ్డకు చెందిన వ్యవసాయ కార్మికుడు యడ్ల మాణిక్యం (50) తన పొలానికి వెళ్లి వస్తుండగా అకస్మాత్తుగా వర్షం కురవ్వడంతో ఓ చెట్టు కిందకు వెళ్లారు. అతనికి సమీపంలో పిడుగుపడడంతో ఆయన అక్కడికక్కడే మరణించారు.

నేడు వాయుగుండం

నైరుతి బంగాళాఖాతంలో కేంద్రీకృతమైన అల్పపీడనం బుధవారం మధ్యాహ్నానికి దక్షిణ కోస్తాంధ్ర తీరానికి ఆనుకుని నైరుతి, పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో వాయుగుండంగా రూపాంతరం చెందనుందని విపత్తుల నిర్వహణ సంస్థ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొంది. గురువారం నాటికి మరింత బలపడే అవకాశం ఉందని ఈ సంస్థ ఎండి ప్రఖర్‌జైన్ తెలిపారు. ఈ ప్రభావంతో ప్రకాశం, నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో కొన్ని ప్రాంతాల్లో బుధవారం భారీ నుంచి అతి భారీ వర్షాలు, మిగతా జిల్లాల్లో పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. బాపట్ల, ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో గురువారం భారీ నుంచి అతి భారీ వర్షాలు, మిగిలిన జిల్లాల్లో పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉందని తెలిపారు. దక్షిణ కోస్తా తీరం వెంబడి గంటకు 35 నుంచి 55 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం ఉన్నందున శనివారం వరకు మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లరాదని సూచించారు. ఇప్పటికే అల్పపీడనం ప్రభావం చూపుతున్న జిల్లాల యంత్రాంగాన్ని అప్రమత్తం చేశామని తెలిపారు. ప్రజలు అత్యవసర సహాయం కోసం విపత్తుల నిర్వహణ సంస్థలోని కంట్రోల్ రూమ్ టోల్ ఫ్రీ నెంబర్లు 112, 1070, 18004250101ను సంప్రదించాలని కోరారు.





మీకోసం

చింతపండు రంగు మారకుండా ఉండాలంటే, నిల్వ డబ్బాలో కాస్త గళ్ల ఉప్పును వేసుకోవాలి.

జీవన సౌరభం

పొగిడేవాళ్లు చుట్టూ ఉంటే గెలిచినట్లు కాదు. తిట్టేవాళ్లు పక్కన ఉంటే ఓడినట్లూ కాదు.

మూఢ నమ్మకాలు


చేతనైనది చేసుకుపోవోయ్
చేతి రేఖలకి లేదు ఏ శక్తి
హస్త సాముద్రికాన్ని నమ్మకోయి!

ఏదో రంగంలో కృషి చేయవోయ్
రంగు రాళ్ళకి లేదు ఏ మహిమ
జ్యోతిష్య రత్నాలు ఒట్టివేనోయి!


ఏదో లెక్కకు పని చూసుకోవోయ్
అంకెలు గారడి అంతా బురిడి
అదృష్ట సంఖ్యలు అన్నవి లేవోయ్!

ఏదో దిక్కున నిలదొక్కుకోవోయ్
వీధి పోటులకు లేదు ఏ ప్రభావం
వాస్తు పిచ్చిని విస్మరించవోయి!

జీవిత సార్థకతకు పాటుపడవోయ్
జన్మకుండలిలో లేదు ఏ మహత్యం
గ్రహ స్థానాల భ్రమ వీడవోయి!



- తిప్పాన హరిరెడ్డి, విజయవాడ, 94938 32412.



సరైన పదాలు రాయండి

పిల్లలూ, ఇక్కడ కొన్ని పండ్ల బొమ్మలు ఇచ్చాం. పక్కనే ఉన్న గళ్లల్లో ఆంగ్లంలో వాటిని ఏమంటారో రాయండి.



కె.అభిలాష్,
6వ తరగతి,
ఎంపియుపి స్కూలు, పి.నైనవరం,
విజయవాడ రూరల్ మండలం, ఎన్‌టిఆర్ జిల్లా.



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

పిల్లలను స్వేచ్ఛగా ఎదగనిద్దాం...

పిల్లలను స్వేచ్ఛగా ఎదగనివ్వాలి. వారి ఎదుగుదలకు ప్రోత్సాహాన్ని అందించాలి. ప్రతిదీ చెప్పకుండా కొంత నేర్చుకునేలా చూడాలి. బుడిబుడి అడుగులు వేసే బుజ్జాయి నుంచి పాఠశాలకు వచ్చే విద్యార్థినీ విద్యార్థులపై బలవంతపు ఆలోచనలు జొప్పించ గూడదు. పాకే పిల్లాడు కొద్దిగా పైకి లేవటానికి ప్రయత్నిస్తాడు. ఆ తర్వాత కింద పడుతూనే ఉంటాడు. అయినా మళ్లీమళ్లీ చేసే ప్రయత్నంలో ఎంచక్కా నడుస్తాడు. అలాగే ఎదిగే పిల్లలకు మంచి ప్రోత్సాహం, ఆలోచనా ధోరణి, మంచి చెడుల విచక్షణ వంటి విషయాలను తెలియజేస్తే ఆలోచన పెరిగి అలాగే నడుచుకుంటారు. ప్రతి చిన్న విషయానికి పెద్దవాళ్లు కూడా భయపడి పిల్లలను కూడా భయపడేలా చేయటం సరికాదు. క్రమేపి ప్రతి విషయాన్ని తెలుసుకుంటారు. తల్లిదండ్రులుగా వారికి ధైర్యాన్ని ఇవ్వాలే తప్ప చిన్న విషయాలకు సైతం భయపడితే పిల్లలు కూడా అలాంటి వాతావరణంలోనే పెరుగుతారు. అందుకే పిల్లల పెంపకం విషయంలో తల్లిదండ్రులు బాగా జాగురూకతతో మెలగాలి. ప్రతి చిన్న విషయానికి కోప్పడం, కొట్టడం, తిట్టడం వంటివి కూడా చేయకూడదు. అలాకాదు నాన్నా! ఇలా చేయ్..నీవు ఆ వర్కు చేయగలవు?. చేయగలను అనే నమ్మకంతో ఏ పని ప్రారంభించినా పూర్తవుతుంది. అందుకే ముందుగా ధైర్యంగా ముందుకు వెళ్లాలి. చదువు, ఆరోగ్యం, మనోధైర్యం, ఆత్మవిశ్వాసం వంటి విషయాల్లో పిల్లలకు నిరంతరం ప్రోత్సాహం అవసరం.

మంచి మార్గం చూపాలి : పిల్లలు అల్లరి చేస్తుంటే పెద్దలు సంతోషపడుతుంటారు. అయితే అది శృతిమించకుండా ఉండేలా చూసుకోవాలి. అల్లరి మితిమీరకుండా చూడడం పెద్దల పని. అందుకే పిల్లల్లో సత్ప్రవర్తన, క్రమశిక్షణ పెంచడానికి నిరంతరం ప్రయత్నించాలి. సమాజంలో ఎలా ఉండాలి. ఎలా ఉండకూడదో విడమరిచి చెప్పాలి. ఇది చిన్న విషయమైతే కాదు. తల్లిదండ్రులకు పెద్ద పరీక్ష లాంటిదే. అయినా పిల్లలు మంచి ప్రవర్తనను, మంచితనాన్ని చూపితే వెంటనే స్పందించి, తల్లిదండ్రులు వారిని అభినందించాలి. అలాగని పొగడ్తలతో మరీ విపరీతంగా ముంచెత్తకూడదు. ఏదైనా పరిమితంగా ఉండటం మేలు.

మంచిచెడ్డల విచక్షణ : పిల్లలు ఏదైనా పనిని సరిగ్గా చేసినప్పుడు సానుకూలమైన మాటలతో వారిని ప్రోత్సహించాలి. చిన్న విషయమైనా సరే బాగా చేస్తే మాత్రం వారిని మెచ్చుకోవాలి. పెద్దల పట్ల గౌరవభావంతో ఉండాలి. చదువు పట్ల అలక్ష్యాన్ని ప్రదర్శించొద్దు. ఎవరైనా పెద్దలు, బంధువులు ఇంటికొస్తే వారిని ఆప్యాయంగా పలకరించటం, మంచినీళ్లు తెచ్చి ఇవ్వటం, కూర్చోమని చెప్పటం వంటివి చేసేలా చూడాలి.

కానుకలు : చదువులో బాగా రాణిస్తున్నప్పుడు పిల్లలను పెద్దలు అభినందించాలి. మంచి మార్కులు సాధించినప్పుడు, ఆటల్లో గెలిచినప్పుడు, ప్రాజెక్టు వర్కులు సకాలంలో పూర్తిచేసినప్పుడు 'చక్కగా చేశావు కన్నా' అంటూ భుజం తట్టి అభినందించాలి. మంచి ప్రవర్తనలోనూ, హోంవర్కులు సకాలంలో పూర్తిచేసిన సమయాల్లో 'చాలా త్వరగా చేశావు తల్లీ' అని ప్రశంసిస్తే మరింత ఉత్సాహంగా సబ్జెక్టు అంశాలు పూర్తిచేస్తారు.



ఇలాంటి అభినందనలు, కానుకలు, ప్రశంసలు వారికి గొప్ప బహుమానాలవుతాయి. చదువులో సత్తా చాటినప్పుడో, ఆటల్లో మంచి ప్రతిభ కనబర్చినప్పుడు, చిత్రలేఖనం, ఇతర పోటీల్లో రాణించినప్పుడో చేసిన పనికి గుర్తింపుగా అప్పుడప్పుడు వారికి ఉపయోగపడే చిన్న కానుకలు ఇస్తే సంతోషంగా ఫీలవుతారు. మంచి పని చేసిన ప్రతిసారీ బహుమతులు ఇచ్చే అలవాటు చేయొద్దు. ఏదైనా అవసరానికి తప్ప బహుమానంగా మాత్రం డబ్బులు ఇవ్వొద్దు.

క్షేత్రస్థాయి పర్యటనలు : పిల్లలు ఎప్పుడూ సబ్జెక్టు అంశాలను పుస్తకాల ద్వారా తెలుసుకుంటారు. మనచుట్టూ ఉండే సమాజంలో మనకు అందుబాటులో ఉన్న చారిత్రక, పర్యాటక, వైజ్ఞానిక ప్రాంతాలకు సెలవురోజుల్లోనూ, ఇతర వారాంతపు రోజుల్లోనూ పిల్లలను బయటకు తీసుకెళ్తే కొంత విజ్ఞానాన్ని తెలుసుకుంటారు. కేవలం సబ్జెక్టు అంశాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో భౌతికంగా వాటిని చూసినప్పుడు వారిలో మరింతగా ఆలోచనలు రేకెత్తుతాయి. వీటికి అనుబంధంగా కొత్త విషయాలను తెలుసుకోవాలనే జిజ్ఞాస పెరుగుతుంది. దగ్గర ప్రాంతాలే కాకుండా ఎక్కడికైనా సరదాగా బయటికి పార్కులకు తీసుకెళ్లొచ్చు. అక్కడ ఆడుకునే బల్లలు, వస్తువులు చాలా అందుబాటులో ఉంటాయి. వాటితో ఆడుకుంటూ వారెంతో సంతోషపడుతుంటారు.

పోలిక వద్దే వద్దు : ఇతరులతో పోల్చుతూ పిల్లలను తక్కువ చేసి మాట్లాడటం ద్వారా వారిలో ఆత్మవిశ్వాసం దెబ్బతింటుంది. మానసికంగా ఒత్తిడికి గురౌతారు. చదువులో వెనుకబడ్డా, అప్పజెప్పిన పని సరిగ్గా చేయకపోయినా, సరిగ్గా మార్కులు రాక ఫెయిలైనా, వారు చేసే పనులు నచ్చకపోయినా ప్రతిసారీ తిట్టడం సరికాదు. అంతేకాకుండా నువ్వు ఏదీ చేయలేవు. మిగతా పిల్లలు చూడు ఎలా ఉంటున్నారో, నీ పరిస్థితి ఏమిటో ఇలా ఉండిపోతోంది అంటూ తటపటాయిస్తూ వ్యతిరేక భావంతో మాట్లాడితే పిల్లల్లో ఆత్మవిశ్వాసం తగ్గుతుంది. తల్లిదండ్రుల పట్ల పిల్లల్లో అసహనం పెరుగుతుంది.

సానుకూల దృక్పథం : తరచూ ఏదో ఒక విషయమై పిల్లలను తిడుతూ ఉంటే వారు తమకు ఇష్టమైన పని చేయడానికీ విముఖత చూపుతారు. ఏదైనా విషయం చెబుతున్నా వినడానికి ఇష్టపడరు. మొండితనం, ఎదురు మాట్లాడడం పెరుగుతుంది. ఇలాంటి ప్రవర్తన దీర్ఘకాలంలో దుష్ప్రభావాలకు దారితీస్తుంది. పిల్లలతో కొంత సమయాన్ని గడుపుతూ, వారు చేస్తున్న పనులను గమనిస్తూ ఉండాలి. పిల్లల పనుల్లో చూపించే శ్రద్ధ వారిలో సానుకూల దృక్పథాన్ని, గౌరవాన్ని, నమ్మకాన్ని పెంచుతాయి.




శాంత స్వభావం మేలు : పిల్లలు ఆడేందుకు ఎక్కువగా ఇష్టత చూపుతారు. ఉరుకులు, పరుగులు పెడుతుంటారు. ఇంట్లోనూ, బయట అటూ, ఇటూ పరుగులు పెడుతుంటారు. 'అలా ఇంట్లో పరిగెట్టకండి' అని వార్నింగ్ ఇచ్చినా, 'పరిగెడితే పడతార్రా' అని మంచి మాటలే గట్టిగా అరిచి చెప్పినా అది అరిచినట్లే అవుతుంది తప్ప మంచి చెప్పే ప్రయత్నం కాదు. వారు మీ మాటల్లోని భావం కాకుండా శబ్ద తీవ్రతనే అర్థం చేసుకోగలుగుతారు. 'ఇంట్లో పరిగెత్తితే ఫ్లోర్ తగిలి పడతారు. కాలి జారిపడిపోతారు. కాస్త నడిస్తేనే బావుంటార్రా' అని సున్నితంగా చెప్తే ఆలోచిస్తారు, అర్థం చేసుకుంటారు. అన్నా, చెల్లి, అక్కా, తమ్ముడు దెబ్బలాడుకుంటుంటే 'మీరు ఇలా గొడవ చేస్తే మిమ్మల్ని ఎవరూ ఇష్టపడరు' అని నెమ్మదిగా అర్థమయ్యేలా చెప్పాలి. వాళ్లు మీరు చెప్పినట్లే ప్రవర్తించినప్పుడు 'మీరు ఇలా ఉంటే నాకిష్టం' అని మెచ్చుకోవాలి. అలాగని ప్రతిసారీ పిల్లల సరదాలను అడ్డుకోకూడదు. మీరు ముఖ్యమైన పనుల్లో ఉన్నప్పుడు, ఇబ్బంది కలుగుతున్నట్లు అనిపించినప్పుడు మాత్రం పిల్లలను వారించొచ్చు. అదీ అర్థమయ్యేలా. అప్పుడప్పుడూ తల్లిదండ్రులూ పిల్లలతో కలిసి అల్లరి చేయొచ్చు. అలాంటి వాతావరణం పిల్లలకు ఆహ్లాదాన్ని కలిగించడమే కాక, పిల్లలను తల్లిదండ్రులకు మరింత దగ్గర చేస్తుంది.

క్రమశిక్షణ : పిల్లలు ఎప్పుడూ అన్ని పనులూ బ్రహ్మాండంగా చేయాలని, నూరుశాతం క్రమశిక్షణతో ఉండాలని తల్లిదండ్రులు ఆశించకూడదు. క్రమశిక్షణగా ఉండాలనే పిల్లల ప్రయత్నాన్ని వారి చంచల మనస్సు ఎప్పటికప్పుడు అడ్డుకుంటుంది. కాబట్టి వారు చూపించే కొద్దిపాటి సత్ప్రవర్తననే మెచ్చుకుంటే పిల్లలు మరింత క్రమశిక్షణగా ఉండడానికి ప్రయత్నం చేస్తారు.



- ముత్తిరెడ్డి రమ,
హిందీ స్కూల్ అసిస్టెంట్,
నిడమర్రు గ్రామం,
మంగళగిరి మండలం,
గుంటూరు జిల్లా.



ప్రభాస్ కొత్త సినిమా పోస్టర్

హను రాఘవపూడి దర్శకత్వంలో ప్రభాస్ నటిస్తున్న తాజా చిత్రం ఇటీవల ప్రారంభమైంది. ఈ సినిమాకు 'ఫౌజీ' అనే టైటిల్‌ని ఖరారు చేసినట్లు వార్తలు వస్తున్నాయి. ఈ సినిమాలో ఇమాన్వీ హీరోయిన్‌గా నటిస్తుండగా.. అనుపమ్ ఖేర్, మిథున్ చక్రవర్తి కీలక పాత్రలు చేస్తున్నారు. ఈ చిత్రబృందం దీపావళి కానుకగా ఒక పోస్టర్‌ను విడుదల చేసి అభిమానులకు పండగ శుభాకాంక్షలు తెలిపింది. యుద్ధభూమిలో బెటాలియన్‌లా నిలబడిన ప్రభాస్ నీడ ఇందులో కనిపిస్తోంది.


దర్శకత్వ బాధ్యతల్లో సుకుమార్ శిష్యులు




సుకుమార్ శిష్యుల్లో ఇప్పటికే బుచ్చిబాబు, శ్రీకాంత్ ఓదెల, కార్తీక్ దండు వంటి వాళ్లు తమదైన శైలిలో సినిమాలు చేస్తూ ఇండస్ట్రీలో రాణిస్తున్నారు. ఇప్పుడు ఆయన మరో ఇద్దరు శిష్యులు దర్శకత్వ రంగ బాధ్యతల్లో ప్రవేశించ డానికి సిద్ధంగా ఉన్నారు. అందులో వీర దర్శకత్వంలో కిరణ్ అబ్బవరం హీరోగా ఒక ప్రాజెక్ట్ కన్ఫర్మ్ అయింది. అలాగే సుకుమార్ శిష్యుల బ్యాచ్‌లో మరో దర్శకురాలు పేరు తాజాగా తెర మీదకు వచ్చింది. మాధురి సుకుమార్ దగ్గర అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. ఆమె ఇప్పుడు సుమంత్ ప్రభాస్ హీరోగా ఒక ప్రాజెక్ట్ సెట్ చేసినట్లుగా తెలుస్తోంది. ఈ ప్రాజెక్టులన్నీ సుకుమార్ రైటింగ్స్ బ్యానర్ మీద సుకుమార్ నిర్మించ బోతున్నారు. సుకుమార్ బ్యానర్‌తో పాటు మరో బ్యానర్‌ని కూడా కలుపుకుని ఫైనాన్షియల్స్ అన్నీ ఆ బ్యానర్ చేత పెట్టిస్తారని, క్రియేటివ్స్ అన్నీ సుకుమార్ దగ్గరుండి చూసుకుంటారని తెలుస్తోంది.

సైకిల్‌పై వచ్చిన 'మన శంకర వరప్రసాద్..'

చిరంజీవి హీరోగా అనిల్ రావిపూడి డైరెక్షన్‌లో వస్తున్న 'మన శంకర వర ప్రసాద్ గారు' మూవీ నుండి దీపావళి సందర్భంగా స్పెషల్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. 'మన శంకర వరప్రసాద్ తరపున అందరికీ దీపావళి శుభాకాంక్షలు చెబుతూ.. నవ్వుల టపాసులు సంక్రాంతికి పేలుద్దాం' అని డైరెక్టర్ అనిల్ రావిపూడి ఈ పోస్టర్ కింద రాసుకొచ్చారు. నయనతార ఇందులో హీరోయిన్‌గా చేస్తున్నారు. అర్చన సమర్పణలో షైన్ స్క్రీన్స్ బ్యానర్ పై సాహు గారపాటి, సుష్మిత కొణిదెల గోల్డ్ బాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్‌తో కలిసి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.



గోవర్ధన్ అస్రాని కన్నుమూత



బాలీవుడ్ ప్రముఖ నటుడు, దర్శకుడు గోవర్ధన్ అస్రాని (84) కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన సోమవారం సాయంత్రం తుది శ్వాస విడిచారు. ఆయన మృతి పట్ల పలువురు సినీ ప్రముఖులు, అభిమానులు సోషల్ మీడియా వేదికగా సంతాపం ప్రకటించారు. గోవర్ధన్ అస్రాని 1941లో జైపూర్‌లోని ఓ మధ్యతరగతి కుటుంబంలో జన్మించారు. ఆయన తండ్రి షామీయానా దుకాణాన్ని నిర్వహించేవారు. ఫ్యామిలీ బిజినెస్‌పై అస్రానికి ఆసక్తి ఉండేది కాదు. చదువుతున్న రోజుల్లోనే ఆలిండియా రేడియోలో వాయిస్ ఆర్టిస్ట్‌గా పని చేశారు. దర్శకులు కిశోర్ సాహు, హృషికేష్ ముఖర్జీ సలహా మేరకు పుణె ఫిల్మ్ ఇనిస్టిట్యూట్‌లో చేరారు. 'హమ్ కహా జా రహే హై'(1966) చిత్రంతో వెండితెర ఎంట్రీ ఇచ్చారు. 'షోలే'లోని జైలర్ పాత్ర ఆయనకు మంచి గుర్తింపుని తెచ్చిపెట్టింది. గోవర్ధన్ అస్రాని 50 ఏళ్ల సినీ జీవితంలో 350కి పైగా చిత్రాల్లో నటించారు. కమెడియన్‌గా, సపోర్టింగ్ యాక్టర్‌గా బాలీవుడ్‌లో తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపుని సంపాదించుకున్నారు.

'సినీమాయ' కొత్త పోస్టర్

అనీష్ అయక్కర, విజయ్, రోహిత్, ఆశా సస్మిత, మీనాక్షి తదితరులు ప్రధాన తారాగణంగా రూపుదిద్దుకున్న సినిమా 'సినీమాయ'. రాజాసాగి సత్యనారాయణ రాజు (కుర్రబాబు) నిర్మాతగా, గిరి చిన్నా దర్శకత్వంలో అనఘ దేవి మూవీస్ బ్యానర్‌పై ఈ సినిమా తెరకెక్కింది. ఈ సినిమా ప్రచార పోస్టర్‌ను సోమవారం చిత్ర యూనిట్ విడుదల చేసింది. డిఒపి ఎస్.ప్రసాద్, జయసూర్య, ఎడిటింగ్ పి.శ్యామ్‌కుమార్, సంగీతం ప్రమోద్‌కుమార్ పరిసర్ల అందించారు.



నేడు 'చౌదరి గారి అమ్మాయి' ట్రైలర్

ఎల్లో టకోమా ప్రొడక్షన్ బ్యానర్‌లో ఎడ్‌కాన్ ప్లస్ సంస్థ నిర్మించిన సినిమా 'చౌదరి గారి అమ్మాయి'. కథానాయకుడు వినయ్‌తేజ్, రిషిత కథానాయిక. సిద్ధార్థ వర్మ కాకాని దర్శకత్వంలో తెరకెక్కింది. ఈ సినిమా ట్రైలర్‌ను మంగళవారం ఉదయం విడుదల చేయనున్నామని దర్శకుడు సిద్ధార్థ వర్మ కాకాని తెలిపారు. విడుదల తేదీని కూడా ప్రకటిస్తామని పేర్కొన్నారు.



చివరి బెర్తుపై ఉత్కంఠ

- 23న ఇండియా, న్యూజిలాండ్ మధ్య కీలక పోరు
- ఐసిసి మహిళల వన్డే ప్రపంచకప్



ముంబయి: ఐసిసి మహిళల వన్డే ప్రపంచకప్ మ్యాచ్‌లు ఉత్కంఠభరితంగా సాగుతున్నాయి. మరో రెండు మ్యాచ్‌లు మిగిలి ఉండగానే మూడు జట్లు సెమీస్ బెర్త్‌లను ఖాయం చేసుకోగా.. చివరి, నాల్గో బెర్త్‌పై ఉత్కంఠ నెలకొంది. ఈ బెర్త్ కోసం ఇండియా, న్యూజిలాండ్‌తోపాటు, ఆతిథ్య శ్రీలంక జట్టు కూడా రేసులో నిలవడం గమనార్హం. ఈ మూడు జట్లలో ఎక్కువ శాతం భారత్‌కే సెమీస్ బెర్త్ దక్కే ఛాన్స్ ఉంది. ఎందుకంటే.. తొలి రెండు మ్యాచుల్లో నెగ్గిన టీమిండియా.. ఆ తర్వాత జరిగిన మూడు మ్యాచుల్లో పోరాడి ఓటమిపాలైంది. ఓడిన ఆ మూడు మ్యాచుల్లో కూడా గెలుపుకు చేరువై ఓటమిపాలైంది. దీంతో న్యూజిలాండ్, శ్రీలంకల కంటే మెరుగైన రన్‌రేట్‌ను కలిగి ఉండడమే ఇదుకు ప్రధాన కారణం. ఇప్పటికే ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా, ఇంగ్లండ్ సెమీస్ బెర్తులు ఖాయం కైవసం చేసుకున్నాయి.

పాయింట్ల పట్టిక							
	దేశం	ఆ	గె	ఓ	రద్దు	పా	నె.ర.
1.	దక్షిణాఫ్రికా	6	5	1	0	10	+0.18
2.	ఆస్ట్రేలియా	5	4	0	1	9	+1.81
3.	ఇంగ్లండ్	5	4	0	1	9	+1.49
4.	ఇండియా	5	2	3	0	4	+0.52
5.	న్యూజిలాండ్	5	1	2	2	4	-0.24
6.	శ్రీలంక	6	1	3	2	4	-1.03
7.	బంగ్లాదేశ్	6	1	5	0	2	-0.57
8.	పాకిస్తాన్	6	0	4	2	2	-2.13

ఆ:ఆడినవి; గె:గెలుపు; ఓ:ఓటమి; పా:పాయింట్లు; నె.ర:నెట్‌రన్‌రేట్

నాల్గో బెర్త్‌పై ఉత్కంఠ...

నాల్గో బెర్త్ రేసులో ఉన టీమిండియాతోపాటు న్యూజిలాండ్, శ్రీలంక జట్లు కూడా 4 పాయింట్లతో ఉన్నాయి. టీమిండియా నెట్‌రన్ రేటు +0.526గా ఉండగా.. న్యూజిలాండ్(-0.24), శ్రీలంక(-1.03) భారత్‌కంటే వెనుకబడి ఉన్నాయి. టీమిండియా తన చివరి రెండు మ్యాచుల్లో న్యూజిలాండ్, బంగ్లాదేశ్‌తో తలపడనుంది. 23న నవీ ముంబయిలో న్యూజిలాండ్‌తో జరిగే కీలక పోరులో టీమిండియా గెలిస్తే నేరుగా సెమీస్‌కు దూసుకెళ్తుంది. ఒకవేళ ఆ మ్యాచ్‌లో ఓడితే.. బంగ్లాదేశ్‌పైనా హర్మన్‌ప్రీత్ సేన కచ్చితంగా గెలవాలి. మరోవైపు న్యూజిలాండ్ జట్టు ఇంగ్లండ్ చేతిలో ఓటమిపాలవ్వాలి. ఒకవేళ.. కివీస్‌తో మ్యాచ్ రద్దయి, బంగ్లాపై టీమిండియా నెగ్గినా చివరి బెర్త్ మనకే దక్కనుంది. మరోవైపు శ్రీలంక జట్టు 24న చివరి లీగ్ మ్యాచ్‌లో పాకిస్తాన్‌తో తలపడనుంది. ఆ మ్యాచ్‌లో ఆతిథ్య లంక జట్టు మెరుగైన రన్‌రేట్‌ను సాధిస్తే సమీకరణాలు మారే ఛాన్స్ ఉంది.

టీమిండియాకు ఛాన్స్..

గురువారం జరిగే మ్యాచ్‌లో న్యూజిలాండ్ ను భారత్ ఓడిస్తే సెమీస్ అవకాశాలు మెరుగు పడుతాయి. ఒకవేళ పరాజయం పాలైతే.. సమీ కరణలు చివర జరిగే లీగ్ మ్యాచ్‌పై ఆధారపడ తాయి. అలాకాకుండా భారత్‌ను న్యూజిలాండ్ ఓడించి.. ఇంగ్లండ్ చేతిలో ఓడినా.. భారతజట్టు చివరి లీగ్‌లో బంగ్లాదేశ్‌పై నెగ్గినా.. రన్‌రేట్ కీలకంగా మారనుంది. న్యూజిలాండ్-భారత్ మ్యాచ్ రద్దయితే ఇరుజట్లు ఆడే చివరి లీగ్ మ్యాచ్ ఫలితం కీలకంగా మారనుంది. భారత్, పాక్, లంక జట్లలో ఆరు పాయింట్లు సాధించిన టీమ్ సెమీస్‌కు దూసుకెళ్తుంది. ఈ క్రమంలో టీమిండియాకు ఛాన్స్ దక్కుతుంది.

పాకిస్తాన్ ఔట్..

సెమీస్‌పై ఆశలు పెట్టుకున్న పాకిస్తాన్ జట్టు దక్షిణాఫ్రికా చేతిలో ఓడి టోర్నీ నుంచి నిష్క్రమించింది. వర్షం కారణంగా కుదించిన ఈ మ్యాచ్‌లో డక్‌వర్త్ లూయిస్ పద్ధతిపై దక్షిణాఫ్రికా జట్టు 150 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన దక్షిణాఫ్రికా మహిళలు నిర్ణీత 40 ఓవర్లలో 9వికెట్ల నష్టానికి 312 పరుగుల భారీ స్కోర్ నమోదు చేయగా.. ఛేదనలో మళ్లీ వర్షం కురవడంతో మ్యాచ్‌ను 20 ఓవర్లకు కుదించి పాకిస్తాన్ లక్ష్యాన్ని 213 పరుగులుగా నిర్దేశించగా.. ఆ జట్టు 82 పరుగులే చేసింది. దీంతో దక్షిణాఫ్రికా వరుసగా ఐదో గెలుపుతో పాయింట్ల పట్టికలో అగ్రస్థానానికి ఎగబాకింది. నేడు ఆస్ట్రేలియా-ఇంగ్లండ్ జట్ల మధ్య ఇండోర్ వేదికగా కీలక పోరు జరగనుంది.

50కి 50ఓవర్లు స్పిన్నర్లతోనే..

- వన్డే క్రికెట్‌లో వెస్టిండీస్ నయా చరిత్ర
- బంగ్లాదేశ్‌పై సూపర్ ఓవర్లో గెలుపు

ఢాకా: బంగ్లాదేశ్, వెస్టిండీస్ జట్ల మధ్య జరిగిన రెండో వన్డేలో పలు రికార్డులు నమోదయ్యాయి. ఒక వన్డేలో ఒక జట్టు ఏకంగా 50ఓవర్లను స్పిన్నర్లతోనే పూర్తి చేయగా.. ఆ వన్డేలో ఇరుజట్లు కలిపి ఏకంగా 92ఓవర్లను స్పిన్నర్లతోనే బౌల్ చేయించడం మరో విశేషం. ఢాకా వేదికగా బంగ్లాదేశ్-వెస్టిండీస్ జట్ల మధ్య మంగళవారం జరిగిన రెండో వన్డేలో ఈ రికార్డులు నమోదయ్యాయి. చివరకు విండీస్ 'సూపర్' ఓవర్లో ఒక పరుగు తేడాతో బంగ్లాదేశ్‌పై విజయం సాధించింది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన బంగ్లాదేశ్ జట్టు 7వికెట్ల నష్టానికి 213పరుగులు చేయగా.. అనంతరం విండీస్ జట్టు నిర్ణీత ఓవర్లు ముగిసేసరికి 9వికెట్లు నష్టపోయి 213పరుగులే చేసింది. సూపర్ ఓవర్లో తొలుత విండీస్ 10 పరుగులు చేస్తే.. బంగ్లాదేశ్ 9పరుగులే చేసింది. దీంతో మూడు వన్డేల సిరీస్‌లో ఇరుజట్లు 1-1తో సమంగా నిలువగా.. మూడో, చివరి వన్డే గురువారం జరగనుంది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ షాయ్ హోప్‌కు దక్కింది.

పలు రికార్డులు నమోదు

వన్డే ఫార్మాట్‌లో వెస్టిండీస్ జట్టుకొత్త అధ్యాయం లిఖించింది. ఒక వన్డేలో మొత్తానికి మొత్తం 50 ఓవర్లను స్పిన్నర్లే వేశారు. అకీల్ హొసేన్, రోస్టన్ ఛేజ్, ఖారీ పియెర్రీ, గుడకేశ్ మోతీ, అలిక్ అథనాజే.. ఈ ఐదుగురు స్పిన్నర్లతో తలా పది ఓవర్లు ఇచ్చాడు. దాంతో.. వన్డే చరిత్రలో ఇన్నింగ్స్ ఓటా మొత్తం స్పిన్నర్లు వేసిన మొదటి జట్టుగా విండీస్ సరికొత్త రికార్డు నెలకొల్పింది. దాంతో.. 50 ఓవర్ల ఫార్మాట్‌లో ఈ ఘనత సాధించిన తొలి జట్టుగా వెస్టిండీస్ చరిత్ర సృష్టించింది. గతంలో శ్రీలంక పేరిట ఉన్న రికార్డును విండీస్ బద్దలు కొట్టింది. ఇదివరకూ వన్డేల్లో లంక మూడు పర్యాయాలు స్పిన్నర్లతో అత్యధికంగా 44 ఓవర్లు వేయించింది. 1966లో వెస్టిండీస్‌పై, 1998లో న్యూజిలాండ్‌పై, ఆస్ట్రేలియాపై 2004లో శ్రీలంక స్పిన్నర్లు కలిసి 44 ఓవర్లు బౌలింగ్ చేశారు. ఈ మూడు సందర్భాల్లోనూ ఆ జట్టు పేసర్లు కేవలం ఆరు ఓవర్లకే పరిమితమవ్వడం విశేషం. ఒమన్ జట్టు సైతం ఈ జాబితాలో మూడో స్థానంలో ఉంది.



Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68